# చైనా ఒక నూతన సోషల్-సామ్రాజ్యవాద శక్తి!

# అది ప్రపంచ పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద వ్యవస్థలో అంతర్భాగం!

మే, 2017

కేంద్రకమిటీ

సిపిఐ (మావోయిస్టు)

చైనా ఒక నూతన సోషల్–సామ్రాజ్యవాద శక్తి!

అది ప్రపంచ పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద వ్యవస్థలో అంతర్భాగం!

మే, 2017

కేంద్రకమిటీ

సిపిఐ (మావోయిస్టు) డాక్యుమెంట్

# విషయసూచిక


ముందుమాట .... 5

1. 1949–1976 సోషలిస్టు విప్లవం .... 8

2. రివిజనిస్టు చైనాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ తర్వాతి పరిస్థితి .... 11

3. చైనా ప్రపంచంలో ముఖ్యమైన ఆర్థిక శక్తిగా మారింది .... 27

4. చైనా గుత్త పెట్టుబడిదారీ సంస్థలు .... 31

5. చైనాలో ద్రవ్య పెట్టుబడి .... 35

6. "పెట్టుబడి ఎగుమతి ద్రవ్య పెట్టుబడి యొక్క ప్రపంచాధిపత్యానికి దారితీస్తుంది" .... 38

7. అంతర్జాతీయ ఆర్థిక, సైనిక బ్లాకుల నిర్మాణం, వాటిపై పెరుగుతున్న చైనా సామ్రాజ్యవాదుల పట్టు .... 52

8. చైనా సోషల్–సామ్రాజ్యవాదం .... 55

9. "సామ్రాజ్యవాద చరిత్ర సంక్షోభాలు, యుద్ధాలు, విప్లవాలు, ప్రతీఘాతుక విప్లవాల చరిత్రే" .... 57

ముగింపు .... 64

నోట్స్ .... 66

# ముందుమాట

రివిజనిస్టు-పెట్టుబడిదారీ చైనాలో సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా, మిలటరీపరంగా జరుగుతున్న మార్పులను నిర్దిష్టంగా అధ్యయనం చేయాలని 2007 జనవరిలో జరిగిన సిపిఐ (మావోయిస్టు) ఐక్యతా కాంగ్రెస్-9వ కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని అమలుపరచే బాధ్యత కేంద్రకమిటీకి అప్పగించింది. 4వ సిసి మీటింగ్ నిర్ణయం ప్రకారం చైనా పరిణామాలను, అది ఒక నూతన సోషల్-సామ్రాజ్యవాద శక్తిగా మారిందా అనే విషయాన్ని అధ్యయన అంశంగా చేపట్టింది. దీనిపై అధ్యయనం చేసిన తర్వాత, కేంద్రకమిటీ 5వ సమావేశం ఈ విషయాన్ని చర్చలోకి తీసుకుంది. "నేడు చైనా ఒక నూతన సోషల్-సామ్రాజ్యవాద శక్తిగా మారిందనీ, అది ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద వ్యవస్థలో అంతర్భాగమేననీ, కార్మికవర్గానికి, ప్రపంచ పీడిత జాతులకు, ప్రజలకు శత్రువుగా మారింది" అనే నిర్ణయానికి వచ్చింది.

ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు పార్టీలు, గ్రూపులు, శక్తులు నేడు ప్రపంచవ్యాప్తంగా రివిజనిజాన్ని, సామ్రాజ్యవాదాన్ని, ప్రస్తుతం ప్రపంచ ప్రజల శత్రువుగా మారిన చైనా సోషల్ సామ్రాజ్యవాదాన్ని, అభివృద్ధి నిరోధకత్వాన్ని తుదముట్టించడానికి, కార్మిక-కర్షక, తదితర పీడిత ప్రజలందరినీ, పీడిత జాతులను సంఘటితం చేసి విప్లవోద్యమాన్ని పురోగమింపజేయాల్సి ఉంటుంది. ఈ రెండూ కార్మికవర్గ విప్లవకర అంతర్జాతీయతను కలిగి ఉండే కమ్యూనిస్టు పార్టీలు, సంస్థల ప్రధాన కర్తవ్యాలుగా ఉంటాయి. ఈ కర్తవ్యాలను నెరవేర్చడానికి చైనా సోషల్-సామ్రాజ్యవాద స్వభావాన్ని స్పష్టంగా బహిర్గతం చేయాలి. అంతర్జాతీయంగా వర్గ ధృవీకరణకు అనుగుణ్యంగా నిజమైన శత్రువులను, మిత్రులను వేరుపర్చడానికి సామ్రాజ్యవాద వ్యవస్థలో ఒక ప్రధాన పోటీ సామ్రాజ్యవాద శక్తిగా చైనా రూపొందడాన్ని, దాని అభివృద్ధిని అర్థం చేసుకోవాలి. ప్రపంచంలో అన్ని మౌలిక వైరుధ్యాలు పదునెక్కుతున్న క్రమాన్ని, వాటి నిర్దిష్ట పరిస్థితులను సరిగా విశ్లేషించుకోవాలి. ఈ విషయాలను అధ్యయనం చేస్తే తప్ప, వర్తమాన సామ్రాజ్యవాద వ్యవస్థలోని వైరుధ్యాలను, ఆధునిక రివిజనిస్టు రాజకీయాలనూ, ఆధునిక యుద్ధాలనూ అర్థం చేసుకోలేమూ, సరిగ్గా అంచనా వేయలేము.

సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానం అత్యున్నత దశ అనీ, సామ్రాజ్యవాదమంటేనే యుద్ధం అనీ, అది మరణశయ్యపై ఉన్నదనీ, సామ్రాజ్యవాదమంటే సోషలిస్టు విప్లవ తొలిసంధ్య అనీ లెనిన్ చేసిన సూత్రీకరణలను 20వ శతాబ్దం రుజువు చేసింది. నేటికీ ఇది వర్తిస్తుంది. సామ్రాజ్యవాదం తన లాభాల కోసం ప్రపంచాన్ని విభజించడానికి-పునర్విభజించడానికి సంబంధించిన అత్యున్నత రూపమే యుద్ధం. అది ప్రపంచాధిపత్యం కోసం ఘర్షణలకు దిగుతుంది. యుద్ధం ద్వారా అధిక గుత్త లాభాలనార్జిస్తుంది. సామ్రాజ్యవాదం ఉనికిలో ఉ

న్నంత వరకూ యుద్ధాలు అనివార్యం. అది నయావలసవాద తరహా రూపాల్లో తన దోపిడీ పీడనలను కొనసాగించడం కోసం వెనుకబడిన ప్రాంతాలకు విస్తరిస్తుంది. అది నేటి ప్రపంచంలోని పీడిత జాతులు, ప్రజల పాలిట రక్తపిశాచి. అది వారిని తీవ్రమైన కష్టాల పాల్జేస్తున్నది. "ఆధునిక యుద్ధాలు సామ్రాజ్యవాదం సృష్టించినవే" అని లెనిన్ పదే పదే చెప్పారు. 20వ శతాబ్దపు ప్రథమార్థ భాగంలో జరిగిన రెండు ప్రపంచ యుద్ధాలూ సామ్రాజ్యవాదుల మధ్య ప్రపంచాధిపత్యం కోసం, ప్రపంచాన్ని విభజించుకోవడం- పునర్విభజించుకోవడం కోసం జరిగిన యుద్ధాలే. "నూతన ఆర్థిక రాజకీయ సంక్షోభాల నుండి బయటపడడానికి సామ్రాజ్యవాద దేశాలు చేసిన ప్రయత్నాల ఫలితమే సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధాలు బద్దలు కావడం" అని మావో చెప్పారు.

అమెరికన్ సామ్రాజ్యవాదం యుద్ధాల ద్వారానే ప్రపంచవ్యాప్తంగా సంపదలను దోచుకున్నది. రెండు ప్రపంచ యుద్ధాలలోనూ అమెరికా గుత్త సంస్థలు భారీయెత్తున ఆయుధ సామగ్రిని అమ్ముకొని ఊహించని లాభాలు (wind-fall gains) సంపాదించాయి. ఈ విధంగానే అమెరికా పెట్టుబడిదారీ ప్రపంచంలో సామ్రాజ్యవాద అగ్రరాజ్యంగా, ఆధిపత్య శక్తిగా మారింది. అమెరికా సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ యుద్ధ ఆర్థిక వ్యవస్థగా మారడంతో యుద్ధాలపైనే దాని కేంద్రీకరణ అధికంగా ఉన్నది. అందువల్లనే అది నిరంతరం దురాక్రమణ యుద్ధాలకు పాల్పడుతున్నది. కొరియా, వియత్నాముల నుంచి ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, సిరియాల వరకూ ఈ విషయాన్ని చూడవచ్చు. అందుచేత సామ్రాజ్యవాదం ఉనికిలో ఉన్నంత వరకూ ఆధునిక యుద్ధాలకు వనరు కూడా ఉనికిలో ఉంటుంది. యుద్ధాలను నిర్మూలించాలంటే, మొత్తంగా పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద వ్యవస్థనే నిర్మూలించాలి.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత రెండు అగ్రరాజ్యాల (అమెరికా, అప్పటి సోవియట్ యూనియన్) మధ్య కొనసాగిన ప్రచ్ఛన్న యుద్ధం (కోల్డ్‌వార్)లో భాగంగా అభివృద్ధి చెందిన, వెనుకబడిన దేశాల్లో జరిగిన అత్యధిక యుద్ధాలలో అవి ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ భాగం అయ్యాయి. ఇలా 1945-1990 మధ్య ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో కనీసం 125 స్థానిక యుద్ధాలూ, అంతర్యుద్ధాలూ, సాయుధ ఘర్షణలూ జరిగి నాలుగు కోట్ల మంది ప్రజలు చనిపోగా, లక్షలాది ప్రజలు క్షతగాత్రులయ్యారు. వీటిలో జరిగిన ఆర్థిక నష్టాన్ని లెక్కిస్తే అది రెండవ ప్రపంచ యుద్ధపు మొత్తం లెక్కల కంటే ఎంతో అధికంగా ఉంటుంది.

1990ల నుండి ఇటువంటి యుద్ధాలు మరెన్నో చోటు చేసుకున్నాయి. ఈ 21వ శతాబ్దంలో అమెరికా సైన్యం కుట్రపూరితంగా హొండూరస్, ఉక్రెయిన్, ఈజిప్టులలో సాగించిన సైనిక తిరుగుబాట్లలో; బ్రెజిల్‌లో పార్లమెంట్ కుట్ర; అమెరికా మిత్రకూటమి 20 దేశాలలో కొనసాగించిన సైనిక జోక్యాల కారణంగా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా 3 కోట్ల 20 లక్షల మంది ముస్లిముల మరణాలకు దారితీసింది; ఆఫ్రికాలో సెక్యులర్, ధనిక దేశమైన లిబియాను ధ్వంసం చేసి,

ఒకప్పుడు ప్రపంచంలో ప్రవాసులకు అత్యధికంగా ఆశ్రయాన్ని కల్పించిన ఆ దేశంలోని సగానికి పైగా జనాభాను విస్థాపితం చేసింది; ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మంది అత్యంత పేదరికంలో, సుదీర్ఘకాలంగా పోషకాహార లోపంతో జీవిస్తున్నారు; సంవత్సరానికి ఒక కోటి 70 లక్షల మంది పేదరికంతో మరణిస్తున్నారు, ఇందులో సగం మంది పిల్లలు; అమెరికా తన దేశంలోని ప్రజల సంక్షేమాన్ని సైతం పక్కన బెట్టి పెరిగిపోయిన ఇజ్రాయిల్ ఖర్చులను పూడ్చేందుకు దీర్ఘకాల ప్రాతిపదికన 40 ట్రిలియన్ డాలర్లు చెల్లించేందుకూ, ముస్లిములను ఊచకోత కోయడం కోసం ట్రిలియన్ల (వందల వేల కోట్ల) డాలర్లను 'వార్ ఆన్ టెర్రర్' (వార్ ఆన్ ముస్లిమ్స్) పేరుతో ఖర్చు చేయడం వల్లా సంవత్సరానికి 17 లక్షల మంది అమెరికా పౌరులు మరణిస్తున్నారు.

సిరియాలో బషర్ అల్ అసద్ ప్రభుత్వాన్ని కూలదోయడం కోసం ఐదు సంవత్సరాలకు పైగా అమెరికా సామ్రాజ్యవాదుల నాయకత్వంలో సాగిన దాడుల ఫలితంగా 5 లక్షల మంది ప్రజలు మరణించారు, దాదాపు 20,00,000 మంది గాయపడ్డారు. ఒక కోటి 20 లక్షల మంది ఈ యుద్ధం వల్ల విస్థాపితులయ్యి పక్కనున్న దేశాలకు, యూరప్ దేశాలకు వలస పోయారు. శాంతి-సహనాలతో, అనేక ప్రాచీన విశ్వాసాలతో కూడిన తెగలు శాంతియుత సహజీవనం చేసిన ఆ సెక్యులర్ సమాజాన్ని ధ్వంసం చేసింది. గత దశాబ్దంన్నర కాలంగా ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, లిబియా, సిరియా తదితర దేశాల్లో సాగుతున్న సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాల ఫలితంగా లక్షలాది మంది చనిపోయి, లక్షలాది మంది గాయపడి, లక్షలాది మంది పక్క దేశాలకు, యూరప్ దేశాలకు వలస పోవడం పెరుగుతోంది.

సామ్రాజ్యవాద వ్యవస్థను రక్షించుకోవడానికి, ప్రపంచ ప్రజలను మోసగించడానికి సామ్రాజ్యవాదులు, రివిజనిస్టులు మారుతున్న పరిస్థితులకు అనుగుణ్యంగా అన్ని విధాలా ప్రజలను మభ్యపెట్టేందుకు కట్టుకథలు అల్లుతుంటారు. వీటిని ఎప్పటికప్పుడు ఎండగడుతూ ఓడించాలి. సామ్రాజ్యవాదపు సాధారణ రాజకీయ ప్రతీఘాతుకత్వం, గుత్త పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సహజ రాజకీయ ప్రతిఫలనమే. ఫాసిస్టు నియంతృత్వాన్ని అమలు చేసి ప్రజలను అణచివేయడానికి గానూ, సామ్రాజ్యవాదం తన రాజ్యాంగయంత్రాన్ని అపరిమితంగా విస్తరిస్తుంది. అణచివేత ఎంత అధికమైతే, ప్రతిఘటన అంతగా బలపడుతుంది. దినదినమూ చైతన్యవంతమవుతున్న పీడిత జాతులు, కార్మిక-కర్షక, పెటీబూర్జువా, తదితర పీడిత ప్రజలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అవిశ్రాంతంగా విప్లవ పోరాటాలు జరుపుతున్నారు. సామ్రాజ్యవాదాన్ని ఈ భూమండలం నుంచి తుదముట్టించి ప్రపంచవ్యాప్తంగా సోషలిజం-కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో మన పార్టీ సిపిఐ (మావోయిస్టు) ప్రపంచ పీడిత జాతులు, ప్రజలను ఐక్యం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తుంది, వారికి నాయకత్వం వహిస్తుంది, వారితో భుజం-భుజం కలిసి పోరాడుతుంది.

ప్రస్తుతం చైనా సోషల్ సామ్రాజ్యవాదంగా ముందుకు వచ్చిన పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మికవర్గ పార్టీలు అందుకు అనుగుణంగా ఎత్తుగడలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. వాటి ఆధారంగా ప్రపంచ సోషలిస్టు విప్లవంలో కార్మికవర్గ నాయకత్వంలో పీడిత జాతులను, ప్రజలను సమీకరించాల్సిన అవసరం ఉంది. కనుక, ఒకప్పటి సోషలిస్టు చైనా ఏ రకంగా పెట్టుబడిదారీ దేశంగా, సామ్రాజ్యవాద శక్తిగా మారిందో వివరిస్తూ, దీనికి వ్యతిరేకంగా చేపట్టాల్సిన ఎత్తుగడలను పేర్కొంటూ మన పార్టీ కేంద్రకమిటీ ఈ డాక్యుమెంట్‌ను విడుదల చేస్తున్నది. దీన్ని లోతుగా అధ్యయనం చేద్దాం. మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్ సామ్రాజ్యవాదపు ప్రత్యేక స్వభావం గురించి బోధించిన మూడు అంశాల, ఐదు మౌలిక స్వాభావిక లక్షణాల వెలుగులో చైనా సోషల్ సామ్రాజ్యవాద అభివృద్ధిని విశ్లేషించి, సంశ్లేషించడానికి, ఎంఎల్ఎం సిద్ధాంత వెలుగులో సరైన శాస్త్రీయ అవగాహనను ఏర్పాటు చేసుకోవడానికి పూనుకుందాం.

## 1. 1949-1976 సోషలిస్టు విప్లవం

1949లో చైనాలో నూతన ప్రజాస్వామిక విప్లవం పూర్తయిన పిమ్మట, చైనా కమ్యూనిస్టు పార్టీ మావో మార్గదర్శకత్వాన "మూడేళ్ల సన్నాహం, పదేళ్ల ప్రణాళికాబద్ధమైన ఆర్థిక నిర్మాణం" అనే విధానాన్ని చేపట్టింది. ఫలితంగా 1956 నాటికి వ్యవసాయంలోనూ, చేతివృత్తులలోనూ, పెట్టుబడిదారీ పరిశ్రమలలోనూ, వర్తకంలోనూ, ఉత్పత్తి సాధనాలపై వ్యక్తి యాజమాన్యం మౌలికంగా రద్దయ్యింది. వ్యవసాయంలో సమిష్టి పద్ధతి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. చైనాలో ప్రాథమికంగా సోషలిస్టు పరివర్తన పూర్తయి సోషలిస్టు సమాజం ఏర్పడింది. చైనా నూతన ప్రజాస్వామిక రాజ్యం సోషలిస్టు రాజ్యంగా మారింది. సోషలిజంలో లాభాపేక్షతో కాకుండా సమాజపు అవసరాలు తీర్చడం కోసం ఉత్పత్తికై పథకాలను రూపొందించడం కొనసాగింది. ఈ కాలంలో సోషలిస్టు చైనాకు అంతర్గత, బహిర్గత రుణం లేదు. ఇది ప్రపంచ సోషలిస్టు విప్లవ పురోగమనం కోసం ఒక విప్లవ స్థావర ప్రాంతం పాత్రను పోషించింది. సోవియట్ యూనియన్‌లో కృశ్చేవ్ ముఠాచే పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగిన తర్వాత ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద మార్కెట్ వ్యవస్థకూ, రెండు అగ్రరాజ్యాల (అమెరికా, సోవియట్ యూనియన్) అధీన క్షేత్రాలకూ బయట స్వతంత్రంగా మిగిలి ఉన్నది ఒక్క సోషలిస్టు చైనా మాత్రమే.

సోషలిస్టు చైనాలో "స్వావలంబన" విధానం మీద ఆధారపడి "పురోగమనానికి ఒక గొప్ప ముందడుగు" (గ్రేట్ లీప్ ఫార్వార్డ్), "విప్లవాన్ని అర్థం చేసుకోండి, ఉత్పత్తిని పెంపొందించండి" ఉద్యమాలు నడిచాయి. వ్యవసాయం, పరిశ్రమ – (రెండు కాళ్లపై నడవడం)లపై ఆధారపడుతూ సమన్వయంతో వర్గ పోరాటం, ఉత్పత్తి కోసం పోరాటం, శాస్త్రీయ ప్రయోగాల ద్వారా స్వతంత్ర

టెక్నాలజీ, దేశీయ వనరులపై ఆధారపడి పురోగమించాలనే అవగాహనను అది ముందుకు తెచ్చింది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవకరమైన మార్పులు జరిగాయి. కార్మికుల, రైతుల జీవన ప్రమాణాలు చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగాయి. నిరుద్యోగాన్ని రూపుమాపారు. అందరికీ పనిని గ్యారంటీ చేశారు.

ఒక దశాబ్ద కాలంపైగా సాగిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవ (జిపిసిఆర్) కాలంలో చైనా పారిశ్రామిక ఉత్పత్తి సంవత్సరానికి సగటున 13.5 శాతం పెరిగింది. ఈ కాలంలో జరిగిన పారిశ్రామికీకరణ వేగం మరి ఏ ఇతర దేశాల కంటే అధికంగా ఉండింది. జర్మనీ, జపాన్, సోవియట్ యూనియన్ పారిశ్రామిక అభివృద్ధిని మించిపోయింది. జిపిసిఆర్ కాలంలో రివిజనిస్టుల నుండి స్వల్ప అవాంతరాలు ఏర్పడినప్పటికీ ఉత్పత్తిలో అభివృద్ధి కొనసాగింది. బొగ్గు, రసాయనాలు, విద్యుచ్ఛక్తి ఉత్పత్తిలో సంవత్సరానికి 9.2 శాతం పెరుగుదల రేటు కొనసాగింది. పెట్టుబడిదారీ మార్గీయులైన లీ షావ్–చీ, లిన్ పియావో, డెంగ్ సియావోపింగ్ ముందుకు తీసుకువచ్చిన విప్లవ ప్రతీఘాతుక పంథా అయిన 'ఉత్పత్తి శక్తుల' రివిజనిస్టు సిద్ధాంతానికి[1] వ్యతిరేకంగా తీవ్ర వర్గ పోరాటం జరిగింది. సైద్ధాంతిక రంగంలో మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానానికీ, రివిజనిజానికీ మధ్య పోరాటం పదునుగా, క్లిష్టంగా కొనసాగింది. జిపిసిఆర్ కాలంలో విద్య, ప్రజాస్వామీకరణ, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలలో, పితృస్వామిక ఆధిపత్యాన్ని ఎదిరించడంలో, మహిళలు–పురుషుల మధ్య అసమానతలను తొలగించడంలో, ఆరోగ్య సంరక్షణ, సంస్కృతి, సైన్య రంగాలలో "నూతన సోషలిస్టు" అంశాలు ముందుకు వచ్చాయి. ఇలా జిపిసిఆర్ లీ షావ్–చీ, లిన్ పియావోలకు చెందిన రెండు బూర్జువా హెడ్‌క్వార్టర్స్‌ను ధ్వంసం చేసింది. 10 సంవత్సరాల పాటు పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరగకుండా నివారించింది.

మార్క్సిస్టు మహోపాధ్యాయులు మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ సోషలిజం ద్వారా చైనాలో మూడు దశాబ్దాల లోపే ప్రపంచంలోనే గణనీయమైన అంతరాలు లేని సమాజాన్ని నిర్మించింది. చైనా కార్మిక, కర్షక, సైనిక, మహిళ, విద్యార్థి, మేధావి, తదితర పీడిత ప్రజారాశులు కష్టించి పనిచేసి తమ మాతృదేశాన్ని ఆధునిక పారిశ్రామిక దేశంగా, ప్రతి ఒక్కరూ ఉచిత వైద్యం, ఉచిత విద్య పొందగలిగిన అత్యంత పురోగామి రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థగా పరివర్తన చెందించారు. దానిని ప్రపంచంలో 6వ అతిపెద్ద పారిశ్రామిక ఉత్పాదక శక్తిగా అభివృద్ధి చేశారు.

అయితే బూర్జువా వర్గం, అభివృద్ధి నిరోధకుల ఉనికి కొనసాగేందుకూ, అటువంటి వారు తలెత్తేందుకూ సోషలిస్టు రాజ్యంలో సైతం అవకాశాలు ఉంటాయి. అందులో భాగంగా చైనాలో ఆనాడు సరుకుల ఉత్పత్తి, డబ్బు ద్వారా వినిమయం, పనిని బట్టి పంపిణీ అంటే 8 శ్రేణుల వేతన వ్యత్యాసాలు ఉనికిలో ఉండినాయి. కూలదోయబడిన వర్గాల వద్ద డబ్బు, కొన్ని ఉత్పత్తి

సాధనాలు కూడా ఉండినాయి. రైతాంగం, మధ్యతరగతి వద్ద చిరు ఆస్తులు ఉండినాయి. ఇదే అనివార్యంగా చిన్న తరహా ఉత్పత్తికి పునాది. ఇది పెట్టుబడిదారీ విధానాన్నీ, బూర్జువా వర్గాన్ని పెద్దెత్తున ఉద్భవించేలా చేస్తుంది. శారీరక శ్రమకూ, మానసిక శ్రమకూ మధ్య, కార్మికులకూ, రైతాంగానికీ మధ్య, పట్టణాలకూ, గ్రామాలకూ మధ్య, వ్యవసాయానికీ, పరిశ్రమలకూ మధ్య, వివిధ ప్రాంతాల మధ్య, జాతుల మధ్య వ్యత్యాసాలు ఉంటాయి. సోషలిస్టు ఆర్థిక పునాదిని విచ్ఛిన్నం చేసేందుకు అవకాశాన్ని కల్పించే పాత సమాజపు దోపిడీ సంస్కృతి, సంప్రదాయాలు-అలవాట్లు ఉపరితలంలో కొనసాగుతాయి. బయట నుంచి సామ్రాజ్యవాదులు, అభివృద్ధి నిరోధకులు, ప్రతీఘాతకులు, రివిజనిస్టులు ఒక 'పవిత్ర కూటమి'గా ఏర్పడి దాని నుంచి కూడా వీటికి అన్ని రకాలుగా మద్దతు లభిస్తుంది. ఈ పెట్టుబడిదారీ అంశాల పెరుగుదల కారణంగా నూతన బూర్జువా శక్తులు ఆవిర్భవిస్తాయి. అందువల్ల సోషలిస్టు ఆర్థిక పునాదికి అనుగుణంగా ఉపరితలాన్ని, ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడం కోసం ఉత్పత్తి సంబంధాలను నిరంతరం విప్లవీకరించాల్సిన అవసరం ఉంటుంది. తద్వారా బూర్జువా వర్గం తన ఉనికిని కొనసాగించే అవకాశం, నూతన బూర్జువా వర్గం ఆవిర్భవించే అవకాశం లేని పరిస్థితులను సృష్టించడం కార్మికవర్గ నియంతృత్వపు అత్యంత ముఖ్యమైన కర్తవ్యాలలో ఒకటిగా ఉంటుంది. ఒక సుదీర్ఘ చారిత్రక దశలో సమాజ పరిణామ క్రమంలోని నియమాలకు అనుగుణంగా సమాజం పరివర్తన చెందిన తర్వాత మాత్రమే ఇటువంటి పరిస్థితులు ఉనికిలోకి వస్తాయి. అంతేతప్ప అది ఒకరి యిష్టాయిష్టాలపై ఆధారపడి ఉండదు.

సరిగ్గా ఈ పరిస్థితులనే ఉపయోగించుకొని చైనా కమ్యూనిస్టు పార్టీలో ఉన్నత అధికారాన్ని హస్తగతం చేసుకున్న పిడికెడు మంది పెట్టుబడిదారీ మార్గీయులు పెట్టుబడిదారీ పునరుద్ధరణకు పథకం ప్రకారం పూనుకున్నారు. వాళ్లు 'ఉత్పత్తి శక్తుల' రివిజనిస్టు సిద్ధాంతాన్ని రహస్యంగా-బహిరంగంగా అమలు చేశారు. వీరి కుట్రలను ఎండగడుతూ, సోషలిజంలో వర్గ పోరాటాన్ని కొనసాగించడం, కమ్యూనిస్టు లక్ష్యాన్ని సాధించేంత వరకూ విప్లవాన్ని కొనసాగించడం అనే మావో బోధన, "పెట్టుబడిదారీ కేంద్రాన్ని బద్దలు కొట్టండి" అనే ఆయన పిలుపుకు అనుగుణంగా 1966-76 మధ్య పది సంవత్సరాల పాటు సిపిసి నాయకత్వంలో మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం కొనసాగింది. అయినప్పటికీ కామ్రేడ్ మావో మరణానంతరం హువా-డెంగ్‌ల నాయకత్వంలోని పెట్టుబడిదారీ మార్గీయులు విప్లవ ప్రతీఘాతుక సాయుధ కుట్ర ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకొని సాంస్కృతిక విప్లవ విజయాలను తిరగదోడడంలో విజయవంతమయ్యారు. పైన పేర్కొన్న విధంగా సైద్ధాంతిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో పెట్టుబడిదారీ విధానాన్ని వ్యవస్థీకృతం చేయగలిగారు. వీరు మూడు యేళ్ల కాలంలోనే కమ్యూనిస్టు పార్టీని రివిజనిస్టు పార్టీగా, కార్మికవర్గ నియంతృత్వాన్ని బూర్జువా నియంతృత్వంగా, సోషలిస్టు దేశాన్ని పెట్టుబడిదారీ దేశంగా వ్యవస్థీకృతం చేసి తమ

లక్ష్యాన్ని సాధించగలిగారు. ఈ విధంగా చైనాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగి ప్రపంచ కార్మికవర్గం మరోసారి చారిత్రక ఓటమికి గురైంది.

## 2. రివిజనిస్టు చైనాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ తర్వాతి పరిస్థితి

మావో మరణం తర్వాత రివిజనిస్టు రెనగేడ్ హువా–డెంగ్ ప్రతీఘాతకుల ముఠా విప్లవ ప్రతీఘాతుక కుట్ర ద్వారా ఎర్రజెండాను ఊపుతూనే మోసపూరితంగా పార్టీలో తమ స్థితిని బలోపేతం చేసుకున్నారు. తమ దారుణమైన కుట్రను అమలు చేయడం కోసం పథకం ప్రకారం వారు మెట్టు మెట్టుగా ముందుకు కదిలారు. లీ షావ్–చీ, లిన్ పియావోలు ముందుకు తీసుకొచ్చిన విప్లవ ప్రతీఘాతుక పంథాకు కొనసాగింపే హువా–డెంగ్ పంథా. ఇలా వీళ్లు పార్టీలో దాగి వున్న కరుడుగట్టిన పెట్టుబడిదారీ మార్గీయులుగా రుజువుపరుచుకున్నారు. కామ్రేడ్ మావో సేటుంగ్ ఇలా అన్నాడు : "రివిజనిజం అధికారంలోకి వచ్చిందంటే అర్థం బూర్జువా వర్గం అధికారంలోకి వచ్చిందనే." "ప్రస్తుతం సోవియట్ యూనియన్ బడాబూర్జువావర్గ నియంతృత్వం, జర్మన్ ఫాసిస్టు తరహా నియంతృత్వం, హిట్లర్ తరహా నియంతృత్వం వంటి బూర్జువావర్గ నియంతృత్వం కింద ఉన్నది." ఈ రెనగేడ్‌లను ఉద్దేశించే జిపిసిఆర్ కాలంలో మావో ఇలా చెప్పారు, "పార్టీ, ప్రభుత్వం, సైన్యం, వివిధ సాంస్కృతిక రంగాలలోకి చొచ్చుకువచ్చిన బూర్జువా వర్గ ప్రతినిధులు విప్లవ ప్రతీఘాతుక రివిజనిస్టులు. పరిస్థితులు పరిపక్వం అయిన తర్వాత వాళ్లు కార్మికవర్గ నియంతృత్వాన్ని బూర్జువా వర్గ నియంతృత్వంగా మార్చివేస్తారు."

ఈ రివిజనిస్టులు మొట్టమొదటగా ప్రజలను సైద్ధాంతికంగా/భావజాలపరంగా నిరాయుధం చేసేందుకు విప్లవ భావజాల ముసుగు వేసుకున్నారు. వక్రమార్గంలో పెట్టుబడిదారీ పునరుద్ధరణకు అనుగుణ్యంగా ప్రజలను భావజాలపరంగా మలుచుకునే కర్తవ్యాన్ని చేపట్టారు. ఇందుకోసం డెంగ్ ముఠా సామ్రాజ్యవాదుల, సోవియట్ యూనియన్ సోషల్ సామ్రాజ్యవాదుల దేశీయ, విదేశీయ అభివృద్ధి నిరోధకులను ఉపయోగించుకుంది. మావో ఆధ్వర్యంలో సిపిసి నాయకత్వంలో ప్రజల మెదళ్లలో పాతుకుపోయిన విప్లవ విలువలన్నింటినీ బహిరంగంగా నిందిస్తూ, భావజాలపరంగా, సైద్ధాంతికంగా, రాజకీయంగా దివాలాతీసిన డెంగ్ రివిజనిస్టు ముఠా వరుసగా అనేక వ్యాసాలను ప్రచురించింది. వీళ్లు జిపిసిఆర్‌ను దుస్సాహసికమైనదిగా తప్పుబడుతూ, దానికి సంబంధించిన ప్రతీ కోణాన్ని మొత్తంగానే తిరస్కరించారు. రాజకీయాలు, విప్లవం, వర్గ పోరాటం, సామాజిక–రాజకీయ–ఆర్థిక సమానత్వం, ప్రజల ప్రజాస్వామీకరణ, స్వావలంబన, కార్మికవర్గ నియంతృత్వం ఈ విలువలన్నింటినీ పూర్తిగా తిరస్కరించి, ఉనికిలో ఉన్న సోషలిజాన్ని ధ్వంసం చేశారు. ఈ విద్రోహులు మావోపై అనేక తప్పుడు ఆరోపణలు చేశారు. ఈ వ్యాసాలన్నింటిలో డెంగ్ రివిజనిస్టు ముఠా మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానానికి ప్రత్యామ్నాయంగా ప్రాగ్మాటిజాన్ని[2] ముందుకు తెచ్చింది. డెంగ్ నాయకత్వంలోని

పెట్టుబడిదారీ మార్గీయులు మావో అనుచరుల ప్రతిష్టను దెబ్బతీస్తూ, వారిని కుట్రపూరితంగా నిర్బంధించడం, అణచివేయడం, చంపడం, ఉరిశిక్షలు వేయడం ద్వారా అడ్డును తొలగించుకొని, తమ స్థితిని బలోపేతం చేసుకున్నారు.

రాజకీయ స్థిరత్వం, క్రమశిక్షణ, ఆర్థిక వృద్ధి, ప్రోత్సాహకాలు, నిపుణత గురించీ, విదేశీ టెక్నాలజీకీ, పెట్టుబడికీ తలుపు తెరచి ఉంచాల్సిన సంస్కరణల అవసరం గురించీ ప్రచారం చేస్తూ అనేక వ్యాసాలను డెంగ్ ముఠా ప్రచురించింది. దీనితో పెద్దయెత్తున పెట్టుబడిదారీ పునరుద్ధరణకు మార్గాన్ని సుగమం చేసింది.

డెంగ్ ముఠా ఉత్పత్తి సంబంధాలకు సంబంధించిన అన్ని అంశాలలో బూర్జువా హక్కులను విస్తరించడం ద్వారా పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించింది. డెంగ్ మాటల్లో చెప్పాలంటే "సంస్కరణలు గానీ, తలుపులు తెరచి ఉంచే విధానం గానీ తప్పేమీ కాదు. చైనా మళ్లీ తలుపులు మూసుకునే దేశంగా ఎన్నడూ మారకూడదు. ప్రణాళికాయుక్త సోషలిస్టు ఆర్థిక వ్యవస్థకూ, మార్కెట్ ఆర్థిక విధానానికీ సమన్వయం సాధించడానికే నాయకత్వం ప్రయత్నించాలి. ఈ విధానంలో మార్పు ఉండజాలదు." దీనితో ఉత్పత్తిని సామాజీకరించడానికీ, ప్రైవేటు ఉత్పాదనకూ, వినియోగానికీ సంబంధించిన వ్యవస్థకూ మధ్య వైరుధ్యం తిరిగి ప్రధాన వైరుధ్యంగా ముందుకు వస్తుంది. ఈ వైరుధ్యం ఈ కింది పరిమాణాలకు దారితీస్తుంది :

1) ఈ వైరుధ్యం ఫలితంగా, ప్రైవేటు ఉత్పత్తిదార్లకు మధ్య వైరుధ్యం, పోటీ ఉంటాయి. దీనితో పాటు పేదలు మరింత పేదలుగా మారతారు, ధనికులు మరింత ధనవంతులవుతారు. ఇది సమాజం మరింత ధృవీకరించబడడానికి దారితీస్తుంది. ధనికులు పెట్టుబడిదారులుగా మారుతారు. వారు ప్రజల శ్రమను దోచుకోవడం ద్వారా లాభాలు గడిస్తారు. పేదలు వేతన కార్మికులుగా దిగజారి, తమ జీవనం కోసం తమ శ్రమశక్తిని అమ్ముకుంటారు. ఈ విధంగా మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో అంతర్గతంగా పెట్టుబడిదారీ విధానంగా పరిణామం చెందే ధోరణి నిబిడీకృతమై ఉంటుంది.

2) ఉత్పత్తిని సామాజీకరించాలంటే (పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేయాలంటే) వస్తుగతంగా శ్రమశక్తి, ఉత్పత్తి సాధనాలు స్వేచ్ఛగా దొరకాలి. మార్కెట్ ఆర్థిక వ్యవస్థను నిర్మించడం అంటేనే శ్రమశక్తిని కొనడం–అమ్మడం జరుగుతుంది. "పెట్టుబడి" పెట్టడం ద్వారా ఉత్పత్తి సాధనాల్ని కొనుగోలు చేస్తారు. ఆ విధంగా, ఉత్పత్తి సామాజీకరణ ద్వారా నిర్మించే మార్కెట్ వ్యవస్థ తప్పనిసరిగా పెట్టుబడిదారీ మార్కెట్ ఆర్థిక వ్యవస్థే అవుతుంది. అది ఎన్నటికీ "సోషలిస్టు మార్కెట్ ఆర్థిక వ్యవస్థ" కాదు. అటువంటి "వ్యవస్థ"గా ఉండబోదు.

అందువల్ల, "మార్కెట్ ఆర్థిక వ్యవస్థ" నిర్మాణం కోసం "సంస్కరణలు" చేయాలని చెప్పడం అంటే పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేయడం కోసం "సంస్కరణలు" చేయాలని చెప్పడమే.

ఈ "సంస్కరణల" లక్ష్యం "పెట్టుబడిదారీ విధానాన్ని చైనీయ లక్షణాలతో" అభివృద్ధి చేయడం తప్ప మరేమీ కాదు.

చైనా తన దేశంలో 1978-1989 వరకూ దఫదఫాలుగా సంస్కరణలను అమలు చేసింది. వీటిని మొదటి తరం సరళీకృత ఆర్థిక సంస్కరణలు అన్నారు. 1990ల తర్వాత చేపట్టిన సంస్కరణలు రెండవ తరం సరళీకృత ఆర్థిక సంస్కరణలుగా పిలవబడుతున్నాయి.

**మొదటి తరం సరళీకృత ఆర్థిక సంస్కరణలు :**

చైనాలో 1979లో వ్యవసాయ సంస్కరణలు ప్రారంభమయ్యాయి. 1984లో పట్టణ సంస్కరణలు ప్రవేశపెట్టబడ్డాయి. విదేశీ పెట్టుబడికి "మార్గాలు తెరిచారు." 1980లో చైనా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐ.ఎం.ఎఫ్.), ప్రపంచ బ్యాంకులలో చేరింది. చైనా రివిజనిస్టులు తమ వర్గ ప్రయోజనాల రీత్యా ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద వ్యవస్థలో భాగం అయ్యారు. చైనాలో ప్రభుత్వ పెట్టుబడిదారీ ఆర్థికాన్ని ప్రైవేటు గుత్తాధిపత్య పెట్టుబడిదారీ పద్ధతుల్లోకి దఫదఫాలుగా సంస్కరించారు. ఫలితంగా ప్రైవేటీకరణల వెల్లువ, పెద్దెత్తున లేఆఫ్‌లు, ప్రైవేటు పెట్టుబడి ఆవిర్భావం జరిగాయి. మార్క్స్ చెప్పిన పెట్టుబడిదారీ "విలువ సూత్రాన్ని" రివిజనిస్టు చైనా తిరిగి ప్రవేశపెట్టింది. అంటే, దేశ ఆర్థిక వ్యవస్థ మార్కెట్లో శ్రమశక్తి అమ్మకం మీద ఆధారపడిన వ్యవస్థ అయ్యింది. ఇది కార్మికుల దోపిడీకీ, పెట్టుబడి సంచయనానికీ, దాని ద్వారా ఏర్పడే ఇతర ప్రభావాలకు, ఫలితాలకు దారితీసింది. విదేశీ కంపెనీలు చైనాలోకి స్వేచ్ఛగా వచ్చాయి. 1982లో 26,00,000 ప్రైవేటు సంస్థలు ఉండగా, 1983 నాటికి అవి 58,00,000 అయ్యాయి. 20 సంవత్సరాల గడువుతో ప్రపంచ బ్యాంకు చైనాకు 220 మిలియన్ డాలర్ల[3] అప్పు రైలు మార్గాల విస్తరణ కోసం ఇచ్చింది.

సోషలిస్టు చైనాలో కమ్యూన్ వ్యవస్థ చాలా పటిష్టమైనది. దీనిని పునాదిలో బద్దలు కొట్టడం కోసం రివిజనిస్టు నాయకత్వం తొలుత రాజకీయంగా మౌలిక మార్పులను తీసుకువచ్చింది. తద్వారా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి గెంతు సాధించడానికి ప్రాతిపదిక ఏర్పడింది. వ్యవసాయంలో సంస్కరణలను తీసుకురావడంలో భాగంగా సోషలిస్టు కాలంలో ఉన్నత స్థాయికి చేరుకున్న సమిష్టీకరణను తిరగదోడారు. ఇందులో భాగంగా భూమిపై, దానితో పాటు సాగు జంతువులు, వ్యవసాయ ఉపకరణాలపై సమిష్టి యాజమాన్యాన్ని రద్దు చేసి కాంట్రాక్టు పద్ధతిని ప్రవేశపెట్టారు. క్రమంగా భూమిని వ్యక్తిగత ఆస్తిగా మార్చి వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించారు. కమ్యూన్ల సమిష్టి యాజమాన్యం కింద ఉన్న పరిశ్రమలు, వ్యాపారం, గనుల నిర్వహణ; విద్య, వైద్యం, పిల్లల-వృద్ధుల సంక్షేమం, వినోదం, తదితరాల నిర్వహణలో సైతం సోషలిస్టు విధానం స్థానంలో పెట్టుబడిదారీ పద్ధతులను అమలులోకి తీసుకువచ్చారు.

వ్యవసాయంలో ప్రధానంగా ఈ కింది ఆర్థిక సంస్కరణలను ప్రకటించారు. 1) వ్యవసాయ

కమ్యూన్లను, వ్యవసాయ సహకార సంఘాలను రద్దు చేయాలి. ప్రతి రైతు కుటుంబం నుంచి వ్యవసాయోత్పత్తులను కొనుగోలు చేయడానికి రాజ్యమే కాంట్రాక్టులను చేపడుతుంది. గ్రామం/ బస్తీ పునాదిగా కాంట్రాక్టు బాధ్యతను చేపట్టే వ్యవస్థ పేరు మీద వ్యక్తిగత వ్యవసాయం తిరిగి ప్రవేశపెట్టబడింది. 2) రైతు కుటుంబాలు స్థానిక మార్కెట్లలో తమ కాంట్రాక్టులలో అమ్మేందుకై అంగీకరించిన ఉత్పత్తి కోటా కాక, అదనపు ఉత్పత్తిని దేనినైనా స్వేచ్ఛగా అమ్ముకోవచ్చు. ప్రభుత్వం ఆహార ధాన్యాల విషయంలో స్వేచ్ఛా వ్యాపారాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంతో ఆహార ధాన్యాల ప్రైవేటు వ్యాపారస్తులు ఆవిర్భవించారు. 3) కమ్యూన్ల విధులలో ప్రభుత్వ సేవలకై (స్వచ్ఛంద) శ్రామికులను సమీకరించే అధికారంతో సహా వాటికి సంబంధించిన అనేక అధికారాలను తొలగించారు. బస్తీ లేదా గ్రామ అధికారం పేరు మార్చారు. దీంతో పాటు, ఉత్పత్తిని పెంచేందుకై ప్రోత్సాహాన్ని అందించడం కోసం, వ్యవసాయ ఉత్పత్తులను సేకరించే ధరలను 20 శాతం పెంచారు. వీటన్నింటి ఫలితంగా, గ్రామీణ ప్రాంతాలలో భూముల వినియోగంలో, పొందిన సాగు జంతువుల, వ్యవసాయ పరికరాల యాజమాన్యంలో అసమానతలు పెరిగాయి. 1988 ఏప్రిల్‌లో సవరించిన చట్టం ప్రకారం భూమిని వినియోగించే హక్కు బదిలీ చేయవచ్చు; రైతులను మార్కెట్ ఒడుదుడుకులకు విడిచిపెట్టారు. దీని వల్ల లక్షలాది మంది రైతులకు పని లేకుండా అయ్యింది. బ్రతుకు తెరువు లేనివారు 'స్వేచ్ఛా' కార్మికులయ్యారు. ఒక అంచనా ప్రకారం, గ్రామీణ ప్రాంతంలో 15 కోట్ల మందికి పైగా అదనపు 'స్వేచ్ఛా' కార్మికులు ఆనాడు ఉన్నారు. ఈ శక్తులను గ్రామీణ కంపెనీలను, ప్రైవేటు కంపెనీలను, దేశ-విదేశీ పెట్టుబడికి చెందిన జాయింట్ వెంచర్లను అభివృద్ధి చేయడం కోసం వినియోగించారు. చైనా స్థానిక ప్రభుత్వాలు పెట్టుబడులను సమీకరించుకునేందుకు రైతాంగంపై పన్నులు విధించేవారు.

పట్టణ సంస్కరణల విషయానికి వస్తే ఇందులో మూడు ప్రధాన విధానాలు ఉన్నాయి : 1) దక్షిణ చైనాలోని అనేక సముద్ర తీర ప్రాంత రాష్ట్రాలు (ప్రావిన్సులు), నగరాలను 'ప్రత్యేక పారిశ్రామిక జోన్లు' (Special Enterprise Zones-SEZs)గా అధీకృతం చేశారు. ఈ జోన్ల లోపల చిన్న, మధ్య తరహా ప్రైవేటు వ్యాపారాలపై, విదేశీ వ్యాపారం, వాణిజ్యాలపై ఉన్న ఆంక్షలను తొలగించారు. 2) రాజ్యం ద్వారా ఏకీకృత ఆర్థిక పథకాన్ని రూపొందించడం రద్దయ్యింది. కంపెనీలను నడపడంలో ప్రధాన లక్ష్యం లాభం. కంపెనీల మధ్య సంబంధాలు ఒక ఏకీకృత ప్రభుత్వ పథకం ప్రకారం పరస్పర మద్దతు, సమన్వయంతో కూడిన సోషలిస్టు సంబంధాలుగా కాక, స్వేచ్ఛా మార్కెట్‌లో పోటీ, వైషమ్యంతో కూడిన పెట్టుబడిదారీ సంబంధాలు అయ్యాయి. 3) అత్యంత ముఖ్యమైనది, ప్రభుత్వ ఫైనాన్స్‌ను, ప్రణాళికను ప్రధానంగా పునర్వ్యవస్థీకరించారు.

డెంగ్ రివిజనిస్టు ప్రభుత్వం ప్రైవేటు రంగాన్ని వినియోగించుకోవడం, దానికి ఆంక్షలు

విధించడం, దాన్ని పరివర్తన చెందించడం, క్రమంగా నిర్మూలించడం అనే విధానాన్ని కాక ఎటువంటి నియమ-నిబంధనలు లేని విధానాన్ని అనుసరించింది. ఆర్థిక వ్యవస్థలో దీర్ఘకాలం పాటు అత్యంత నిర్ణయాత్మక పాత్ర పోషించిన రాజ్య యాజమాన్యంలోని (అంటే యావత్తు చైనా ప్రజల యాజమాన్యంలోని) పరిశ్రమలను విచ్ఛిన్నం చేశారు. యాజమాన్యాన్ని మేనేజ్‌మెంట్ (నిర్వహణ అధికారం) నుంచి వేరు చేశారు. పోటీ ద్వారా అర్హత పొందిన మేనేజర్లను ఎంపిక చేశారు. వారికే పూర్తి బాధ్యతలు అప్పగించారు. వారి ఆర్థిక ప్రదర్శనపై ఆధారపడి వారికి రివార్డులు ఇచ్చేవారు లేదా వారి ఆస్తులను పెంచడం, తగ్గించడంతో సహా నష్టపరిహారం విధించేవారు. యావత్తు ప్రజల యాజమాన్య హక్కులను పక్కకు పెట్టారు. రాజ్య యాజమాన్యంలోని చిన్న కంపెనీలను సమూహాలకూ, వ్యక్తులకూ అమ్మడం మొదలైంది. కొన్ని పాత యజమానులకు కూడా ఇచ్చారు.

చైనా మార్కెట్ వ్యవస్థలో డెంగ్ చెప్పినట్లు “వినిమయ సరుకుల కోసం ఒక సరుకుల మార్కెట్, ఉత్పత్తి విధానం మాత్రమే కాక, ఉత్పత్తికి అవసరమైన అంశాలు – ఉదాహరణకు, నిధులు, కార్మికులు, టెక్నాలజీ, సమాచారం, రియల్ ఎస్టేట్‌ల – కోసం మార్కెట్లు ఉంటాయి.” రివిజనిస్టులు మొదటి సంస్కరణల కాలం నుండి (1979–89) ఈ కింది పంపిణీ రూపాలను అమలు చేశారు. అవి: బాండ్లు కొన్నవారికి వడ్డీ లభిస్తుంది; షేరు హోల్డర్లకు డివిడెండ్లు లభిస్తాయి; రిస్క్ తీసుకునే మేనేజర్లకు అదనపు ఆదాయం లభిస్తుంది; నిర్దిష్ట సంఖ్యలో కార్మికులను పనిలో పెట్టే ప్రైవేటు కంపెనీల యజమానులకు ఏమీ కష్టపడకుండా ఆదాయం లభిస్తుంది.

ఈ మొదటి సంస్కరణల కాలంలో చైనాను సామ్రాజ్యవాద శక్తులు దోపిడీ చేయమని ఆహ్వానించడానికి గాను “బయట ప్రపంచానికి తలుపులు బార్లా తెరవడం” అనే విధానం అమలు జరపబడింది. విదేశీ కంపెనీలు తాము కోరుకున్న సదుపాయాల్ని పొందగలిగాయి. విదేశీ వర్తకంపై రాజ్య గుత్తాధిపత్యం రద్దు చేయబడింది. విదేశీ వ్యాపారాన్ని స్వతంత్రంగా నిర్వహించుకునేందుకు కంపెనీలకు రాజ్యం అనుమతి మంజూరు చేసింది. చైనా, సామ్రాజ్యవాదుల సరుకులకు మార్కెట్‌గా మారడం, వారి పెట్టుబడికి తలుపులు తెరవడం ద్వారా ప్రపంచ సామ్రాజ్యవాద మార్కెట్‌లో విడదీయరాని భాగంగా అయ్యింది. విదేశీ కంపెనీలు లాభాలను పెంచుకునేందుకై ప్రత్యేక హక్కు ఇవ్వబడింది. ఉదాహరణకు, తమ ఇష్టానుసారంగా వేతనాలను, జీతాలను నిర్ణయించే హక్కు, కార్మికుల్ని రిట్రెంచ్ చేసే హక్కు. 1994 నాటికి విదేశీ పెట్టుబడులు కలిగిన 1,86,000 కంపెనీలలో సుమారు 150 బిలియన్ డాలర్ల[4] విదేశీ పెట్టుబడి పెట్టేందుకు ఆమోదం తెలిపారు.

ఈ లాభాల భాగస్వామ్య ఒప్పందాలు[5] స్థానిక ప్రభుత్వ అధికార్ల, ఫ్యాక్టరీ మేనేజర్ల లాభాల వేటకు దారితీశాయి. ఉదాహరణకు “ప్రత్యేక పారిశ్రామిక జోన్ల (ఎస్‌ఈజడ్) విషయంలో ఇదే జరిగింది. ఎస్‌ఈజడ్‌లలో వ్యాపారం-వాణిజ్యంపై ఆంక్షల్ని ఎత్తివేయడం వల్ల తైవాన్, హాంగ్

కాంగ్, ఇతర తూర్పు ఆసియాకు చెందిన ప్రాంతాల్లోని చైనా వ్యాపార వర్గం చిన్న మొత్తాలలో పెట్టుబడిని స్వదేశానికి పంపడం ద్వారా ప్రైవేటు రంగంలో చిన్న స్థాయి వ్యాపారం, పరిశ్రమలు వేగంగా వృద్ధి చెందడానికి దారితీసింది. దీంతో ప్రైవేటు రంగంలో కార్మికుల కోసం డిమాండ్ ఏర్పడింది. ఈ డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వ రంగం నుండి వస్తున్న పారిశ్రామిక తయారీ సప్లైల వల్ల, వ్యవసాయ సంస్కరణల వల్ల వీధుల పాలైన రైతాంగం నుంచి వచ్చిన శ్రామికులు తీర్చారు. దీంతో చైనా వ్యాపార వర్గానికి తాము సంపాదించిన లాభాలను ఉపయోగించుకునేందుకు మార్గం, అవకాశం – రెండూ లభించి పెట్టుబడిదారీ ఉత్పత్తి విస్తరణకు దారితీసింది. ఫలితంగా, పట్టణ సహకార సంఘాల, బస్తీ–గ్రామ స్థాయి కంపెనీలు లేదా వ్యాపార సంస్థల (Town Village Enterprises-TVE) ఉత్పత్తి పెద్దెత్తున వృద్ధి చెంది పెట్టుబడిదారీ ఆర్థిక వికాసానికి దారితీసింది. ఇది వేగంగా నియంత్రణను కోల్పోవడం మొదలైంది.

ప్రైవేటు వ్యాపార వర్గానికి విపరీతమైన లాభాలు, రెవెన్యూ భాగస్వామ్య ఒప్పందాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో పెద్ద లోటు ఏర్పడింది. ప్రభుత్వ బడ్జెట్ లోటు పెరగడంతో పాటు సంస్కరణలకు గురికాని బ్యాంకింగ్ రంగం ద్వారా సులభంగా అప్పు దొరకడంతో ద్రవ్యోల్బణం పెరుగుదలకూ, విదేశీ వ్యాపారంలో లోటుకూ దారితీసింది. పెరుగుతున్న ఈ ద్రవ్యోల్బణ సంక్షోభానికి ప్రతిస్పందనగా ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ రంగంలో పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం ద్వారా బ్యాలెన్స్ చేసేందుకు ప్రయత్నించింది. ఇది ప్రభుత్వ పెట్టుబడిని ఆదా చేయడం కోసమే గాక, బడ్జెట్ లోటును తగ్గించేందుకు తోడ్పడింది. దీని వల్ల కేంద్ర ప్రభుత్వ కంపెనీల్లో ప్రణాళికాబద్ధ ఉత్పత్తి కోటాలు తగ్గిపోయాయి. దీంతో వాటి ఉత్పత్తిలో ఎక్కువ భాగం మార్కెట్‌లో అమ్ముకునేందుకు అనుమతించాల్సి వచ్చింది. తద్వారా ప్రభుత్వేతర రంగాలకు అమ్మే భారీ పరిశ్రమల ఉత్పత్తుల మార్కెట్ ధర తగ్గిపోయింది. ఈ ఆర్థిక అసమతుల్యాలను సరి చేయడం కోసం మరిన్ని ఉదారవాద సంస్కరణలు చేపట్టారు.

మొట్టమొదట, కేంద్ర ప్రభుత్వ సంస్థలను మరింత లాభాపేక్షిత (profit-oriented) వ్యాపార సంస్థలుగా తీర్చిదిద్దడం కోసం వాటి వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చారు. తమ ఫ్యాక్టరీలను నడపడంలో ఫ్యాక్టరీ మేనేజర్ల, డైరెక్టర్ల అధికారాలను పెంచారు. కంపెనీలను నడపడంలో పార్టీ కార్యదర్శుల రాజకీయ జోక్యాన్ని తగ్గించారు. లాభాల భాగస్వామ్య ఒప్పందాలను ప్రవేశపెట్టడం ద్వారా ఉత్పత్తి, పెట్టుబడులపై సంబంధిత యాజమాన్యాల నిర్ణయం తీసుకునే అధికారాలను పెంచారు. నిర్దిష్టంగా ఎంపిక చేసిన కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థల మేనేజర్లు జాతీయ వేతన స్కేళ్లను రద్దు చేసి, ఉత్పత్తిని బట్టి చెల్లింపు పద్ధతిని ప్రవేశపెట్టారు. జీవితకాల ఉపాధి గ్యారంటీలను అధికారికంగా రద్దు చేసి, వాటి స్థానంలో సమయావధితో కూడిన ఉపాధి కాంట్రాక్టులను ప్రవేశపెట్టారు. రెండవది, ప్రభుత్వ నిధులపై నియంత్రణను తగ్గించేందుకు ప్రయత్నాలు చేశారు. వాటి స్థానంలో ప్రతి ఒక్క నిర్దిష్ట స్థానిక ప్రభుత్వ అంగంతో దాని

రెవెన్యూ, లాభాల వాటా గురించి చర్చలు జరిపి, ఒక స్థాయీ (స్టాండర్డు) విశ్వజనీన పన్నుల వ్యవస్థను ప్రవేశపెట్టారు. రెవెన్యూ, లాభాల వాటా మొత్తాన్నీ, నిర్ణీత మొత్తంగా కాక, లాభాల నిష్పత్తిగా వసూలు చేసేవారు. చివరికి బ్యాంకింగ్ వ్యవస్థను మరింత కేంద్రీకృత పునాదిపై పునర్వ్యవస్థీకరించారు.

కార్మికవర్గ నియంతృత్వం కింద సోషలిస్టు చైనా ఒక సరుకుల ఆర్థిక వ్యవస్థనూ, ఎనిమిది శ్రేణుల వేతన వ్యవస్థనూ అమలు చేస్తూ ఉండింది. ఎనిమిది శ్రేణుల వేతనాలలో తేడాలు పెద్దగా లేకపోయినప్పటికీ, అప్పటి సోషలిస్టు ప్రభుత్వ విధానం క్రమంగా ఆ తేడాలు తగ్గించడంగా ఉండింది. వేతనాలలో ఈ తేడాలు ఉన్నప్పటికీ, కార్మికులకు పని భద్రత, చౌక అద్దెతో నివాసం, ఉచిత ఆరోగ్య సంరక్షణ, గర్భవతులు–బాలింతలకు ఆర్థిక సహాయం, కార్మికులకు జరిగిన నష్టానికి పరిహారం, వివిధ రకాల బీమాలు, పెన్షన్, వినోద సౌకర్యాలు, స్కూల్ మొదలైన అనేక సౌకర్యాలు ఉండేవి. సోషలిస్టు చైనా (1949–76)లో నిరుద్యోగం, భిక్షాటన, మురికివాడలు లేవు. ఆ తర్వాత అధికారాన్ని చేజిక్కించుకున్న ఈ విప్లవ ప్రతీఘాతకులు 'చైనా లక్షణాలతో కూడిన ప్రత్యేక సోషలిస్టు వ్యవస్థ'గా పిలిచే కుసంస్కరణలను అమలు చేయడం ద్వారా చైనా సమాజం లోపలికి పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధించిన ప్రజలకు హానికరమైన అంశాలన్నీ లోతుగా ప్రవేశించాయి. ఇలా పెట్టుబడిదారీ పునరుద్ధరణ కార్మికులకు గల సామాజిక సదుపాయాలను క్రమంగా రద్దు చేసింది. ఈ హానికర అంశాలన్నీ జీవితానికి సంబంధించిన ప్రతీ రంగంలో స్పష్టంగా వ్యక్తమయ్యాయి. పేదరికం, నిరుద్యోగం, అక్రమ నిల్వలు, అవినీతి, స్మగ్లింగ్, వ్యభిచారం, ఆడశిశువులను గర్భంలోనే చంపడం, మత్తుమందుల రవాణా, స్త్రీలను, పిల్లలను అమ్మడం–ఎత్తుకుపోవడం, దొంగతనాలు, స్త్రీల మీద అత్యాచారాలు–హత్యలు, అందాల పోటీలు ఇలా అన్ని రకాల హానికర అంశాలు తలెత్తాయి.

అధిక వ్యవసాయోత్పత్తికి ప్రేరణ కల్పించడం కోసం మద్దతు ధరలు పెంచేందుకు చేసిన ప్రయత్నాలు పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం ద్వారా ముందుకు వచ్చిన సమస్యల్ని మరింత తీవ్రం చేశాయి. ప్రభుత్వం ఆహారానికి సబ్సిడీ యిస్తే ప్రభుత్వ లోటు మరింత అధికం అయ్యేది లేదా ఆహార ధరలు పెరిగితే, అవి నిత్యావసర వస్తువుల ధరల్ని పెంచడం వల్ల అప్పటికే అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్న పట్టణ కార్మికవర్గంలో అశాంతిని పెంచేవి. 1980ల చివరి నాటికే పెరుగుతున్న ఆర్థిక, రాజకీయ సమస్యలు ఉదారవాద సంస్కరణల ఊపు తగ్గడానికి దారితీశాయి.

చైనాలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల అభివృద్ధితో పాటుగా, ఒక చిన్న ప్రైవేటు పెట్టుబడిదారీ వర్గ ఆవిర్భావం మొదలైంది. 1990లో చైనాలో 98,000 ప్రైవేటు సంస్థలు ఉండినాయి. వాటి మొత్తం పెట్టుబడి 4.5 బిలియన్ యువాన్లు[6]. ఈ ప్రైవేటు పెట్టుబడిదారీ

వర్గం పాలకవర్గంలో భాగం కాదు. దానికి రాజకీయాధికారం లేదు. అది తాను వినియోగించిన శ్రామికులను దోచుకోవడం ద్వారా లాభాలను గడించేది. నిరంకుశాధికార ప్రభుత్వ పెట్టుబడిదారీ వర్గం, ప్రైవేటు పెట్టుబడిదారీ వర్గం మధ్య వైరుధ్యాల వల్ల ప్రైవేటు పెట్టుబడిదారీ వర్గం అందరి కోసం 'స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థ' వైపుగా పరివర్తన సాధించడానికీ రాజకీయంగా 'ప్రజాస్వామ్యం' కావాలి అనే నినాదాన్ని ముందుకు తెచ్చింది. అంటే 'స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థ'కు చట్టబద్ధ పాలన, నిరంకుశ ప్రభుత్వం నుంచి రక్షణ, ప్రైవేటు ఆస్తిపై స్పష్టమైన హక్కులు, బహు-రాజకీయ వ్యవస్థ అవసరమవుతాయి. నిరంకుశాధికార ప్రభుత్వ పెట్టుబడిదారీ వర్గం వందల బిలియన్ యువాన్ల ప్రైవేటు సంపదను పోగు చేసుకున్నది. చైనా కమ్యూనిస్టు పార్టీ పాలకవర్గంగా ప్రభుత్వ ఆస్తిపై అన్ని రకాల నియంత్రణలను కలిగి ఉన్నది. నిరంకుశాధికార ప్రభుత్వ పెట్టుబడిదారీ వర్గం గుత్త లాభాలను పొందేందుకు తన రాజకీయాధికారాన్ని వినియోగిస్తున్నది. అది ప్రైవేటు పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాన్ని నియంత్రిస్తున్నది. అందుచేత ప్రైవేటు పెట్టుబడిదారీ వర్గం ప్రజాస్వామ్యం కావాలని డిమాండ్ చేసింది. రివిజనిస్టు చైనా కమ్యూనిస్టు పార్టీలో ఒక చిన్న గ్రూపు (మైనారిటీ) ఈ ఉద్యమానికి మద్దత్తు ఇచ్చింది. డెంగ్ నాయకత్వంలోని మెజార్టీ ఈ ఉద్యమాన్ని వ్యతిరేకించి అణచివేసింది. దీని పర్యవసానమే 1989 తియనాన్‌మెన్ స్క్వేర్ ఘటన[7]. ఆ తర్వాతి సంస్కరణలను ముందుకు తేవడంలో ప్రధాన పాత్ర వహించిన జావో జియాంగ్‌ని పదవి నుంచి తొలగించారు. సంస్కరణల ప్రక్రియ హఠాత్తుగా మందగించింది.

రివిజనిస్టు డెంగ్ నాయకత్వంలో చైనా పెట్టుబడిదారీ విధానంలోకి పరివర్తన జరిగిన తర్వాత ఈ పరిశ్రమలన్నీ మొదటగా రాజ్య (ప్రభుత్వ) యాజమాన్యంలో ఉండిపోయాయి. అందుచేత చైనా ఆర్థిక వ్యవస్థ మొత్తంగా రాజ్య (ప్రభుత్వ) పెట్టుబడిదారీ విధానంగానే ఉండింది. చేపట్టిన 'సంస్కరణ'లలో భాగంగా చైనాలో రాజ్య గుత్త పెట్టుబడిదారీ విధానం పాక్షికంగా ప్రైవేటు గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానంగా రూపాంతరం చెందింది. అంటే చైనా పాక్షికంగా పాశ్చాత్య శైలి[8] ప్రైవేటు గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానంలోకి మారడం వల్ల అక్కడి పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం అమెరికా, యూరప్, జపాన్‌లలో ఉన్న మాదిరిగా ఒక మేరకు కనిపిస్తుంది. సోవియట్ యూనియన్‌లో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగినప్పుడు అది రాజ్య గుత్త పెట్టుబడిదారీ విధానాన్నే అమలు చేసింది.

సోవియట్ యూనియన్‌లో కృశ్చేవ్, బ్రెజ్నేవ్‌ల విద్రోహ ముఠా కుట్రపూరితంగా పార్టీనీ, ప్రభుత్వ అధికారాలన్నీ చేజిక్కించుకున్న తర్వాత రష్యన్ బూర్జువా విశిష్టాధికార వర్గం (bourgeois privileged stratum) తన స్వంత రాజకీయ, ఆర్థిక అధికారాన్ని పెద్దెత్తున విస్తృతపరుచుకుంది. ఈ విశిష్టాధికార వర్గం పార్టీ, ప్రభుత్వం, సైన్యాలలోనూ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలోనూ ఆధిపత్య స్థానాన్ని పటిష్టపరచుకుంది. ఈ విశిష్టాధికార వర్గం మొత్తంగా

రాజ్యయంత్రాంగంపైన, సామాజిక సంపదపైనా పెత్తనం చెలాయించే బ్యూరాక్రటిక్ గుత్త పెట్టుబడిదారీ వర్గంగా రూపొందింది. సోషలిస్టు యాజమాన్యాన్ని పెట్టుబడిదారీ మార్గీయుల యాజమాన్యంగానూ, సోషలిస్టు ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థగానూ, ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థగానూ మార్చడానికి, ఈ నూతన బ్యూరాక్రటిక్ గుత్త బూర్జువా తన అధీనంలోని రాజ్యాధికారాన్ని ఉపయోగించింది.

**ఏక పార్టీ ప్రభుత్వ ఆధిపత్యం కొనసాగింపు :**

చైనా ఎర్ర నిరంకుశాధికార పెట్టుబడిదారీ వర్గపు సమైక్యత, ప్రత్యేకత – రెండూ 1989 తియనాన్‌మెన్ స్క్వేర్ ఘటనల అణచివేతకు కేంద్ర భూమికను పోషించాయి. పెట్టుబడిదారీ విధానం దాని స్వభావ రీత్యానే ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమైనదని, అది సామాజిక అణచివేత వ్యవస్థగానే ఉంటుందని ఈ ఘటనలు రుజువు చేశాయి. క్రూరమైన హింస, బల ప్రయోగం ద్వారా ప్రజా పోరాటాలను అణచివేయడం ద్వారా మాత్రమే శ్రమజీవి ప్రజానీకంపై పెట్టుబడిదారీ ఫాసిస్టు అణచివేత వ్యవస్థను రుద్దగలిగారు. పెట్టుబడిదారీ అభివృద్ధికి మార్గం సుగమం చేయగలిగారు.

**రెండవ తరం సంస్కరణలు :**

తియనాన్‌మెన్ స్క్వేర్ ఘటనలు, తూర్పు బ్లాక్ (తూర్పు యూరప్, యుఎస్ఎస్ఆర్‌లలో బూర్జువాలందరి కోసం స్వేచ్ఛా మార్కెట్ వ్యవస్థను తెరిచేందుకు ఎల్ట్సిన్ చేత సంస్కరణలు అమలు జరపబడినాయి) విచ్ఛిన్నం కావడంతో రివిజనిస్టు చైనా కమ్యూనిస్టు పార్టీకి షాక్ తగిలింది. దీంతో అది మొదటి తరం సంస్కరణల ద్వారా వదులుగా మారిన పార్టీ–ప్రభుత్వ వ్యవస్థపై కేంద్ర నియంత్రణను పునఃస్థాపించింది. సిపిసి నాయకత్వం ప్రభుత్వ బడ్జెట్ పంపిణీపై తన నియంత్రణను తిరిగి సంపాదించుకుంది. ద్రవ్య, ఆర్థిక సుస్థిరతను పునఃస్థాపించింది. డెంగ్ 1992 వేసవి కాలంలో దక్షిణ చైనాలో ఉన్న ఎస్ఈజడ్‌లలో పర్యటించిన తర్వాత రెండవ తరం 'సంస్కరణ'లను ప్రవేశపెట్టాడు. ఈ సంస్కరణలలో మొదటి ప్రధాన అంశం ఎస్ఈజడ్‌లను మరిన్ని నగరాలకు, రాష్ట్రాలకు యథావిధిగా విస్తరించడం. ఈ సంస్కరణలు చైనా బయట (తూర్పు యూరప్, యుఎస్ఎస్ఆర్‌లలో) సంభవించిన ఘటనలకు తావివ్వకుండా వాటికి భిన్నమైన, చైనా లక్షణాలతో కూడిన నూతన దిశను తీసుకున్నాయి.

1990ల ప్రారంభానికి, చైనాలో కారు చౌక, అనుకూలమైన శ్రమశక్తిని ఉపయోగించుకునేందుకు అవకాశం దొరికితే వచ్చే విస్తృత లాభావకాశాల కోసం విదేశీ పెట్టుబడి ఎదురు చూస్తున్నది. అంటే చైనా ప్రభుత్వరంగ కంపెనీలలోకి ఎంఎన్‌సిలు చొచ్చుకొని వచ్చే అవకాశం కోసం పొంచి ఉన్నాయి. దీంతో పాటు చైనా వేతన–శ్రమలో నైపుణ్యాన్ని సంపాదించడమే కాక, సోషలిస్టు ఆర్థిక విధానంలోనూ, మొదటి తరం సంస్కరణల కాలంలోనూ

పెట్టుబడి సంచయనం జరిగిన ఫలితంగా అది ఇతర తూర్పు ఆసియా ఆర్థిక వ్యవస్థల కంటే సాపేక్షికంగా బలంగా ఉండింది. విశాలమైన పారిశ్రామిక పునాది కలిగి ఉండడం వల్ల చైనా కీలకమైన స్థానిక ఇన్‌పుట్‌లు[9], సర్వీసులను అందించగలిగి ఉండే అనుకూలతను కలిగి ఉండింది. పారిశ్రామిక ఉత్పాదనకు మద్దత్తు నిచ్చేందుకు సాపేక్షికంగా అభివృద్ధి చెందిన సామాజిక, ఆర్థిక మౌలిక సదుపాయాలను (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను) కూడా చైనా కలిగి ఉండింది.

అయితే ఈ రెండవ తరం సంస్కరణల కాలంలో చైనాలో నిబంధనలకు లోబడిన, లోబడని వ్యాపార వ్యవస్థ పార్టీ–ప్రభుత్వ వ్యవస్థలకు సన్నిహితంగా ముడివేసుకొని ఉండేది. విదేశీ పెట్టుబడికి అవకాశం తక్కువగా ఉండేది. విదేశీ పెట్టుబడి పెద్దెత్తున లాభాలను పొందాలంటే, చైనా ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకోవాల్సి వచ్చేది. తన ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండడంతో చైనా ప్రభుత్వం ప్రధాన బహుళజాతి కార్పొరేషన్లతో బలంగా బేరసారాలాడే పరిస్థితిలో ఉండేది. వాటికి షరతులు విధించేది. విదేశీ పెట్టుబడి నేరుగా నిజమైన ఉత్పాదక పెట్టుబడి రూపాన్ని తీసుకున్నప్పుడు, అంటే, ప్లాంట్లు, యంత్రసామగ్రి తయారీ ఫ్యాక్టరీలు వంటి నిర్దిష్ట రూపాలలో ఉంటేనే చైనాలోకి ప్రధానంగా విదేశీ పెట్టుబడిని అనుమతించేవారు. భారీ స్థాయి పెట్టుబడుల విషయంలో సాధారణంగా ప్రభుత్వ కార్పొరేషన్లకూ, బహుళజాతి కార్పొరేషన్లకూ మధ్య జాయింట్ వెంచర్ల రూపం అమలులోకి వచ్చేది. సాధారణంగా ప్రభుత్వం వీటిని నియంత్రించడం ద్వారా తన ప్రయోజనాన్ని పొందేది. అటువంటి జాయింట్ వెంచర్లలో బహుళజాతి కంపెనీలు ఆధునిక ప్లాంట్లు, యంత్రసామగ్రి తయారీ కంపెనీలలో ఆధునిక టెక్నాలజీని, దాన్ని వినియోగించే టెక్నికల్ అనుభవాన్ని, మేనేజ్‌మెంట్ స్కిల్స్‌ను అందిస్తుండేవి. అందులో ఉత్పత్తి అయిన సరుకులను ప్రపంచ మార్కెట్లలో అమ్మేందుకై అవసరమైన మార్కెటింగ్, అమ్మకాలు, పంపిణీ నెట్ వర్క్‌లను కూడా బహుళజాతి కంపెనీలు అందిస్తుండేవి. దీనికి బదులుగా చైనా ప్రభుత్వం కార్మిక నివాసాలు, రోడ్లు, కమ్యూనికేషన్ నెట్ వర్క్‌లు, చైనాలోని ప్రభుత్వ ఎంప్లాయిమెంట్ విభాగం ద్వారా తరచుగా తరలించబడే చౌక, అనుకూల శ్రమశక్తి మొదలైన సామాజిక, ఆర్థిక మౌలిక సదుపాయాలను (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కల్పించేది. ఇక ఈ జాయింట్ వెంచర్లపై వచ్చే లాభాలను ప్రభుత్వం, బహుళజాతి కంపెనీలు పంచుకునేవి.

1992 వరకూ, చైనాలోకి విదేశీ పెట్టుబడులు ప్రధానంగా చిన్న, మధ్య స్థాయి పెట్టుబడులుగా హాంగ్ కాంగ్, తైవాన్‌ల నుంచి, కొంచెం తక్కువగా జపాన్ నుంచి వచ్చాయి. ఈ రెండవ తరం సంస్కరణలలో భాగంగా ప్రభుత్వం నూతన పద్ధతిలో అవకాశాలను కల్పించే దృక్పథం (new accommodating attitude)తో ఒకటి కంటే ఎక్కువ రంగాల్లో భారీ స్థాయి పెట్టుబడులును అనుమతించడం ఆరంభమైంది. దీని ఫలితంగా, 1992లో ఒక బిలియన్ అమెరికా డాలర్ల కంటే కొంత అధికంగా వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) 1994 నాటికి 50 బిలియన్ అమెరికా డాలర్ల కంటే అధికం అయ్యాయి. ఈ ఎఫ్‌డిఐ వెల్లువతో

ఎగుమతి-ప్రాధాన్యం (export-orientated) కలిగిన పారిశ్రామిక తయారీ (manufacturing) పరిశ్రమలు వేగంగా వృద్ధి చెందాయి.

ఈ ఎఫ్‌డిఐ వరద చైనా ప్రభుత్వానికి తక్షణం ఎన్నో ప్రయోజనాల్ని సమకూర్చి పెట్టింది. మొదటిది, ప్రభుత్వ ఖజానాలోకి జాయింట్ వెంచర్ల నుంచి లాభాల ప్రవాహం వచ్చే క్రమంలో ప్రభుత్వం తన బడ్జెట్‌లోని లోటును నింపుకోగలిగింది. రెండవది, ఈ ఎఫ్‌డిఐ ఫలితంగా ఎగుమతులు పెరిగే క్రమంలో చైనా విదేశీ వ్యాపార లోటు వ్యాపార మిగులుగా పరివర్తన చెందింది. ఈ మిగులు ప్రభుత్వానికి విదేశీ ద్రవ్య నిల్వల్ని సమకూర్చింది. మూడవది, జాయింట్ వెంచర్లు - ఉపాధి కల్పించడం ద్వారా, ప్రభుత్వ అధికార యంత్రాంగానికి చెందిన ఉన్నత స్థాయిల్లోకి వ్యాపార వ్యవహారాలు విస్తరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలో నడపబడుతూ రోజు రోజుకూ క్షీణిస్తున్న పరిశ్రమల్ని పునర్వ్యవస్థీకరించడం ద్వారా మరింత అనుకూల పరిస్థితుల్ని సృష్టించగలిగాయి.

**కేంద్ర ప్రభుత్వ పరిశ్రమల్ని పునర్వ్యవస్థీకరించడం :**

1980లలో మొదటి తరం సంస్కరణలు చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలు మీద, వ్యవసాయం మీద కేంద్రీకరించాయి. పట్టణ సహకార సంఘాలు, బస్తీ-గ్రామ స్థాయి కంపెనీలు లేదా వ్యాపార సంస్థలు (TVEs), ప్రైవేటు వ్యాపారం, పరిశ్రమలు విస్తరించే కొలదీ, కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న పెద్ద-భారీ స్థాయి పరిశ్రమలకు పెట్టుబడులు తగ్గడం వల్ల వాటి అభివృద్ధి కుంటుపడింది. ఈ రెండవ తరం సంస్కరణలలో ఈ కేంద్ర ప్రభుత్వ సెక్టారుపై దృష్టి పెట్టారు. 1997లో సిపిసి 15వ పార్టీ కాంగ్రెస్‌లో మొత్తంగా కేంద్ర ప్రభుత్వ రంగాన్ని పునర్వ్యవస్థీకరిస్తామని ప్రకటించారు. దీని లక్ష్యం ప్రభుత్వ రంగ సంస్థలు (State Owned Enterprises-SOEs)గా ప్రసిద్ధి చెందిన వాటిని ప్రత్యేకించి లాభాపేక్షిత (profit-orientated) కార్పొరేషన్లుగా పరివర్తన చెందించడం.

ఈ పునర్వ్యవస్థీకరణ కార్యక్రమంలో మొదటి చర్య చిన్న ప్రభుత్వ యాజమాన్య సంస్థలను ప్రధానంగా మేనేజ్‌మెంట్‌ను లేదా కార్మికుల శ్రమశక్తిని కొనుగోలు చేయడం రూపంలో ప్రైవేటీకరించడం. రెండవ చర్య, మిగతా ప్రభుత్వ యాజమాన్య సంస్థలను పాశ్చాత్య శైలి జాయింట్ స్టాక్ కంపెనీలుగా పరివర్తన చెందించడం. అయితే కొన్ని షేర్లను చైనాలో నూతనంగా స్థాపించబడిన స్టాక్ మార్కెట్‌లో ప్రైవేటు ఇన్వెస్టర్లకు అమ్మినప్పటికీ, చాలా వరకూ షేర్లు 'అమ్మడానికి వీలులేనివి' (non-tradable) ఉండేవి. సాధారణంగా వివిధ ప్రభుత్వ అంగాలే ఆ షేర్లను కలిగి ఉండేవి. దీని ఫలితంగా, చైనాలోని దాదాపు అన్ని భారీ స్థాయి పరిశ్రమల్లో మెజారిటీ షేర్లు ప్రభుత్వ కంపెనీల యాజమాన్యంలో ఉండే షేర్లుగా పరివర్తన చెందాయి. పాశ్చాత్య కార్పొరేషన్ల రీతిలో యాజమాన్యాన్నీ, మేనేజ్‌మెంట్‌నూ వేరు చేయడం ద్వారా ఈ

సంస్థాగత సంస్కరణలు విదేశీ పెట్టుబడితో జాయింట్ వెంచర్లు స్థాపించడాన్ని ఎంతో సులభతరం చేశాయి. తద్వారా టెక్నాలజీని అభివృద్ధి చేసుకునేందుకూ, కంపెనీలను ఆధునీకరించేందుకు అవకాశం ఏర్పడింది. ఇవి మూడవ చర్యగా చేపట్టిన కార్పొరేటైజేషన్ క్రమానికి మార్గాన్ని సుగమం చేశాయి. ఇందులో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రత్యేకించి, లాభాపేక్షిత (profit-oriented) సంస్థలుగా పరివర్తన చెందాయి. దీని ఫలితంగా కార్మికవర్గానికి లభించే సామాజిక సౌకర్యాలకు తిలోదకాలు యివ్వబడ్డాయి. అంటే, చైనాలో శ్రామిక ప్రజలు (కార్మికులు-రైతాంగం) విప్లవం ద్వారా, సోషలిస్టు నిర్మాణం ద్వారా సాధించుకున్న/పెంపొందించుకున్న సామాజిక సౌకర్యాలను ప్రభుత్వం రద్దు చేసింది. ఇది ఒక్క మాటలో చెప్పాలంటే, చైనాలో విశాలంగా ఉన్న కార్మికవర్గంపై ప్రత్యక్ష పెట్టుబడిదారుల దాడి.

ఈ నిర్ణయం పర్యవసానంగా ప్రైవేటీకరణల వెల్లువ, పెద్దెత్తున లేఆఫ్‌లు, ప్రైవేటు పెట్టుబడి పెరిగింది. చైనా ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలలో విలువ సూత్రాన్ని అమలు చేయడంలో భాగంగా నిర్దాక్షిణ్యంగా వెల్లువలా లేఆఫ్‌లు విధించబడ్డాయి. సిపిసి అధికారిక లెక్కల ప్రకారం, 1998 నుంచి 2002 మధ్యలో ప్రభుత్వ యాజమాన్యంలోని ఆర్థిక సంస్థల/కంపెనీల నుంచి రెండు కోట్ల 60 లక్షల మందికి పైగా కార్మికుల్ని తొలగించారు. ప్రపంచ మార్కెట్‌లోని పోటీకి దీటుగా నిలబడేలా ఎగుమతులు చేయడం కోసం కంపెనీలను ఆధునీకరించడం అంటే ఘనాంగ నిర్మాణాన్ని పెంచడం అనేది పెద్దెత్తున కార్మికుల లేఆఫ్‌లకు దారితీసింది. చైనా కార్మికవర్గంపై జరిగిన మరో దాడి ఏమిటంటే, ప్రభుత్వ రంగ సంస్థలలో జీవితాంతం ఉద్యోగితను కలిగి ఉండే హక్కును రద్దు చేసి, కాంట్రాక్టు లేబర్ వ్యవస్థ[10] తీసుకొనిరావడం. దీంతో కార్మికులు వ్యక్తిగత ప్రాతిపదికన తమ కాంట్రాక్టును మేనేజ్‌మెంట్ వద్ద ప్రతి సంవత్సరం రెన్యూ చేయించుకోవాల్సి వచ్చేది. కార్మికులు సుదీర్ఘకాలం ప్రతిఘటించినప్పటికీ, ప్రభుత్వ నిరంకుశ పాలనా యంత్రాంగం ఫాసిస్టు అణచివేతతో పాటు కార్మికులను చీలదీయడం ద్వారా ఈ విధానాన్ని అమలు చేయడంలో విజయం సాధించింది. చైనా కార్మికులపై ప్రభుత్వ దాడికి మరో ఉదాహరణ - పీస్-రేట్ వేతనాలను ప్రవేశపెట్టడం. దీని ప్రకారం కార్మికులు తాము చేసిన పని మీద ఆధారపడి వేరు వేరు వేతనాలు పొందేవారు.

ఈ పునర్వ్యవస్థీకరణ కార్యక్రమంలో భాగంగా చైనా ప్రభుత్వ రంగాన్ని గణనీయంగా నియంత్రించారు. దీంతో చైనా ఉత్పత్తి చాలా వరకూ ప్రైవేటు రంగంలోనే జరగడం మొదలైంది. ప్రైవేటు రంగం దేశ జిడిపిలో సుమారు 70 శాతాన్ని ఆక్రమించింది. 1998-2010 మధ్య మొత్తం పారిశ్రామిక ఆస్తులలో ప్రభుత్వ రంగ సంస్థల వాటా 68.8 నుంచి 42.4 శాతానికి తగ్గించబడింది. అదే సమయంలో వాటిలో ఉద్యోగుల సంఖ్య 60.5 శాతం నుంచి 19.4 శాతానికి తగ్గించబడింది. చైనా ఎగుమతుల్లో ప్రభుత్వ రంగ సంస్థల వాటా కూడా 1997 నాటి 57 శాతం నుంచి 2010కి 15 శాతానికి తగ్గించబడింది. 1990ల కాలంలో వేలాది

ప్రభుత్వ రంగ సంస్థలు దివాలాతీయించడం, అనేక సంస్థలను కలిపి వేసి పెద్ద యూనిట్లుగా చేయడంతో దేశమంతటా వీటి పరిమాణం తగ్గిపోయింది. దీన్ని ప్రోత్సహిస్తూ ప్రపంచ బ్యాంకు ఇలా వ్యాఖ్యానించింది : "అనేక ప్రభుత్వ రంగ సంస్థలు కార్పొరేటీకరించబడ్డాయి, పూర్తిగా పునర్వ్యవస్థీకరించబడ్డాయి (శ్రమ వర్గీకరణతో సహా). లాభం ప్రాతిపదికన అవి పని చేస్తాయని ఆశిస్తున్నాం.... ఫలితంగా, చైనా ప్రభుత్వ రంగ సంస్థల లాభాలు పెరిగాయి." ఈ పరివర్తన ఫలితంగా ప్రభుత్వ పెట్టుబడిదారీ రంగం, ప్రైవేటు పెట్టుబడిదారీ రంగం రెండూ గణనీయంగా తమ లాభాల రేటును పెంచుకున్నాయి.

చైనా ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పెట్టుబడిదారీ రంగపు వాటా తక్కువగా ఉన్నప్పటికీ అది ఇప్పటికీ ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నది. ప్రభుత్వ రంగ సంస్థల్లో చైనా ప్రైవేటు సంస్థలు పెట్టిన స్థిర ఆస్తి పెట్టుబడులు సుమారు 35 శాతం వరకూ ఉంటాయి. ప్రపంచంలోని 500 ప్రముఖ కంపెనీల్లో 2/3వ వంతు చైనా కంపెనీలు ప్రభుత్వ రంగ కంపెనీలే. బ్యాంకులు, బీమా కంపెనీలతో సహా అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను ప్రభుత్వ యాజమాన్య ఆస్తుల పర్యవేక్షణ-నిర్వహణ కమీషన్ (State-owned Assets Supervision and Administration Commission-SASAC) అనే ఒక కేంద్ర కమీషన్ ఆధ్వర్యంలో నియంత్రించబడుతున్నాయి.

**నూతన బూర్జువా వర్గం :**

పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల అభివృద్ధితో పాటే, పెట్టుబడిదారీ తరహాలో శ్రామిక ప్రజానీకాన్ని మరింతగా పీడించడం-దోచుకోవడంపై ఆధారపడి రివిజనిస్టు పాలకవర్గాల పాలన కొనసాగింది. ఈ ప్రభుత్వ నిరంకుశాధికార వర్గం క్రమంగా నిరంకుశ గుత్త పెట్టుబడిదారీ వర్గంగా, ప్రైవేట్ గుత్త పెట్టుబడిదారీ వర్గంగా పరివర్తన చెందింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల అభివృద్ధికి ప్రభుత్వ ఆస్తి లేదా ప్రజల సమిష్టి ఆస్తి ప్రత్యేకించి ప్రైవేటు ఆస్తిగా తప్పనిసరిగా పరివర్తన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమంలో పాలకవర్గ సభ్యులు ప్రభుత్వ ఆస్తి (ప్రజల సమిష్టి ఆస్తి)ని మోసపూరిత పద్ధతుల్లో కాజేయడం ద్వారా ప్రైవేటు ఆస్తిని సమీకరించుకునేవారు. అలా సమీకరించుకోకుండా వారిని ఆపగలిగేది ఏదీ లేదు.

రివిజనిస్టు చైనాలో మొదటి, రెండవ తరం "సంస్కరణ"ల కాలంలో పాలకవర్గ సభ్యులు ప్రభుత్వ ఆస్తి (ప్రజా యాజమాన్యంలో ఉన్న ఆస్తి)ని మోసపూరిత పద్ధతుల్లో కాజేయడం ద్వారా తమ ప్రైవేటు ఆస్తిని సమీకరించుకున్న ప్రధాన పద్ధతులు ఈ కింది విధంగా ఉన్నాయి (చైనాలో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధి-వర్గ పోరాటాలు - లీ మింక్వి) :

**1) నిరంకుశ అధికారంతో అమ్మడం-కొనడం :** చైనా అధికారిక నిపుణుల లెక్కలను బట్టి,

"ధర అంతరాలు," "వడ్డీ అంతరాలు," "మారకపు రేటు అంతరాలు," ఇంకా ఇతర అంశాలతో కలిపి వాటి మీద మొత్తంగా వచ్చే "ఆదాయం" (గుత్తాధికారం ద్వారా పొందగలిగే ఉత్పాదేతర లాభం) సంవత్సరానికి 400 బిలియన్ యువాన్లకు పైగా ఉంటుంది. ఇందులో 40 శాతం పాలకవర్గంలోని వారి, వారితో వివిధ సంబంధాలలో ఉండేవారి జేబుల్లోకి పోతుంది.

**2) నిరంకుశ అధికారంతో అక్రమ వ్యాపారం :** "నిరంకుశ అధికారంతో అక్రమ వ్యాపారం" (speculation)లో ఏవో మామూలు సరుకులు లేదా సేవలు కాక, రియల్ ఎస్టేట్ వాటాలను, స్టాక్ వాటాలను అమ్మడం–కొనడం జరిగేది. స్టాక్ వాటాలు మిథ్యా పెట్టుబడితో సమానం. దాని విలువ, నిజానికి ఉత్పత్తి చేస్తే అది కలిగి ఉండే విలువ కంటే అనేక రెట్లు ఎక్కువగా ఉండేవి. భూమికి సహజంగా ఎటువంటి విలువ ఉండనప్పటికీ, అది సరుకుగా మారిన ఫలితంగా భూమిపై జరిపే లావాదేవీల్లో దాని విలువ మిలియన్లు లేదా బిలియన్ల యువాన్లకు చేరుకునేది. ఆ విధంగా, నిరంకుశ అధికారంతో అమ్మకాలు–కొనుగోళ్ల కంటే నిరంకుశ అధికార అక్రమ వ్యాపారం ద్వారా సంపదను పోగు చేసుకునే వేగం, స్థాయి ఎక్కువగా ఉండేది.

**3) నిరంకుశాధికార సంస్థల ద్వారా నడిచే వ్యాపారం :** 1992లో దేశంలో మొత్తం నూతన కంపెనీలు రెండు లక్షలా ఇరవై వేలకు పెరిగాయి. ఇది 1991లో కంటే 88.9 శాతం అధికం. నూతన కంపెనీలు చాలా వరకూ ప్రభుత్వ సంస్థల ద్వారా నడపబడుతుండేవి. ప్రభుత్వ సంస్థలు తమ వ్యాపారాలలో 60 శాతానికి పైగా తామే నడుపుతుండేవి.

ప్రజా విముక్తి సైన్యం (పిఎల్ఏ) కూడా విలాసవంతమైన హోటళ్లను తెరిచింది. పిఎల్ఏ యాజమాన్యంలో ఫ్యాక్టరీలు మార్కెట్ కోసం పెద్ద మొత్తంలో రిఫ్రిజెరేటర్లు, పియానోలు, టివి సెట్లు, పాసెంజర్ విమానాలు ఉత్పత్తి చేసేవి. షెన్‌జెన్ ఎస్ఈజడ్ (స్పెషల్ ఎంటర్‌ప్రైజెస్ జోన్)లో సైన్యం నడిపే సుమారు 400 ఫ్యాక్టరీలకు సేల్స్ ఆఫీసులు ఉండేవి.

ఇలా నిరంకుశాధికార గుత్తాధికారంతో నడిపే వ్యాపారం ద్వారా మామూలు లాభాల కంటే ఎంతో అధికంగా గుత్త లాభాలను సంపాదించగలిగేవారు.

**4) దళారీ పెట్టుబడి :** చైనా పాలకవర్గంలో కొందరు నేరుగా విదేశీ పెట్టుబడితో మిలాఖత్ అయ్యారు. చైనా ప్రజల్ని దోచుకునేందుకు విదేశీ పెట్టుబడికి సహాయపడ్డారు. విదేశీ పెట్టుబడి ద్వారా సంపాదించిన సూపర్ లాభాలలో వాటాను పొందారు. చైనా వ్యాపార నియంత్రణను, పెట్టుబడిపై వివిధ ఆంక్షలను తప్పించుకోవాలనుకునే విదేశీ పెట్టుబడిదారులు పన్నులను నివారించే మార్గాలను అన్వేషించేవారు. చౌక లేదా ఉచిత భూమిని, ఇతర ప్రయోజనాల్ని పొందాలని చూసేవారు. ఇందుకోసం పాలకవర్గ అధికారాన్ని ఉపయోగించగలిగే కొందరి సహాయం వారికి అవసరం. అందువల్ల పాలకవర్గంలో కొందరిని దళారీ పెట్టుబడిదారులుగా మార్చాలని వారు భావించేవారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉన్నత పదవులు సిపిసిలో ఉన్నత

స్థాయి (ప్రముఖుల) నాయకుల కొడుకులు, కూతుళ్ల ఆధిపత్యంలో ఉండినాయి. వీళ్లు అతి పెద్ద అమెరికా, యూరప్, జపాన్ బ్యాంకులు, బహుళజాతి కార్పొరేషన్లతో కుమ్మక్కు అయ్యేవారు. పార్టీ, ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు ఎలాంటి తేడాలు లేకుండా అత్యంత సన్నిహితంగా పెనవేసుకొని ఉండేవి.

పాలకవర్గం పెద్దెత్తున ప్రభుత్వ ఆస్తిని మోసపూరితంగా కాజేసిన ఫలితంగా ప్రభుత్వ ఆదాయం, సంపదలో తీవ్రమైన నష్టం సంభవించింది. ప్రభుత్వ ద్రవ్య సంక్షోభానికి ముఖ్య కారణాలలో ఇది ఒకటి. ద్రవ్య సంక్షోభాన్ని అధిగమించేందుకు తప్పనిసరిగా ఆదాయాన్ని పెంచుకోవాలి, ఖర్చును తగ్గించుకోవాలి. ఆదాయాన్ని ఎలా పెంచుకోవాలి? వినియోగ సరుకుల ధరలు పెంచడం ద్వారా, ఖర్చును ఎలా తగ్గించుకోవాలి? సామాజిక సంక్షేమంలో కోత విధించడం తప్ప వేరే మార్గం లేదు.

ప్రభుత్వ ఆస్తిని మోసపూరితంగా కాజేయడం ద్వారా, అంటే అంతిమ విశ్లేషణలో, విశాల శ్రామిక ప్రజల్ని కొల్లగొట్టడం ద్వారా పిడికెడు మంది వ్యక్తులు అపారమైన సంపదను పోగు చేసుకున్నారు. 1993 నాటికి చైనా ప్రజానీకంలో మూడు శాతం మంది (మూడు కోట్ల మంది) ధనిక వర్గానికి చెందినవారు. 1986 నుండి 1993 వరకూ ప్రతి సంవత్సరం 100 బిలియన్ యువాన్ల ప్రభుత్వ ఆస్తి పాలకవర్గాల ప్రైవేటు ఆస్తిగా మారింది. అంటే 800 బిలియన్ యువాన్ల ప్రైవేటు సంపదను వారు 1986–1993 మధ్య పోగు చేసుకున్నారు. వీళ్లు అందరూ నిరంకుశాధికార పెట్టుబడిదారీ వర్గపు సభ్యులే. ఈ రకంగా చైనా దోపిడీ పాలకవర్గం ఒక నూతన నిరంకుశాధికార గుత్త పెట్టుబడిదారీ వర్గాన్ని, ప్రైవేటు గుత్తాధిపత్య బూర్జువా వర్గాన్ని సృష్టించగలిగింది. అంటే నిరంకుశాధికార గుత్త పెట్టుబడి, ప్రైవేటు గుత్తాధిపత్య పెట్టుబడి చైనా సమాజంలో ఆధిపత్యంలో ఉన్నాయి.

**వ్యాపార సరళీకరణ–డబ్ల్యుటిఓలో చేరిక :**

చైనాలో ప్రభుత్వ రంగాన్ని పునర్వ్యవస్థీకరించే సమయంలో 1990ల చివర తూర్పు ఆసియా సంక్షోభం సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, థాయ్‌లాండ్ దేశాలను నాశనం చేస్తూ ఉండింది. అంటే తూర్పు ఆసియా టైగర్లుగా ప్రాచుర్యంలోకి వచ్చిన దేశాలలో, 1990ల ప్రారంభంలో అమెరికా, యూరప్, జపాన్ సామ్రాజ్యవాద శక్తులు తమ వర్గ ప్రయోజనాల రీత్యా 'కమ్యూనిజానికి' వ్యతిరేకంగా అడ్డుగోడ నిర్మించడానికి పెట్టుబడిదారీ విధానాన్ని ప్రవేశపెట్టే ప్రయోగం చేశాయి. తూర్పు ఆసియా టైగర్లు తమ దేశాల్లోకి అప్పు రూపంలో వచ్చే పెట్టుబడిని అనుమతించడం కోసం తమ పెట్టుబడి నియంత్రణలను సడలించాయి. పాశ్చాత్య బ్యాంకులు, ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్లు తూర్పు ఆసియా 'అద్భుత ఆర్థిక వ్యవస్థ'లలో పెద్దెత్తున లాభాలు పొందవచ్చనే ఆశతో తూర్పు ఆసియా వెంచర్లలో షేర్లు కొనుగోలు చేయడం కోసం పరుగులు తీశాయి. మొదట్లో ఈ విదేశీ ద్రవ్య పెట్టుబడి వరద తూర్పు ఆసియా టైగర్లలో నిజమైన పెట్టుబడి

సంచయనాన్ని వేగవంతం చేసేందుకు తోడ్పడింది. తూర్పు ఆసియాలో ఆకస్మిక వృద్ధికి దారితీసింది.

అయితే శ్రమశక్తి కొరత, వృద్ధిలో క్షీణత పెరిగే కొలదీ నిజమైన పెట్టుబడి సంచయన రేటు మందగించడం ఆరంభమైంది. అటువంటి పెట్టుబడులు రాను రాను సట్టా స్వభావాన్ని సంతరించుకున్నాయి. 1997లో ఈ సట్టా పెట్టుబడులపై ఆశించిన లాభాలు రాలేదు. దీంతో విదేశీ ద్రవ్య పెట్టుబడి ఆ దేశాల నుంచి బయటకు పోయింది. అవి తమ ఇన్వెస్ట్‌మెంట్ పెట్టుబడిని వెనక్కు తిరిగి అమెరికా డాలర్లుగా మార్చేందుకు పరుగులు తీసే కొలదీ తూర్పు ఆసియా టైగర్ల జాతీయ కరెన్సీలు అమెరికా డాలర్‌ను తట్టుకొని ఎంత మాత్రమూ నిలబడలేకపోయాయి. ఒకటి తర్వాత ఒకటిగా పతనమయ్యాయి. 1997–98 తూర్పు ఆసియా సంక్షోభం ప్రభావం ప్రపంచమంతటికీ వ్యాపించింది. ఇటువంటి ఆర్థిక వ్యవస్థలలో పెట్టుబడులు పెట్టాలంటేనే ప్రపంచ ద్రవ్య పెట్టుబడి భయపడుతున్న తరుణంలోనే దక్షిణ అమెరికాలో, రష్యాలో తీవ్రమైన ద్రవ్య సంక్షోభాలు తలెత్తాయి.

తూర్పు ఆసియా టైగర్లలోని పెట్టుబడి సంచయనంతో సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ చైనా పెద్దగా కష్టపడకుండానే ఈ ఆర్థిక ఉప్పెన నుంచి బయటపడింది. దీనికి ప్రధాన కారణం, ప్రభుత్వం తన ఆర్థిక వ్యవస్థను నియంత్రించడమే. అంటే చైనా ప్రభుత్వం తన బలమైన ఆర్థిక పునాది కలిగిన నిజమైన ఉత్పాదక పెట్టుబడిలోని ఇన్వెస్ట్‌మెంట్లకు విదేశీ పెట్టుబడిని కట్టివేసే విధంగా చేయగలిగింది. చైనా అధికారులు దేశం లోపలికి–బయటికి పెట్టుబడి ప్రవాహంపై గట్టి నియంత్రణల్ని అమలు చేశారు. ద్రవ్యపరమైన తీవ్ర ఆందోళన ఏర్పడినప్పుడు విదేశీ పెట్టుబడిదార్లు తమ ఇన్వెస్ట్‌మెంట్లను వెనక్కు తీసుకొనే స్థితి, అంటే చైనా నుంచి బయటకు తీసుకువెళ్లే స్థితి లేకుండా పోయింది. ఆ విధంగా చైనా ప్రభుత్వం తూర్పు ఆసియా సంక్షోభం నుంచి తలెత్తిన ద్రవ్యపరమైన ఆందోళనను నియంత్రించగలిగింది.

అయితే తూర్పు ఆసియా సంక్షోభం వెనువెంటనే చైనాలోకి వచ్చే విదేశీ పెట్టుబడిలో తగ్గుదల వచ్చింది. దీని వల్ల ఎగుమతి–ఆధారిత పెట్టుబడి సంచయనానికి సంబంధించిన సమస్య వచ్చింది. చైనా 2000లో "గో గ్లోబల్" విధానాన్ని ప్రారంభించడంతో అది దాని ఎఫ్‌డిఐ పెట్టుబడులు వృద్ధి చెందేందుకు తోడ్పడింది. ఇందుకోసమే సిపిసి నాయకత్వం నష్టదాయకమైన (అనుకూలతలు కన్నా అననుకూలతలు ఎక్కువగా ఉండే) షరతులను ఆమోదించి 2001 డిసెంబరులో డబ్ల్యుటిఓలో చేరింది. దీని ఫలితంగా దిగుమతి చేసుకున్న సరుకులపై విధించే పన్ను (tariff) ప్రపంచంలో ప్రధానంగా 'అభివృద్ధి చెందుతున్న' మరే ఇతర దేశాల కంటే అతి తక్కువగా, సగటున 40 శాతం నుంచి 6 శాతం కోత విధించి 34 శాతం చేశారు. అదే సమయంలో ఎగుమతి సబ్సిడీలను రద్దు చేయడమైంది. ఈ ఆర్థిక సరళీకరణ విధానం ద్వారా చైనాలో వెనుకబడిన వ్యవసాయానికి సమస్యలు ఎదురైనాయి. అయినప్పటికీ చైనా

ఎగుమతులకు వ్యతిరేకంగా అమెరికా చేపట్టే చర్యల్ని పరిమితం చేయడానికి డబ్ల్యుటిఓ సభ్యత్వం దానికి తోడ్పడింది. అందువల్లనే వ్యాపారము, పరిశ్రమల సరళీకరణ, డి-రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన చాలా విషయాలలో డబ్ల్యుటిఓ ఒప్పందాలలో ఆమోదించిన అంశాలను, అవగాహనలను చైనా ప్రభుత్వం చాలా వరకూ అమలు జరిపింది. డబ్ల్యుటిఓ వ్యవస్థలో భాగం కావడం ద్వారా ఒక రకంగా అమెరికా ఆధిపత్యంలోని నూతన ప్రపంచ వ్యవస్థను చైనా ఆమోదించినట్లయ్యింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ డాట్‌కాం పతనం[11] తర్వాత విదేశీ పెట్టుబడి చైనాలోకి ప్రవేశించి దాని ఎగుమతి-ఆధారిత (export-led) వృద్ధిని తీవ్రతరం చేసింది. 2004లో ప్రపంచంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిని అందుకున్న అతి పెద్ద దేశం చైనా అయ్యింది. ఇదంతా చైనా పాలకవర్గం ఒక పథకం ప్రకారం అమెరికానూ ఇతర ప్రధాన సామ్రాజ్యవాద శక్తులనూ అధిగమించాలనే అవగాహనతోనే చేసింది. ఆటలో నియమాల్ని అంగీకరించిన తర్వాత, చైనా వాటిని తనకు అనుకూలంగా మలుచుకుంటూ ముందుకు సాగింది. చైనా ప్రభుత్వానికీ పెట్టుబడి సంచయనానికీ మధ్య అనుకూలంగా మారిన ఈ సంబంధం చైనా ఒక ప్రపంచ ఆర్థిక శక్తిగా పరివర్తన చెందడానికి ఒక ఆవశ్యక ముందు షరతు మాత్రమే. ఈ పరివర్తన చైనా ప్రభుత్వ నియంత్రణను పెంచుతుంది. చైనాలో విస్తారంగా ఉన్న శ్రామికుల శ్రమశక్తిని వెలికితీసేలా, ప్రపంచ పెట్టుబడి సంచయనంలో దాన్ని సమైక్యం చేసేలా విదేశీ పెట్టుబడిని నిర్దేశిస్తుంది. ఈ రకంగా ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో చైనా భాగం కావడం పెట్టుబడి సంచయనానికి గొప్ప ఊపు ఇచ్చింది.

## 3. చైనా ప్రపంచంలో ముఖ్యమైన ఆర్థిక శక్తిగా మారింది

1990ల ప్రారంభంలో చేపట్టిన రెండవ తరం సంస్కరణలలో భాగంగా చైనా ప్రభుత్వం పెట్టుబడిదారీ విధానాన్ని తీవ్రతరం చేయటంతో చైనా ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందింది. చైనా ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందడానికి ముఖ్యంగా దోహదం చేసిన ఒక అంశం సంపదలపై ప్రభుత్వ యాజమాన్యం ఉండడం. అందువల్ల అది తన లాభాలను ప్రభుత్వ పెట్టుబడి కోసం గానీ, ఎఫ్‌డిఐకి లేదా ఎగుమతిదార్లకు సబ్సిడీలు అందించడం కోసం గానీ ఉపయోగించేది. తద్వారా పరోక్షంగా పెట్టుబడులు పెట్టేందుకు ప్రోత్సాహం లభించేది.

ఎఫ్‌డిఐ ఎగుమతి-ఆధారిత వృద్ధిని గరిష్టంగా పెంచే విజయవంతమైన చైనా వ్యూహానికి ప్రభుత్వ పెట్టుబడి, ఎఫ్‌డిఐ, ఎగుమతులు మూడూ మూడు స్తంభాలు అయ్యాయి. జిడిపి ప్రాతిపదికన మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో చైనా వాటా గత రెండు దశాబ్దాలలో పెద్దెత్తున పెరిగింది. చైనా 1991లో ప్రపంచ ఉత్పత్తిలో 4.1 శాతాన్ని ఉత్పత్తి చేయగా, 2011 నాటికి ఇది 14.3 శాతానికి పెరిగింది. ఇది చైనాను ప్రపంచంలో రెండవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చింది. అదే సమయంలో అమెరికా వాటా 2011 నాటికి 24.1 శాతం నుంచి 19.1

శాతానికి తగ్గిపోయింది.

పెట్టుబడిదారీ విలువ ఉత్పన్నమయ్యే కేంద్ర రంగమైన పారిశ్రామిక తయారీ రంగంలో చైనా ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అగ్రభాగానికి చేరుకుంది. ఈ విధంగా, చైనా పారిశ్రామిక సరుకుల ఉత్పత్తిదారుగా 110 సంవత్సరాలుగా అమెరికా నిలబెట్టుకుంటూ వస్తున్న స్థానాన్ని ఆక్రమించుకుంది. 2011 నాటికి, ప్రపంచంలో 5వ వంతు అంటే 19.8 శాతం ఉత్పాదకత చైనా నుంచి వస్తే, 19.4 శాతం అమెరికా ఆర్థిక వ్యవస్థ నుంచి వచ్చింది. అంటే, చైనా ప్రపంచంలోనే అతి పెద్ద ఎగుమతిదారు అయ్యింది. అది ప్రపంచంలో 50 శాతం కెమెరాలను, 30 శాతం ఎయిర్ కండిషనర్లను, టెలివిజన్ సెట్లను, 25 శాతం వాషింగ్ మెషీన్లను, దాదాపు 20 శాతం రెఫ్రిజెరేటర్లను ఉత్పత్తి చేస్తోంది. 2010 నాటికి మార్కెట్ డిమాండ్‌లో 20 శాతం కంటే అధికంగా కార్లను ఉత్పత్తి చేసింది. 2003లో చైనా మొత్తం ఎగుమతులు దాని జిడిపిలో 33 శాతానికి చేరుకుంది. దీని విలువ 438.87 బిలియన్ డాలర్లు. ఇదే 1996లో 18 శాతంగా ఉండింది. విదేశీ పెట్టుబడి కంపెనీలు 240.34 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేశాయి. ఇది మొత్తం కంపెనీల ఎగుమతుల్లో 62.4 శాతం.

పారిశ్రామిక తయారీ (మాన్యుఫాక్చరింగ్) సరుకుల ఎగుమతుల విలువ 403.56 బిలియన్ డాలర్లు. మొత్తం ఎగుమతుల్లో ఇది 92 శాతం. ఇందులో 110 బిలియన్ డాలర్లకు పైగా విలువ గలిగిన ఎగుమతులు హై టెక్నాలజీ ఉత్పత్తులు. ప్రాసెసింగ్ వ్యాపారం విలువ 241.85 బిలియన్ డాలర్లు. మొత్తం ఎగుమతుల్లో ఇది 60 శాతం.

చైనా ఆర్థిక శక్తి ప్రపంచ ద్రవ్య మార్కెట్‌లో తక్కువ స్థాయిలో రుణాలు కలిగిన విషయంలో ప్రతిబింబిస్తుంది. చైనా విదేశీ అప్పు కేవలం 9.3 శాతం మాత్రమే ఉండడంతో, దాని అప్పుల సేవల (వడ్డీ తదితరమైనవి) కోసం దాని స్థూల జాతీయ ఆదాయంలో అప్పుల వాటా 2.5 శాతంగా ఉంది. ఇతర సామ్రాజ్యవాద దేశాలు చైనా ద్రవ్య పెట్టుబడి నుంచి రుణాలు తీసుకున్నాయి. అందువల్ల చైనా ఎంత మాత్రమూ సామ్రాజ్యవాద దేశాలపై ఆధారపడి మనగడ సాగించే అధీన దేశంగా, వాటి దోపిడీకి గురయ్యే అర్ధవలస దేశంగా లేదు. ఇందుకు భిన్నంగా 2014 నాటికి అది ఒక నూతన సోషల్-సామ్రాజ్యవాద దేశంగా పరిణామం చెందిందని నిస్సందేహంగా చెప్పవచ్చు. చైనాలోని కార్మికవర్గాన్ని తీవ్రంగా దోచుకుంటున్న (super exploitation) ఫలితంగానే సామ్రాజ్యవాద శక్తిగా అది ఆవిర్భవించింది. నిస్సందేహంగా, ఈ మార్పుకు చైనాలో వేగంగా సాగుతున్న పారిశ్రామికీకరణే కారణం. ఒక గ్లోబల్ ఫ్యాక్టరీగా చైనా ఆవిర్భావం ప్రపంచ ఆర్థిక పునర్వ్యవస్థీకరణను బలోపేతం చేస్తూ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని సప్లై డిమాండ్ గొలుసులోని గతిశీలతను (డైనమిక్స్) మార్చివేస్తున్నది. అది ఇంధన వనరుల కోసం, ఇనుప ఖనిజాల నుంచి సహజమైన రబ్బరు వరకూ ముడి పదార్థాల కోసం ఆకలిగొన్న డ్రాగన్ అయ్యింది.

**సామ్రాజ్యవాద స్వభావం ఎన్నటికీ మారదు :**

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచంలో పెనుమార్పులు సంభవించిన పరిస్థితుల్లో, సామ్రాజ్యవాదం బలహీనపడినప్పటికీ సామ్రాజ్యవాద దశ అంతం కాలేదు. ఈ పరిస్థితుల్లో సామ్రాజ్యవాద స్వభావాన్ని గూర్చి మార్క్సిస్టు మహోపాధ్యాయుడు మావో ఇలా పదే పదే చెప్పేవారు, "మనమింకా సామ్రాజ్యవాద దశలోనే, కార్మికవర్గ విప్లవ దశలోనే వున్నాము. మార్క్సిజం యొక్క మౌలిక సూత్రాలపై ఆధారపడి సామ్రాజ్యవాదాన్ని గురించి లెనిన్ చెప్పిన శాస్త్రీయమైన విశ్లేషణ పూర్తిగా సరైనది. లెనినిజం యొక్క మౌలిక సూత్రానికి కాలం చెల్లలేదు." కామ్రేడ్ లెనిన్, మావోలు బోధించిన ఈ సూత్రం నేటికీ మన సిద్ధాంతానికీ, కార్యాచరణకూ ప్రాతిపదికగానే ఉంటుంది. అందుచేత మార్క్సిజం-లెనినిజం-మావోయిజం చెప్పినట్లు - సామ్రాజ్యవాదపు జీవితం సుదీర్ఘమైనదేమీ కాదు. సామ్రాజ్యవాద పరాన్నభుక్కు స్వభావం కలిగిన, మరణావస్థలో వున్న పెట్టుబడిదారీ విధానం కార్మికవర్గ సోషలిస్టు విప్లవపు తొలి సంధ్య. అయితే, సామ్రాజ్యవాదం తనంత తానుగా, ఇష్టాపూర్వకంగా చారిత్రక రంగం నుండి ఎన్నటికీ తప్పుకోదు. కార్మికవర్గ నాయకత్వంలో ప్రపంచ పీడిత జాతులు, ప్రజలు సమైక్యమై ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారానే సామ్రాజ్యవాదాన్ని ఈ భూమండలం నుంచి సమూలంగా నిర్మూలించగలుగుతారు. అయితే సామ్రాజ్యవాదం తన జీవితపు చరమావస్థను సమీపించే కొద్దీ అది మరీ బరితెగించి మనుగడ కోసం పోరాడుతుంది. సామ్రాజ్యవాద స్వభావమే అది.

మనం ప్రస్తుతం 21వ శతాబ్దంలో నూతన ప్రపంచ విప్లవ శకంలో నివసిస్తున్నాం. లెనిన్, మావోల మరణానంతరం ప్రపంచ పరిస్థితి పెనుమార్పులకు గురైంది. లెనిన్ విప్లవ బోధనలు సరైనవనీ, మార్క్సిజం-లెనినిజం-మావోయిజం అజేయమైనదనీ మొత్తంగా ప్రపంచ చరిత్ర అభివృద్ధి ద్వారా రుజువైంది. కానీ, చరిత్రకు తనకంటూ మెలికలు-మలుపులు ఉన్నాయి. ఏంగెల్స్ మరణానంతరం బెర్న్‌స్టీన్, కాట్స్కీ రివిజనిజం ఆవిర్భవించిన విధంగానే, స్టాలిన్ మరణానంతరం కృశ్చేవ్-బ్రెజ్నెవ్ రివిజనిజం ఆవిర్భవించిన విధంగానే, మావో మరణానంతరం హువా-డెంగ్ రివిజనిజం ఆవిర్భవించింది. సోవియట్ యూనియన్‌లో 1956 నాటికి రివిజనిస్టు కృశ్చేవ్ నాయకత్వంలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగి, బ్రెజ్నెవ్ నాయకత్వంలో రివిజనిస్టు సోవియట్ యూనియన్ సోషల్-సామ్రాజ్యవాదంగా మారింది. మావో మరణానంతరం సోషలిస్టు చైనా రివిజనిస్టు హువా-డెంగ్ నాయకత్వంలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ జరిగి, అది ఒక నూతన సోషల్-సామ్రాజ్యవాద శక్తిగా రూపాంతరం చెందింది.

నేడు రివిజనిజాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎండగట్టడం, తుడిచిపెట్టడం, రివిజనిస్టు చైనా సోషల్-సామ్రాజ్యవాద వర్గ స్వభావాన్ని బహిర్గతం చేయడం, పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం

లాగానే సోషల్–సామ్రాజ్యవాదం కూడా అనివార్యంగా పతనమవుతుందనే చారిత్రక సూత్రాన్ని ఎత్తిచూపడం, సామ్రాజ్యవాదానికీ, అన్ని రకాల రివిజనిజానికీ, అన్ని రకాల అభివృద్ధి నిరోధకులకూ వ్యతిరేకంగా ప్రపంచ కార్మిక–కర్షక పీడిత ప్రజల, పీడిత జాతుల పోరాటాల్ని మునుముందుకు తీసుకొనిపోవడం – ఈ కర్తవ్యాలను అమలు చేయాల్సిన ప్రాధాన్యతను నేటి అంతర్జాతీయ పరిస్థితులు మరింతగా గుర్తింపజేస్తున్నాయి.

అయితే రివిజనిస్టు చైనా సోషల్–సామ్రాజ్యవాద దేశంగా (శక్తిగా) మారిందా లేదా? అనే విషయంపై ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన చర్చ గత దశాబ్ద కాలంగా కొనసాగుతోంది. కనుక చైనాలో జరిగిన మార్పులను మార్క్సిస్టు మహోపాధ్యాయులైన లెనిన్ చెప్పిన సామ్రాజ్యవాద లక్షణాల వెలుగులో విశ్లేషించాలి. అప్పుడు చైనాలో జరిగిన మార్పులను వాస్తవంగా విశ్లేషించగలుగుతాం. మార్క్సిస్టు–లెనినిస్టు–మావోయిస్టులకు సరైన పద్ధతి ఇదే. అందుచేత లెనిన్ వివరించిన సామ్రాజ్యవాద ప్రధాన ఆర్థిక లక్షణాల మధ్య సంబంధ బాంధవ్యాలను సంక్షిప్తంగా సరళంగా విశ్లేషించి, సంశ్లేషిద్దాం.

లెనిన్ సామ్రాజ్యవాదాన్ని సమగ్రంగానూ, ఖచ్చితంగానూ ఇలా నిర్వచించారు, "సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ విధానపు ప్రత్యేక చారిత్రక దశ. దాని ప్రత్యేక స్వభావం మూడు విధాలుగా ఉంటుంది : సామ్రాజ్యవాదమంటే 1) గుత్త పెట్టుబడిదారీ విధానం; 2) పరాన్నభుక్కు లేదా శిథిలమౌతున్న పెట్టుబడిదారీ విధానం; 3) మరణావస్థలోనున్న పెట్టుబడిదారీ విధానం."

సామ్రాజ్యవాదపు ఆర్థిక పార్శ్వానికి (economic aspect) ఐదు మౌలికమైన స్వాభావిక లక్షణాలున్నాయని లెనిన్ తెలిపారు. అవి, "1) ఉత్పత్తి కేంద్రీకరణ, పెట్టుబడి కేంద్రీకరణ, అత్యున్నత స్థాయికి అభివృద్ధి చెంది, ఆర్థిక జీవితంలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించే గుత్త సంస్థలు అవతరించడం. 2) బ్యాంకు పెట్టుబడి, పారిశ్రామిక పెట్టుబడి కలగలసిపోయి ఏర్పడ్డ "ఫైనాన్స్ (ద్రవ్య) పెట్టుబడి" పునాదిపై ఫైనాన్స్ ప్రభువుల కూటమి (financial oligarchy) పాలన అవతరించడం. 3) సరుకుల ఎగుమతి కన్నా భిన్నమైనటువంటి పెట్టుబడి ఎగుమతి గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకోవడం. 4) ప్రపంచాన్ని తమలో తాము విభజించుకునేటువంటి అంతర్జాతీయ గుత్త సంస్థలు ఏర్పడడం. 5) వివిధ పెద్ద పెట్టుబడిదారీ దేశాల మధ్య మొత్తం ప్రపంచ విభజన పరిపూర్తి కావడం."[12] సామ్రాజ్యవాదాన్ని గురించిన లెనిన్ సిద్ధాంతం, సామ్రాజ్యవాదపు ప్రతీఘాతుక స్వభావాన్ని మనకు తెలియజెప్పే దూరదర్శిని, సూక్ష్మదర్శిని.

ఇప్పుడు మార్క్సిస్టు మహోపాధ్యాయుడు లెనిన్ చెప్పిన పై అంశాల వెలుగులో చైనా నిర్దిష్ట పరిస్థితిని పరిశీలించుదాం.

# 4. చైనా గుత్త పెట్టుబడిదారీసంస్థలు

నిరంకుశాధికార (బ్యురోక్రటిక్) గుత్తాధిపత్య పెట్టుబడి, ప్రైవేటు గుత్తాధిపత్య పెట్టుబడి చైనా సమాజంలో ఆధిపత్యంలో ఉన్నాయి. చైనాలోకి పాశ్చాత్య, జపానీ దేశాల పెట్టుబడులు గణనీయంగా వచ్చినప్పటికీ, తన ఆర్థిక వ్యవస్థపై విదేశీ గుత్త సంస్థల ఆధిపత్యాన్ని నివారించే విధంగా చైనా పాలకవర్గం నియంత్రించింది. అది బలమైన చైనా ప్రభుత్వ, ప్రైవేటు గుత్త సంస్థలను అభివృద్ధి చేసింది. ప్రభుత్వ యాజమాన్య సంస్థలు (SOEs) అధికారికంగా ప్రభుత్వ యాజమాన్యంలో ఉంటూ, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా ప్రైవేటు కార్పొరేషన్ల లాగానే అంటే సాధారణ బహుళజాతి సంస్థలైన ఎం.ఎన్.సి., టి.ఎన్.సి.ల[13] మాదిరిగానే పని చేస్తున్నాయి. ఇతర పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాలలో కంటే ఎక్కువగా చైనాలో రాజ్యానికీ కమ్యూనిస్టు పార్టీకీ ప్రైవేటు పెట్టుబడి కార్పొరేషన్ల మీద అధిక ప్రభావం ఉంది. దీనికి కారణం ఏమంటే, ఈ ప్రైవేటు కార్పొరేషన్ల యజమానులూ మేనేజర్లూ చాలా వరకూ సిపిసి సభ్యులే. అలాగే నిరంకుశ బూర్జువా వర్గమూ, ప్రైవేటు బూర్జువా వర్గమూ ఒకదానితో మరొకటి విడదీయలేనంతగా పెనవేసుకొనిపోయి ఉంది. 2002 నాటికి చైనాలో ప్రైవేటు పారిశ్రామికవేత్తలలో ఐదింట ఒక వంతు సిపిసిలో సభ్యులుగా ఉన్నారు. మూడింట రెండు వంతులు 'ఎర్ర పెట్టుబడిదారులు'గా ఉన్నారు. చైనాలో అతి పెద్ద 'ఎర్ర పెట్టుబడిదారులు' ఇప్పుడు ఫోర్బ్స్ గ్లోబల్ బిలియనాధిపతుల పట్టిక[14]లో ఉన్నారు.

చైనాలో బలమైన ప్రభుత్వ, ప్రైవేటు గుత్త సంస్థలు ఈ రోజు 'గ్లోబల్ ప్లేయర్స్' అయ్యాయి. ప్రపంచంలోని అతి పెద్ద కార్పొరేషన్లలో చైనా గుత్త సంస్థల పురోగమనాన్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతున్నది. ప్రపంచంలోని అతి పెద్ద, అత్యంత శక్తివంతమైన కంపెనీల సూచిక అయిన ఫోర్బ్స్ గ్లోబల్ 2000[15]లో ఇప్పటికే చైనా మూడవ ర్యాంకులో ఉంది. ఈ లిస్టులో ఉన్న 121 కంపెనీలు చైనావి. అమెరికా కంపెనీలు 524. 2012లో, ఈ 121 చైనా గుత్త సంస్థల సగటు లాభం 168 బిలియన్ డాలర్లు. ఇది ప్రపంచంలోని 2,000 అతి పెద్ద కంపెనీల స్థూల లాభంలో 7 శాతం.

ప్రపంచంలోని అతి పెద్ద కార్పొరేషన్లకు మరో సూచికగా ఉండి, భిన్నమైన ప్రమాణాన్ని అనుసరించే ఫార్చ్యూన్ గ్లోబల్ 500[16]లో సైతం ప్రపంచ ప్రముఖ గుత్త సంస్థలలో అంతే గతిశీలమైన, ముఖ్యమైన, పెరుగుతున్న చైనా వాటాను మనం చూడగలం. ప్రపంచంలో అతి భారీ గుత్త సంస్థలు (ultra-super monopolies)గా ఉన్న 10 అతి పెద్ద కార్పొరేషన్లలో మూడు చైనావి – సినోపెక్ పెట్రోలియం కార్పొరేషను, చైనా నేషనల్ పెట్రోలియం మరియు ఎనర్జీ కార్పొరేషన్ స్టేట్ గ్రిడ్. 2000 సంవత్సరం ప్రారంభంలో ఈ పెద్ద 500 ప్రపంచ కార్పొరేషన్ల స్వంత దేశాల్ని పరిశీలిస్తే, చైనా జపాన్‌ను మించి పోయింది. ప్రస్తుతం అది

రెండవ స్థానంలో ఉంది. ఇందులో 73 చైనావి కాగా, 132 అమెరికావి, 68 జపాన్‌వి, 32-32 ఫ్రాన్స్, జర్మనీలవి ఉన్నాయి. ప్రపంచ ఉత్పత్తిలో, ఎగుమతుల్లో చైనా వాటా పెరుగుతున్నది. అమెరికా సామ్రాజ్యవాద అగ్ర స్థానం నుంచి బలహీనపడుతున్నది. 2000 ప్రారంభంలో ఫార్చ్యూన్ గ్లోబల్ 500లోని 197 కార్పొరేషన్లు అమెరికాకు చెందినవి కాగా, 2012 నాటికి ఈ సంఖ్య 132కు తగ్గిపోయాయి.

విదేశీ నిధులతో నడిచే సంస్థల ద్వారా చైనా నుంచి జరిగే ఎగుమతుల ఆధిపత్యం వల్ల యావత్తు చైనా ఆర్థిక వ్యవస్థపై విదేశీ ఎంఎన్‌సిల ఆధిపత్యం ఉన్నదని కొందరు పొరబడుతున్నారు. నిజానికి విదేశీ నిధులతో నడిచే సంస్థల యావత్తు ఎగుమతుల శాతం క్రమేపీ పడిపోతూ వచ్చింది. చైనా ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2012 నాటికి ఈ శాతం 50 శాతాని కంటే ఎక్కువగా పడిపోయింది.[17] చైనాలో ప్రైవేటు యాజమాన్యంలోని కంపెనీల ఎగుమతులు మరింత ఎక్కువగా 21.1 శాతం పెరిగాయి. కాబట్టి యిప్పుడు చైనాలో స్థానిక యాజమాన్యంలోని ప్రైవేటు కంపెనీలు ఎగుమతుల మార్కెట్‌లో మరింత పెద్ద భాగాన్ని ఆక్రమించే ధోరణి ఉన్నది.

చైనా గణాంకాలలో 'విదేశీ నిధులతో నడిచే సంస్థలు'గా పరిగణించేవి చాలా వరకూ నిజంగా విదేశీయం కావు. ముఖ్యంగా హాంగ్ కాంగ్ (1997 నుంచి ఇది చైనాలో భాగమే) కేంద్రిత కంపెనీలను కూడా ఇందులో చేర్చారు. చైనా 'లోపలికి వచ్చే విదేశీ ప్రత్యక్ష నిధి'కి హాంగ్ కాంగ్ అతి పెద్ద ఏకైక వనరుగా ఉంది. 2010 నాటికి హాంగ్ కాంగ్ నుంచీ చైనా లోపలికి వచ్చే 'విదేశీ' ప్రత్యక్ష నిధి 456.2 బిలియన్ డాలర్లు (41 శాతం) జమ అయ్యింది.[18] 2010 నాటికి అమెరికా నుంచి జమ అయిన ఎఫ్‌డిఐ కేవలం 78.7 బిలియన్ డాలర్లు (మొత్తంలో 7.1 శాతం)గా పోల్చి చెప్పవచ్చు.

చైనా ఆర్థిక వ్యవస్థ మీద అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి సామ్రాజ్యవాద దేశాలు ఆధిపత్యం వహిస్తున్నాయనే అపోహ ఉంది. ఇది సరైంది కాదు. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, జపాన్‌ల నుంచి చైనా లోపలికి వచ్చే ఎక్యుములేటెడ్ (సంచయన) ఎఫ్‌డిఐను కలిపినప్పటికీ (2010 నాటికి) 197.4 బిలియన్ డాలర్లు మాత్రమే ఉంది. ఇది ఒక్క హాంగ్ కాంగ్ నుంచీ వచ్చే దానిలో సగం కంటే చాలా తక్కువ (పై గణాంకాల ఆధారంగానే). అలాగే తైవాన్, దక్షిణ కొరియా, సింగపూర్, చివరికి చిన్న ద్వీపం మకావు (ఇది కూడా ఇప్పుడు చైనాలో భాగమే) నుంచీ కొంత పెట్టుబడి వచ్చింది. అయితే ఇవి ఏవీ కూడా చైనాపై ఆధిపత్యం వహించగలిగే లేదా దాని ఆర్థిక వ్యవస్థను అదుపు చేయగలిగే విదేశీ శక్తులుగా పరిగణించలేం. అందుచేత చైనా ఆర్థిక వ్యవస్థ మీద విదేశీ సామ్రాజ్యవాద దేశాలూ వాటి ఎంఎన్‌సీలూ ఆధిపత్యం చేస్తున్నవన్న, రాజకీయంగా అదుపు చేస్తున్నవన్న విశ్లేషణలు తప్పు.

2010లో మొదటిసారి చైనాలో కోటీశ్వరుల సంఖ్య 10 లక్షలకు మించిపోయింది. ఇందులో 251 మంది డాలర్ బిలియనీర్లు. ఆరు సంవత్సరాల క్రితం కేవలం 15 మంది బిలియనీర్లు మాత్రమే ఉన్నారు. కోటీశ్వరులలో సుమారు సగం మంది వ్యాపారులు. మిగతావారు వివిధ కంపెనీలలో షేర్లను కలిగి ఉన్నవారు లేదా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడిదార్లు లేదా ఉన్నత స్థాయి ఎగ్జిక్యూటివ్‌లు. చైనాలో కుబేరులలో (super-rich) చాలా మంది వ్యాపారులే.

వృద్ధి చెందుతున్న ఈ చైనా పెట్టుబడిదారీ వర్గం తన అమెరికా ప్రత్యర్థి కంటే చాలా చిన్నది. కాప్ జెమిని 2012 ప్రపంచ సంపద రిపోర్టు[19] ప్రకారం, కుబేరుల్లో చైనా (అమెరికా, జపాన్, జర్మనీల తర్వాత) 4వ స్థానంలో ఉంది. ఈ రకంగా చైనాలో గుత్త పెట్టుబడిదారుల కుబేర వర్గం (super-rich class of monopoly capitalists) ఏర్పడింది.

సంక్షిప్తంగా, చైనా గుత్త సంస్థలు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైనవి. "గుత్తాధిపత్యం సామ్రాజ్యవాదపు బలమైన ఆర్థిక పునాది'' అని లెనిన్ చెప్పారు. అందుచేత చైనా సోషల్–సామ్రాజ్యవాద దేశంగా ఎదిగిందనడానికి ఇది ఒక సంకేతంగా ఉంటుంది.

**అధిక గుత్త లాభాలు :** కార్మికవర్గం తదితర శ్రామిక ప్రజలు మరింత ఎక్కువ తీవ్రంగా దోపిడీ (exploitation and super-exploitation)కి గురికావడం అనేది చైనా సామ్రాజ్యవాద శక్తిగా ముందంజ వేయడానికి భౌతిక ప్రాతిపదిక అయ్యింది. చైనాలో వ్యవస్థీకృతమైన కేంద్రీకృత ఫాసిస్టు నిరంకుశ రాజ్య వ్యవస్థ ఉండడం వల్ల శ్రామిక ప్రజలను నిర్దాక్షిణ్యంగా దోచుకోవడం, వారి ప్రతిఘటనను అణచివేయడం సాధ్యమైంది. శ్రామికవర్గాన్ని అతి దోపిడీకి గురి చేయడం ద్వారా పెద్దెత్తున పిండుకున్న అదనపు విలువ మొత్తాల నుంచి అది ఆవిర్భవించింది. చైనాలో మెజారిటీ కార్మికవర్గం, తదితర శ్రామిక ప్రజలను తీవ్రంగా దోపిడీ (super-exploitation) చేయడమూ, పెద్ద మొత్తంలో అదనపు–లాభాలు గుంజడమూ – ఈ రెండింటినీ అత్యంత సమర్థవంతంగా నిర్వహించిన చైనా ఆర్థిక అద్భుతం వెనుక దాగి ఉన్న "రహస్యం" ఇదే. చైనా గుత్త పెట్టుబడిదారులు మునుపెన్నటి కన్నా ఎక్కువ నిర్దాక్షిణ్యంగా మారారు.

చైనా ప్రభుత్వం క్రమంగా పెద్దెత్తున లేఆఫ్‌లు, పునర్వ్యవస్థీకరణ, ప్రభుత్వ రంగాన్ని కుదించివేయడం, దీనికి సమాంతరంగా ప్రైవేటు రంగాన్ని పెంచి పోషించడం ద్వారా చైనా కార్మికుల శ్రమశక్తిని విజయవంతంగా అమ్మకపు సరుకుగా మార్చివేసింది. మావో కాలంలో సోషలిస్టు సమాజంలో స్వావలంబన, క్రమశిక్షణ, త్యాగాలకు వెరవకండి, కష్టాలను అధిగమించండి, ప్రజలకు–దేశానికి సేవ చేయండి అనే నినాదాలతో రూపొందించిన ప్రత్యేక చట్టాలను కూడా అది చైనా కార్మికవర్గాన్ని తీవ్రంగా దోపిడీ చేయడం కోసం మార్గం సుగమం చేసుకోవడానికి తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నది.

చైనా గ్రామీణ ప్రాంతంలో తీవ్రస్థాయి పేదరికం, నగరాల్లో ఉద్యోగాలకు అవకాశాలు ఉ

ండడం వల్ల లక్షలాది మంది – మెజారిటీగా యువ రైతాంగం పని కోసం నగరాలకు వెళ్లారు. చైనాలో నగరాలకు తరలి వెళ్లిన ఈ మాజీ రైతులు లేదా రైతాంగ యువతను "వలస ప్రజలు" అని పిలుస్తారు. "వలస" అనే పదం చాలా వరకూ నిర్దిష్టంగా ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లిన వారిని ఉద్దేశించి ఉపయోగిస్తారు. కానీ, చైనాలో గ్రామాల నుంచి పట్టణాలకు వలస వెళ్లిన వారిని "వలస ప్రజలు"గా పిలుస్తారు. ఈ విధంగా గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణాలకు వలస వెళ్లిన కార్మికులకు ఇండ్లు, గుర్తింపు ఉన్న పని, విద్య, వైద్య సేవలు, సామాజిక భద్రత దొరికేవి కావు. వారి జీవన పరిస్థితులు చాలా దయనీయంగా ఉండేవి. వారిలో చాలా మంది పాడుపడిన ఇండ్లు, టెంట్లు, వంతెనల కింద, సొరంగాలలో, కార్ల డిక్కీలలో తలదాచుకునేవారు. వీరు అనతి కాలంలోనే పెట్టుబడిదారులు సాగించే తీవ్రమైన దోపిడీకి ముఖ్యమైన వనరు అయ్యారు. చైనా లేబర్ బులెటిన్ ప్రకారం, గ్రామీణ ప్రాంతం నుంచి వలస వచ్చిన కార్మికుల మొత్తం సంఖ్య సుమారు 20–30 కోట్లు ఉండేది. వీరిలో సుమారు 14 కోట్ల మంది నగరాల్లో పని చేస్తున్నారు. బీజింగ్‌లోనే మొత్తం జనాభాలో వలస కార్మికులు సుమారు 40 శాతం ఉంటారు. అదే విధంగా షెన్ ఝెన్‌లోని ఒక కోటి 40 లక్షల జనాభాలో ఒక కోటి 20 లక్షల జనాభా వలస వచ్చినవారే. ఈ వలస కార్మికులు సాధారణంగా ప్రమాదకరమైన పనుల్లోకి, తక్కువ వేతనాలు ఉండే ఉద్యోగాల్లోకి నెట్టబడేవారు. మొత్తం పారిశ్రామిక కార్మికుల్లో 58 శాతం, సేవల రంగంలోని కార్మికుల్లో 52 శాతం వలస కార్మికులే. పెద్ద మొత్తంలో అసంఘటిత రంగం ఉనికికి కారణంగా ఉన్న ఈ భారీ సంఖ్యలోని వలస కార్మికులు తమ దుర్భర పరిస్థితుల రీత్యా తీవ్రమైన దోపిడీకి అనుకూలంగా ఉన్నారు. అధికారిక లెక్కల ప్రకారం 21వ శతాబ్దపు మొదటి దశాబ్దంలో సంఘటిత రంగం మొత్తం పట్టణ కార్మికుల్లో 30–37 శాతం ఉంటుంది.

చైనాలో లాభాలు అనేక రెట్లు పెరగడానికి ప్రధాన కారణం కార్మికులను తీవ్రమైన దోపిడీ (super exploitation) చేయడమూ, చైనా పెట్టుబడిదారీ పాలకవర్గం కార్మికుల వేతనాల్ని వాటి విలువ కంటే తగ్గించి వేయడమే. ఇదే విధంగా విదేశీ కంపెనీలు సైతం కార్మికుల విచ్చలవిడి దోపిడీని కొనసాగించాయి. దీనివల్ల జాతీయ ఆదాయంలో కార్మిక వేతనాల వాటా వేగంగా పడిపోయింది. చైనా తయారీ రంగ విలువ కలిగిన పారిశ్రామిక కార్మికుల వేతనాల వాటా 2002లో 52.3 శాతం నుంచి 2008లో 26.2 శాతానికి పడిపోయింది. జిడిపిలో మొత్తం వేతనాల వాటా 1983లో 57 శాతం నుంచి 2005లో కేవలం 37 శాతానికి పడిపోయింది.

చైనా పరిశోధకులు డాంగ్ టావో గత రెండు దశాబ్దాల్లో చైనాలో పెద్దెత్తున పెరిగిన కార్మిక శ్రమశక్తి దోపిడీ రేటును సూచిస్తూ ఈ విధంగా లెక్కలు ప్రచురించారు :

వేతనాలు మొత్తం చైనా పారిశ్రామిక సంస్థల విలువలో 10 శాతం కంటే తక్కువగా ఉండగా, అదే సమయంలో అది అభివృద్ధి చెందిన దేశాల్లో సుమారు 50 శాతంగా ఉంది. పెరల్ నదీ డెల్టా ప్రాంతంలో అమెరికా పారిశ్రామిక ఉత్పాదకత సుమారు 17 శాతం ఉండగా, వేతనాలు కేవలం సుమారు 6.7 శాతంగా ఉండినాయి. చైనాలో 1990 నుంచి 2005 మధ్య కార్మికుల వేతనాలు (లేబర్ రెమ్యునెరేషన్) జిడిపితో పోల్చినప్పుడు 53.4 శాతం నుంచి 41.4 శాతానికి పడిపోయాయి. 1993 నుంచి 2004 మధ్య ప్రభుత్వ రంగ సంస్థల్లో, భారీ పరిశ్రమల్లో మొత్తం వేతనాలతో పాటు లాభాల శాతం కూడా గణనీయంగా 240 శాతం నుంచి 43 శాతానికి పడిపోయింది. చైనా ఒక బలమైన సామ్రాజ్యవాద పోటీదారుగా ఉండాలంటే అది కార్మికవర్గాన్ని అత్యంత తీవ్రంగా దోచుకోవడం కొనసాగించక తప్పదు. చైనా, అమెరికా, జపాన్, ఇతర సామ్రాజ్యవాద ప్రత్యర్థులతో పోటీ పడాలంటే అది తప్పనిసరిగా మరిన్ని తన ఫ్యాక్టరీలను వెనుకబడిన దేశాలకు తరలించక తప్పదు. అక్కడి కార్మికవర్గాన్ని, శ్రామిక ప్రజానీకాన్ని తీవ్రంగా దోపిడీకి గురిచేయక తప్పదు.

## 5. చైనాలో ద్రవ్య పెట్టుబడి

సామ్రాజ్యవాదపు మొట్టమొదటి ఆర్థిక లక్షణం గుత్తాధిపత్యం. రెండవది, ద్రవ్య పెట్టుబడి రూపొంది, కొద్ది మంది ద్రవ్య పెట్టుబడిదారుల ఆర్థిక ఆధిపత్యం ఏర్పడడం (oligopoly)[20]. పారిశ్రామిక రంగంలో గుత్తాధిపత్యపు ఆవిర్భావంతో పాటు బ్యాంకింగ్ పరిశ్రమలో కూడా గుత్తాధిపత్యం ప్రత్యక్షమవుతుంది. పారిశ్రామిక సంస్థల షేర్లను కొనడం ద్వారా పెద్ద బ్యాంకులు పారిశ్రామిక రంగంలోకి చొరబడతాయి. పారిశ్రామిక గుత్త సంస్థలు బ్యాంకుల షేర్లను కొనడం ద్వారా బ్యాంకింగ్ రంగంలోకి చొరబడతాయి. ఫలితంగా గుత్త బ్యాంకు పెట్టుబడి, గుత్త పారిశ్రామిక పెట్టుబడి కలగలిసిపోయి ద్రవ్య పెట్టుబడిగా రూపొందుతాయి. ఇదే విధంగా చైనాలో గుత్త పారిశ్రామిక పెట్టుబడి, గుత్త బ్యాంకు పెట్టుబడి ఆవిర్భవించడమే కాక, అవి ఒకదానితో మరొకటి విడదీయలేనంత స్థాయిలో కలగలిసిపోయి ద్రవ్య పెట్టుబడి ఆవిర్భావానికి దారితీసింది. ఈ క్రమంలో చైనాలో అతి పెద్ద మొత్తం ఫైనాన్స్ పెట్టుబడిపై ఆధిపత్యం వహించే కొద్ది మంది ద్రవ్య పెట్టుబడిదారులు (financial oligopolists) ఆవిర్భవించారు. కొద్ది మంది గుత్త ప్రభువుల ఆధిపత్యంలోని చైనా కేంద్ర ప్రభుత్వానికి ఈ రంగం మీద చెక్కుచెదరని అదుపు ఉన్నది. ఉదాహరణకు మత్తు పానీయాల (బివరేజ్) తయారీ సంస్థ హాంగ్ జోయు వహహ గ్రూపు చైర్మన్ మరియు చైనాలో సంపన్నులలో రెండవ వ్యక్తి అయిన జాంగ్ క్వింగ్ గోయు కుటుంబం సంపాదన 68 బిలియన్ యువాన్లు. బీజింగ్‌లోని లాంగ్ ఫర్ ప్రాపర్టీస్ చైర్–ఉమన్ వు యాజున్ కుటుంబ సంపద 40 బిలియన్ యువాన్లు. ఆమె చైనాలో అత్యంత సంపన్నురాలు. చైనా ప్రధాన మంత్రి వెన్ జియాబావో కుటుంబం నేడు

బిలియనీర్ పెట్టుబడిదారీ కుటుంబం. అది 2.7 బిలియన్ డాలర్ల ఆస్తుల్ని తన అధీనంలో ఉంచుకున్నది.

ప్రపంచంలో పది అతి పెద్ద బ్యాంకులలో నాలుగు చైనావి. ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంకు ఆఫ్ చైనా (ఐసిబిసి) వీటిల్లో కెల్లా పెద్దది. దీని సంపద 2.8 ట్రిలియన్ డాలర్లు. మిగిలినవి చైనా కన్‌స్ట్రక్షన్ బ్యాంకు (2.2 ట్రిలియన్ డాలర్ల సంపదలు), బ్యాంకు ఆఫ్ చైనా (2.0 ట్రిలియన్ డాలర్లు), అగ్రికల్చరల్ బ్యాంక్ ఆఫ్ చైనా (2.1 ట్రిలియన్ డాలర్లు). ఈ బ్యాంకులు చైనా ద్రవ్య పెట్టుబడికి కేంద్రంగా ఉన్నాయి. ఈ 'బిగ్ ఫోర్' బ్యాంకులు సిపిసి అధికార వ్యవస్థలో సీనియర్ వ్యక్తుల నేతృత్వంలో ఉన్నాయి. చైనాలో పెద్ద బ్యాంకులన్నీ ప్రభుత్వ, పార్టీ గట్టి నియంత్రణ కింద ఉన్నాయి. చైనా పెద్ద బ్యాంకుల మీద ఈ రాజ్య నియంత్రణ అనేక రకాలుగా చాలా ముఖ్యమైనది. యావత్తు ఆర్థిక వ్యవస్థనూ ప్రభుత్వం, పార్టీ పర్యవేక్షించేందుకూ తాము కోరుకున్న విధంగా పటిష్టపరచాలనుకున్న, ప్రోత్సహించాలనుకున్న ఆర్థిక రంగాలలో మరింతగా పెట్టుబడి పెట్టడానికీ ఇది ఒక ప్రాథమిక యంత్రాంగంగా ఉన్నది. ప్రత్యేకించి ఎస్‌ఓఈలకు బ్యాంకుల నుంచి రుణాలను ప్రోత్సహించారు. చైనా ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగ సంస్థలపై ప్రభుత్వ పట్టు యథాతథంగా ఉండడానికి ఇది ఒక కారణం. చైనాలో ఈ ద్రవ్య కమాండ్, అమెరికాలో ఉన్నంత గణనీయ స్థాయిలో వాల్ స్ట్రీట్[21] లాభపరుల చేతుల్లో లేదు. సిపిసిలో బలపడిన, ప్రవేశించిన చైనా నిరంకుశాధికార–ప్రైవేటు గుత్తాధిపత్య పెట్టుబడిదారీ వర్గ 'పాలకవర్గం' చేతుల్లో గుత్తాధిపత్యం ఉన్నది.

చైనాలో ద్రవ్య ప్రభు కూటమి (financial oligarchy)[22] దేశ రాజకీయ అధికారంపైన మాత్రమే కాక, ఉపరితలంలోని వివిధ రంగాలపైన కూడా అదుపును కలిగి ఉంది. ఉదాహరణకు, చైనాలో శాసన నిర్మాణ అంగం (చట్టసభ) అయిన జాతీయ ప్రజా కాంగ్రెస్ (ఎన్‌పిసి)లో 70 మంది సంపన్న సభ్యులు తమ సంపదలను మరింతగా పెంచుకున్నారు. వీరి సంపద అమెరికా కాంగ్రెస్‌లోని మొత్తం 535 మంది సభ్యులు, అధ్యక్షుడు, అతని కాబినెట్ సభ్యులు, మొత్తం సుప్రీం కోర్టుకు సంబంధించిన నికర ఉమ్మడి సంపదను మించిపోయింది. 2011లో ఈ 70 మంది శాసన కర్తల (law makers) నికర సామూహిక సంపద 565.8 బిలియన్ యువాన్లకు (89.8 బిలియన్ అమెరికన్ డాలర్లకు) పెరిగింది.

చైనా బ్యాంకుల విధి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కార్పొరేటైజేషన్‌కు ఫైనాన్స్ చేయడమే కాక, ప్రభుత్వ నిర్దేశానికి లోబడి చైనాలో పెట్టుబడి సంచయనం చేయడం కూడా వాటి విధి అయ్యింది. ఏమైనప్పటికీ ఈ చైనా భారీ బ్యాంకులు స్వయంగా అత్యంత లాభప్రదమైనవి. 2012 నాటికి ఒక్క ఐసిబిసికే దాదాపు 50 బిలియన్ డాలర్ల ఫ్రీ టాక్స్ లాభాలు ఉన్నాయి. 2012 చివరిలో చైనాలో నాలుగు పెద్ద బ్యాంకులు కలిసి 150 బిలియన్ యువాన్లు (30 బిలియన్ డాలర్లు), అంటే చైనా గడించిన లాభాల్లో మూడవ వంతు లాభాలు గడించాయి.

అదే కాలంలో అమెరికాలో నాలుగు అగ్ర బ్యాంకులు కలిపితే వచ్చిన మొత్తానికి ఇది మూడింతలు.

**కార్మిక ప్రభువులు :**

పెట్టుబడిదారీ చైనా అభివృద్ధి క్రమంలో కార్మిక ప్రభువులు, పెటీబూర్జువాల దొంతరలు ఆవిర్భవించాయి. వారి సంఖ్య 10–15 కోట్ల వరకూ ఉంటుంది. ఇందులో రెండు అంశాలు ఉన్నాయి : ఒకటి, చైనాలో గతం నుండి పెద్ద సంఖ్యలో ట్రేడ్ యూనియన్లు, ఉద్యోగ సంఘాలు, రైతు సంఘాలు ఉండేవి. పెట్టుబడిదారీ పునరుద్ధరణతో ఈ యూనియన్ల నాయకత్వం రివిజనిస్టుల చేతుల్లోకి వెళ్లింది. వీటి చేతుల్లోనే ప్రభుత్వ, ప్రైవేటు యూనియన్ల నాయకత్వం ఉంది. ఇదే కార్మిక ప్రభువులకు ప్రదాన వనరైంది. రెండవది, ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్, సర్వీస్ మేనేజ్‌మెంట్, లక్షలాది దళారీ కాంట్రాక్టర్లు, లాయర్లు, విద్యావేత్తలు, ఇంజినీర్లలో పెత్తందారీ దొంతరలలోని వారు ఉన్నారు. వృత్తి నిపుణులు(ప్రొఫెషనల్స్)గా, మేనేజర్లుగా గుర్తింపు పొందిన ఈ దొంతర చైనాలో ఆవిర్భవించిన భారీ చైనా, విదేశీ కార్పొరేషన్లకు, చైనా పెట్టుబడిదారీ వర్గానికి సేవ చేస్తున్నది. ఈ ప్రత్యేక దొంతర చైనా సామ్రాజ్యవాద ఆవిర్భావాన్ని ప్రతిబింబిస్తుంది. తదనుగుణంగా మెజారిటీ కార్మికులు, రైతులు అత్యంత తీవ్రంగా దోపిడీ పీడనలకు గురవుతూనే ఉన్నారు. ఈ కార్మిక ప్రభువులకూ, కార్మికవర్గ ఉద్యమంలోని రివిజనిజానికీ ఆర్థిక పునాది గుత్త పెట్టుబడి సంపాదించే అధిక లాభాలే. సామ్రాజ్యవాద పరిస్థితులలో, కార్మికవర్గ ప్రభువులు అవతరించడంతో సామ్రాజ్యవాదాన్ని పరిరక్షించే రివిజనిస్టు సిద్ధాంతం, పంథాలు కూడా తలెత్తుతాయి. కార్మిక ప్రభువులు కార్మికుల ముసుగులో ఉండే బూర్జువా వర్గపు ఏజెంట్లు. రివిజనిజం మార్క్సిజం ముసుగులోని బూర్జువావర్గ సిద్ధాంతం.

**ఆర్థిక అరాచకత్వం పెట్టుబడిదారీ విధానపు స్వభావంలోనే ఉంటుంది :**

ప్రపంచ అధికోత్పత్తి సంక్షోభం వల్ల కానీ ద్రవ్య సంక్షోభాల వల్ల కానీ చైనా పెద్దగా ప్రభావితం కాలేదు. దీనికి కారణం క్రెడిట్/డెబిట్ భారాన్ని మరింత ఎక్కువగా వేగవంతంగా బ్యాలెన్సు చేసుకునే సామర్థ్యం దానికి ఉండింది. 2008–09 ద్రవ్య సంక్షోభ కాలంలో ప్రోత్సాహక (స్టిములస్) పాకేజీలు చైనాలో మరింత ప్రభావయుతంగా ఉన్నాయి. అయితే చైనా ద్రవ్య వ్యవస్థ మార్కెట్ పోటీలో భాగంగా పెట్టుబడిని అరాచకంగా కేటాయించే దిశగా ప్రయాణిస్తోంది. ఎంఎల్ఎం దృష్టి నుంచి ఇది పెట్టుబడిదారీ విధానంలో అనివార్యం. అంటే 1990ల చివరిలో అమెరికాలో 'నూతన ఆర్థిక వ్యవస్థ' లేదా 'డాట్ కామ్' బూమ్[11] అనేది వచ్చింది. ఇందులో ఇంటర్నెట్ కంపెనీలలో భారీగా అసమానంగా పెట్టుబడులు పెట్టారు. వీటిలో కొన్ని ఏ మాత్రం లాభాలు చేసుకోలేక అనేక బిలియన్ డాలర్లు నష్టపోయాయి. ఈ నష్టం తర్వాత 2000–2006 మాంద్యంలో అమెరికాలో పెట్టుబడి కేటాయింపులో మరో నూతన వెల్లువ వచ్చింది. ఇదే 2007 చివర్లో ప్రధాన గృహ రుణ సంక్షోభంగా, సబ్ ప్రైమ్ సంక్షోభంగా పరిణమించింది. 1980ల చివరిలో జపాన్‌లోనూ ఇటువంటిదే జరిగింది. ఇదే రియల్ ఎస్టేట్ బుడగ[23]. ఇది

1990ల ప్రారంభంలో పేలిపోయింది. బుడగ పేలినప్పుడే సంక్షోభం వెల్లడవుతుంది.

అన్ని పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాలలో మాదిరిగానే చైనా ద్రవ్య వ్యవస్థలో కూడా అనేక సమస్యలు నిరంతరం ముందుకు వస్తున్నాయి. ఉదాహరణకు చైనాలో గృహ సంక్షోభం ఏర్పడుతున్నది (చైనాలో గృహ సంక్షోభం అనేక సంవత్సరాలుగా ఉంటూ వస్తున్నది). 2013లో నూతన గృహాల అమ్మకాలు మొట్టమొదటిసారిగా ట్రిలియన్ డాలర్ల[24]కు మించిపోయాయి. ఒక సంవత్సరం ముందు నుంచీ నూతన గృహ అమ్మకాల మొత్తం విలువ 27 శాతం పెరిగింది. 2013 డిసెంబర్ నాటికి సగటు నూతన గృహ ధరలు బీజింగ్‌లో (ఒక సంవత్సరం ముందు) 16 శాతం పెరిగాయి. షాంఘైలో 18 శాతం పెరిగాయి. గువాంగ్‌ఝూ, షెన్‌ఝెన్‌లలో 20 శాతం పెరిగాయి (హౌసింగ్-సేల్స్ ఇన్ చైనా టాప్ ఒన్ ట్రిలియన్ డాలర్ వ్యాసం నుంచి, సాన్ ఫ్రాన్సిస్కో క్రానికల్, జనవరి 21, 2014). అమెరికాలో ఉన్నట్లుగానే (భిన్న లక్షణాలతోనే అయినా) చైనాలో కూడా ప్రభుత్వ నియంత్రణలో ఒక బ్యాంకింగ్ వ్యవస్థ ఉన్నది. ప్రస్తుతం చైనాలో (ఇతరత్రా మాదిరిగానే) పెద్ద మొత్తంలో అధికోత్పత్తి కొనసాగుతున్నది. దీని వల్ల అక్కడ బోసిబోయిన (ఖాళీ అయిన) వేలాది అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలతో కొన్ని నూతన 'ఘోస్ట్ సిటీస్' (దయ్యపు నగరాలు) ఉనికిలోకి వచ్చాయి.

ఈ రకమైన ఆర్థిక అరాచకత్వంలో ఇతర పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాలకూ చైనా పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదానికీ మధ్య మౌలికంగా ఏమీ తేడాలు లేవు. బూమ్ సమయాలలో రుణం విస్తరించడం, సంపదల బుడగలూ ఉంటాయి. పెట్టుబడిదారీ విధానపు స్వభావంలోనే ఆర్థిక అరాచకత్వం ఇమిడి ఉంటుంది.

## 6. "పెట్టుబడి ఎగుమతి ద్రవ్య పెట్టుబడి యొక్క ప్రపంచాధిపత్యానికి దారితీస్తుంది"

**బాండ్లు, రుణ పెట్టుబడుల రూపంలో పెట్టుబడి ఎగుమతి :**

మార్క్సిస్టు మహోపాధ్యాయులు లెనిన్ చెప్పినట్లు సామ్రాజ్యవాద లక్షణాలలో ఒకటి గుత్త సంస్థల ఆవిర్భావం, మరొకటి పెట్టుబడి ఎగుమతి. చైనాలో పెద్దెత్తున పెట్టుబడి ఎగుమతిలో వృద్ధి కారణంగా ఇటువంటి పరిణామం జరుగుతున్నది.

చైనా పెట్టుబడి ఎగుమతిదారుగా వేగంగా వృద్ధి చెందటం రెండు స్థాయిల్లో జరిగింది. పారిశ్రామిక పెట్టుబడి, ద్రవ్య పెట్టుబడి (బాండ్లు, రుణాలు మొదలైనవి). చైనా సామ్రాజ్యవాదం పారిశ్రామిక ఉత్పత్తి నుంచి అత్యంత వేగంగా పెట్టుబడి సంచయనం చేసుకున్న ఫలితంగా, అది తన భారీ బ్యాంకు పెట్టుబడితో కలిసి పెద్ద మొత్తంలో ద్రవ్య పెట్టుబడిని కూడా సంచయనం చేసుకుంది. దేశ, విదేశీ మారక ద్రవ్య నిల్వలు అసాధారణ వేగంతో వృద్ధి చెందటంలో ఇది

కనపడుతుంది. ఈ నిల్వలు 2000లోని 165 బిలియన్ డాలర్ల నుంచి 2012 మార్చిలో 3,305 బిలియన్ డాలర్లకు పెరిగాయి. చైనా విదేశీ మారక ద్రవ్య నిల్వలు దాని తర్వాతి ఆరు దేశాల అతి పెద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వల మొత్తంతో సమానం. విదేశీ మారక ద్రవ్య నిల్వలు అప్పుల రూపంలో ద్రవ్య పెట్టుబడిగా వినియోగించబడతాయి. అప్పు తీసుకునే దేశం ద్వారా లభించిన అదనపు విలువలో వాటా వాటాదార్లకు దక్కుతుంది. సాధారణంగా, విదేశీ మారక ద్రవ్య నిల్వలపై ప్రత్యేక వినియోగ హక్కులను కలిగి ఉండడం కోసం వీటిని సాపేక్షికంగా సురక్షితంగా ఉండే విదేశీ ప్రభుత్వ బాండ్లు, అంతర్జాతీయ ఒప్పందాలలో భాగంగా లేదా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో బ్యాంకు డిపాజిట్ల రూపంలో నిల్వ చేయబడతాయి. వాస్తవానికి, చైనా స్థూల సంపదలో 3.3 ట్రిలియన్ డాలర్లు విదేశీ మారక ద్రవ్య నిల్వలే. ఇందులో చాలా వరకూ విదేశీ ప్రభుత్వ బాండ్ల రూపంలో పెట్టుబడిగా పెట్టబడి ఉన్నాయి.

ప్రస్తుతం చైనాకి చెందిన అమెరికా బాండ్లు దాన్ని అమెరికాకు అప్పు ఇచ్చే అతి పెద్ద పెట్టుబడిదారుగా చేశాయి. అమెరికాకు అప్పులిచ్చిన వారందరిలో రెండు అమెరికా ప్రభుత్వ సంస్థల తర్వాత చైనా 1.73 ట్రిలియన్ డాలర్ల రుణధాతగా మూడవ స్థానంలో ఉంది. ఈ మధ్య చైనా ప్రభుత్వ పెట్టుబడి యూరో జోన్‌లోని ప్రభుత్వాల అప్పుల వాటాలను కొనుగోలు చేయడం ఆరంభించింది.

చైనా ద్వైపాక్షిక అప్పులలో కూడా క్రియాశీల రుణధాతగా ఉంది. ఫైనాన్షియల్ టైమ్స్ ప్రకారం, ప్రపంచంలో చైనా బ్యాంకులు గత కొద్ది సంవత్సరాలలో ముఖ్యమైన ద్రవ్య సంస్థలుగా ఆవిర్భవించాయి. అది ఇప్పటికే ప్రపంచ బ్యాంకు కంటే అధికంగా అనేక వెనుకబడిన దేశాలకు డబ్బు అప్పుగా ఇస్తున్నది. 2009, 2010లలో చైనా ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంకు, చైనా అభివృద్ధి బ్యాంకులు కనీసం 110 బిలియన్ డాలర్ల అప్పులు ఇచ్చేందుకు సామ్రాజ్యవాద దేశాల ప్రభుత్వాలతో, కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నాయి. 2008 మధ్య నుంచి 2010 మధ్య వరకూ పోల్చి చూస్తే ప్రపంచ బ్యాంకు 100 బిలియన్ డాలర్లు అప్పులు ఇచ్చేందుకు ఒప్పందాలు చేసుకుంది.

**విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ)గా పెట్టుబడి ఎగుమతి :**

చైనా 2000 సంవత్సరంలో 'గో గ్లోబల్' (ప్రపంచంలోకి పోవడం) వ్యూహాన్ని ఎంచుకున్నది. దీని సారాంశం ఏమంటే చైనా ఆర్థిక వ్యవస్థను పాక్షికంగా చౌక సరుకుల ఎగుమతి స్థానంలో పెట్టుబడి ఎగుమతి దిశగా పునర్ కేంద్రీకరించవలసిన అవసరం ముందుకు రావడమే. అప్పటి నుంచి 'గో గ్లోబల్' వ్యూహాన్ని చైనా మరింత వేగవంతంగా అమలు చేస్తున్నది. 2011 మార్చ్ 15న ప్రధాని వెన్ జియాబావో ఇలా చెప్పాడు, "మనం 'గో గ్లోబల్' వ్యూహాన్ని మరింత వేగవంతంగా అమలు చేయాలి. దానికి మద్దత్తునందించే విధానాలను మెరుగుపరచాలి. పరిశీలనా, ఆమోదనా ప్రక్రియలను సరళతరం చేయాలి. అర్హత ఉన్న సంస్థలకూ వ్యక్తులకూ

విదేశాలలో పెట్టుబడి పెట్టడానికి సహాయం అందించాలి. అంతర్జాతీయంగా చురుకుగా, నియమబద్ధ పద్ధతిలో సంస్థలు నిర్వహించేలా మనం ప్రోత్సహిద్దాం. విదేశాలలో పెట్టుబడులకు స్థూల దిశానిర్దేశాన్ని (మాక్రో గైడెన్స్) పటిష్టం చేద్దాం. వాటిని ముందుకు తీసుకువెళ్లడానికీ పరిరక్షించడానికీ, పెట్టుబడులను విపత్తుల నుంచి కాపాడడానికీ యంత్రాంగాలను మెరుగుపరుద్దాం." (రిపోర్ట్ ఆన్ ది వర్క్ ఆఫ్ ది గవర్నమెంట్, గ్జిన్ హువా నెట్ వెబ్ సైట్, మార్చి 5, 2011.)

చైనా 'గో గ్లోబల్' వ్యూహానికి కొన్ని ముఖ్య లక్ష్యాలు ఉన్నాయి : 'గ్లోబల్ ఛాంపియన్‌లను' సృష్టించడం, ప్రోత్సహించడం. అంటే, చైనా పునాదిగా ఉన్న పెద్ద బహుళజాతి కార్పొరేషన్లు ప్రపంచ గుర్తింపు పొందిన బ్రాండ్‌లతో అంతర్జాతీయ మార్కెట్‌లో మెరుగ్గా పోటీ పడడం. ఉదాహరణకు ప్రపంచ అతి పెద్ద పియానో తయారీదారుగా ఉన్న చైనా పర్ల్ రివర్ ఇప్పుడు నాణ్యతలో కూడా యమహాను మించిపోయింది. అలాగే విదేశీ సాంకేతికతనూ విజ్ఞానాన్నీ మరింత తేలికగా పొందుతున్నది. విదేశీ కార్పొరేషన్ల ద్వారా దేశం లోపలకు వచ్చే ఎఫ్‌డిఐ కంటే ఓఎఫ్‌డిఐ ద్వారా విదేశీ సాంకేతికను అధికంగా పొందవచ్చును. విదేశాలలో కంపెనీలూ కంపెనీల శాఖలూ స్థాపించడం వల్ల వ్యాపారానికి ఉన్న గణనీయమైన ఆటంకాలను (దిగుమతి కోటాలు, టారిఫ్‌ల వంటివి) పరిష్కరించుకోవచ్చును. ఈ విధంగా 'గో గ్లోబల్' వ్యూహం పెట్టుబడి ఎగుమతికి మౌలిక అవసరంగా ముందుకు వచ్చింది. అదనపు పెట్టుబడి పెట్టడం కోసం ప్రపంచంలో అత్యంత లాభప్రదమైన ప్రదేశాలు కనుక్కోవడం, దోచుకోవడం అనేది సామ్రాజ్యవాద దేశాలన్నింటికీ తప్పనిసరి అవసరమే.

2008 నుంచి ఒక వైపు ప్రపంచ ఆర్థిక సంక్షోభం తీవ్రతరం కాగా, మరో వైపు చైనా ప్రముఖ పెట్టుబడి ఎగుమతిదారుగా ఆవిర్భవించింది. 2008లో అమెరికా మీదుగా యూరప్‌కు వ్యాపించిన ద్రవ్య, ఆర్థిక సంక్షోభం ఫలితంగా అమెరికాలోనూ, వివిధ పెట్టుబడిదారీ దేశాలలోనూ అనేక పెద్ద ప్రైవేటు, ప్రభుత్వ బ్యాంకులు దివాళాతీశాయి. ఇలాంటి స్థితిలో ఆ దేశాల్లోని బహుళజాతి సంస్థలకు/కార్పొరేట్లకు అవసరమైన ద్రవ్యాన్ని, పెట్టుబడులను అక్కడి ప్రభుత్వాలు స్టిములస్ ప్రాజెక్టుల రూపంలో అందిస్తున్న కాలంలో ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని చైనా పెట్టుబడులు విదేశాల్లోకి గణనీయంగా వెల్లువెత్తాయి. చైనా ప్రభుత్వం, దాని నూతన పెట్టుబడిదారీ వర్గాల సెక్షన్లు ప్రత్యేకించి ముడి పదార్థాల కోసం, పారిశ్రామిక ఆస్తుల కోసం దేశంలో కాకుండా విదేశాల్లో విస్తృతంగా పెట్టుబడులు పెడుతున్నాయి. సంక్షోభం వల్ల ప్రపంచ వ్యాప్తంగా అప్పులు ఇచ్చి పుచ్చుకునే క్రమం స్తంభించిపోవడం, షేర్ విలువలు పడిపోవడం, డబ్బు కోసం అనేక కార్పొరేషన్ల నుంచి పెరిగిన డిమాండ్‌ను అవకాశంగా ఉపయోగించుకొని చైనా పెట్టుబడులు విదేశాల్లోకి గణనీయంగా వెల్లువెత్తాయి.

2002లో చైనా విదేశీ పెట్టుబడి కేవలం 2.5 బిలియన్ డాలర్లు మాత్రమే ఉండేది. 2007 నాటికి ఇది 18.6 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అది 2008లో రెట్టింపు కంటే అధికమై 52.2 బిలియన్ డాలర్లు అయ్యింది. స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు అంచనా ప్రకారం 2009 ఫిబ్రవరి నెలలోనే అది 65 బిలియన్ డాలర్లుగా ఉంది. ఆ బ్యాంకు లెక్కల ప్రకారం 2009లో చైనాలోకి చేరిన ఎఫ్‌డిఐ 80–100 బిలియన్ డాలర్లతో పోల్చితే అది విదేశాల్లో పెట్టే ఎఫ్‌డిఐ 150–180 బిలియన్ డాలర్లకు చేరుకుంది. చైనా ఇటీవలే ఒక సామ్రాజ్యవాద శక్తిగా ఆవిర్భవించడం వల్ల, ప్రపంచ మార్కెట్‌లో ఒక శతాబ్దానికి పైగా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిపై ఆధిపత్యం వహిస్తున్న సామ్రాజ్యవాద శక్తుల కంటే ఇది ఇప్పటికీ బలహీనమైన శక్తిగానే ఉంది. అందువల్ల పాత సామ్రాజ్యవాద శక్తుల చేతుల్లో చైనా కంటే ఎంతో అధికంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) వాటాలు ఉన్నాయి. ప్రపంచ ఎఫ్‌డిఐ పెట్టుబడుల వాటాల్లో అమెరికా 21.1 శాతం బ్రిటన్ 8.1 శాతం, జర్మనీ 6.8 శాతం, ఫ్రాన్స్ 6.4 శాతం, హాంగ్ కాంగ్ 4.9 శాతం, ఇటలీ 2.4 శాతం, చైనా 1.7 శాతం వాటాలు కలిగి ఉన్నాయి. చైనా ఎఫ్‌డిఐ పెట్టుబడులు పెట్టడంలో 2005 నుంచే వేగంగా వృద్ధి చెందుతూ వచ్చింది. చైనా అధికారిక లెక్కల ప్రకారం, 2005 నుంచి 2012 మధ్య వరకూ దేశ ఎఫ్‌డిఐ 344.8 బిలియన్ డాలర్లకు చేరింది. 2009–2011లో చైనా పెట్టిన వార్షిక ఎఫ్‌డిఐ పెట్టుబడి తమ ప్రత్యర్థులైన కెనడా, ఇటలీలను దాటిపోయింది. తాజాగా, అది జర్మనీ వంటి దేశాల స్థాయికి చేరుకుంది.

హెరిటేజ్ ఫౌండేషన్ ప్రకారం, 2005–2010 మధ్య చైనా ఎక్కువగా పెట్టుబడులు పెట్టిన అత్యంత ముఖ్యమైన దేశాలు - ఆస్ట్రేలియా 45.3 బిలియన్ డాలర్లు, అమెరికా 42 బిలియన్ డాలర్లు, బ్రెజిల్ 25.7 బిలియన్ డాలర్లు, ఇండోనేషియా 23.3 బిలియన్ డాలర్లు, నైజీరియా 18.8 బిలియన్ డాలర్లు, కెనడా 17.2 బిలియన్ డాలర్లు, ఇరాన్ 17.2 బిలియన్ డాలర్లు, కజికిస్తాన్ 12.3 బిలియన్ డాలర్లు, గ్రీస్ 5 బిలియన్ డాలర్లు, వెనుజులా 8.9 బిలియన్ డాలర్లు.

చైనా ప్రపంచంలోనే అత్యధిక పొదుపు మొత్తాల రేటును, కరెంట్ అకౌంట్‌లో భారీ మిగులును, ప్రపంచంలోనే అత్యధికంగా 1.95 ట్రిలియన్ డాలర్ల డబ్బు నిల్వలను కలిగి ఉంది. ఎంత తక్కువ అంచనా వేసినా చైనా కార్పొరేషన్లకు చెందిన 8 లక్షల విదేశీ ఉద్యోగులు వెనుకబడిన (అర్ధవలస–అర్ధభూస్వామ్య) దేశాల్లో ఉండి పని చేస్తున్నారు. వెనుకబడిన దేశాల్లో చైనా పాత్ర వేగంగా పెరుగుతున్నది. 2010లో లాటిన్ అమెరికాలో అమెరికా, నెదర్‌ల్యాండ్స్ తర్వాత చైనా మూడవ అతి పెద్ద పెట్టుబడిదారు అయ్యింది. చమురు కంపెనీల వంటి ఇతర వ్యూహాత్మక పెట్టుబడులతో పాటు చైనా గుత్త సంస్థలు ఓడరేవులు వంటి అత్యంత కీలకమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల నియంత్రణపై కేంద్రీకరిస్తున్నాయి. చైనా ఇప్పటికే పాకిస్తాన్‌లోని గ్వాదర్‌లో ఆధునిక

ఓడరేవు నిర్మాణంలో 200 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టింది. పావువా న్యూ గుయినియా దేశానికి చెందిన 1.37 బిలియన్ డాలర్ల రాము నికెల్ గనిని చైనా మెటలర్జికల్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎంసిసి) హస్తగతం చేసుకుంది. ఇది దక్షిణ పసిఫిక్ ప్రాంతంలో చైనా పెట్టిన అతి పెద్ద పెట్టుబడిని ప్రతిబింబిస్తుంది.

అదే విధంగా, చైనా ప్రభుత్వ రంగ నౌకాయాన తిమింగళం అయిన కోస్కో ఇటీవల తూర్పు మెడిటేరియన్ ప్రాంతంలో అత్యంత ముఖ్యమైన ఓడరేవుల్లో ఒకటైన గ్రీస్‌కు చెందిన అతి పెద్ద ఓడరేవు పిరాయిస్‌ను హస్తగతం చేసుకుంది.

2006 చివరి నాటికి 5,000లకు పైగా దేశీయ చైనా ఇన్వెస్ట్‌మెంటు ఎంటిటీలు ప్రపంచవ్యాప్తంగా 172 దేశాల్లో (ప్రాంతాలలో) సుమారు 10,000 విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిశ్రమల్ని స్థాపించాయి. విదేశాల్లో పెట్టిన ఎఫ్‌డిఐ పెట్టుబడుల సంచయనం మొత్తం 90.63 బిలియన్ అమెరికన్ డాలర్లు అయ్యింది.

చైనాలో ప్రభుత్వ నియంత్రణలో బ్యాంకింగ్ వ్యవస్థ ఉండడం వల్ల ప్రపంచ సంక్షోభం నుంచి అది చాలా వరకూ పరిరక్షించబడింది. అది బలమైన స్థితిలో ఉండడం వల్ల చైనా విదేశాల్లో పెట్టుబడులు పెట్టగలిగింది. చైనా ప్రభుత్వం స్థానిక కంపెనీల ద్వారా 100 మిలియన్ డాలర్లకు లోపు విదేశాల్లో పెట్టే పెట్టుబడులను ఆమోదించే అధికారాన్ని రాష్ట్ర మరియు స్థానిక అధికార్లకు కల్పించింది. మరింత అధికంగా విదేశీ పెట్టుబడి పెట్టేలా రాష్ట్ర, స్థానిక సంస్థలను ప్రోత్సహించింది. చైనా తన భారీ పారిశ్రామిక పునాది కోసం ప్రధానంగా ఖనిజాలు, విద్యుత్తు వనరులపై ప్రధానంగా కేంద్రీకరిస్తున్నది. చైనా దీర్ఘకాల చమురు సరఫరాల కోసం రష్యా, బ్రెజిల్, వెనుజులా, కజికిస్తాన్‌లలో 46 బిలియన్ డాలర్ల పెట్టుబడులు/అప్పుల ఒప్పందాలు కుదుర్చుకున్నది. దీంతో పాటు, విద్యుత్తు వనరుల కంపెనీలలో చైనా కంపెనీలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయి. చైనా కంగ్లామరేట్లకు[25] ప్రపంచ స్థాయిలో పోటీపడగలిగే విధంగా, పునర్వ్యవస్థీకరణ వెల్లువ ద్వారా పరిశ్రమల్ని బలోపేతం చేసేందుకు, అభివృద్ధి చేసేందుకు టెక్నాలజీని, బాండ్లను, మార్కెటింగ్ నెట్ వర్క్‌లను సృష్టించడం లేదా కొనడం అనివార్యమయ్యింది.

ప్రపంచ కార్పొరేట్ రంగంలో చైనాకు ఉన్నత స్థానాన్ని కల్పించేందుకు అడ్డదారిగా బహుళజాతి కంపెనీల్లో పోర్ట్‌ఫోలియో పెట్టుబడి[26] పెట్టడం లేదా షేర్లను కొనడం ఉండింది. 2004లో, గృహోపకరణాల తయారీ తిమింగళం టిసిఎల్ ఫ్రెంచి టెలికాం సామగ్రి, తయారీదారు అల్‌కాటెల్‌తో చైనా ఒక జాయింట్ వెంచర్‌ను కుదుర్చుకుంది. యూరప్‌లో థామ్సన్ డివిడి, టివి ఆపరేషన్లలో చైనా నియంత్రణను సంపాదించింది. 2008లో ఇటలీకి చెందిన కన్‌స్ట్రక్షన్ యంత్రాల తయారీదారు సిఐఎఫ్‌ఏను చైనాలోని జూమ్‌లియోన్ హెవీ ఇండస్ట్రీ హస్తగతం చేసుకుంది. విదేశీ పెట్టుబడుల్లో వెల్లువ వచ్చినప్పటికీ అమెరికా డాలర్ విలువ స్థిరంగా ఉ

ంటుందా లేదా అనేదాన్ని గురించి చైనా ఆందోళన పడుతున్నది. చైనా తన 1.95 ట్రిలియన్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యాన్ని చాలా వరకూ అమెరికా ట్రెజరీ బిల్లులలో, ఇతర అమెరికా కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టింది. అమెరికా భారీ మొత్తంలో ప్రోత్సాహక (stimulus) ప్యాకేజీలను విడుదల చేసిన నేపథ్యంలో డాలర్ విలువ హఠాత్తుగా పడిపోవడానికి దారితీసే అవకాశం ఉన్నందున, చైనా నాయకులు తమ ఆస్తుల భద్రత, విలువ గురించి బాగా ఆందోళన చెందుతున్నారు. 2007లో ప్రధానంగా ప్రపంచ ద్రవ్య సంస్థలలో, బహుళజాతి కార్పొరేషన్లలో పెట్టుబడులు పెట్టడం కోసమే 200 బిలియన్ డాలర్ల చైనా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్‌ను చైనా స్థాపించింది. అది తన చిరవాంఛిత సిల్క్ రోడ్, బెల్ట్ ప్రాజెక్టులకు పెట్టుబడులు సమకూర్చుకునేందుకూ, ఆసియా, ఆఫ్రికాలో తన పట్టును బిగించి ఆధిపత్యం నెలకొల్పుకునేందుకూ ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు[27]ను ఏర్పాటు చేసింది.

చైనా వద్ద ఉన్న భారీ ద్రవ్య నిల్వలు దాని ఆర్థిక, రాజకీయ ప్రభావాన్ని విస్తరింపజేసేందుకు తోడ్పడుతున్నాయి. దీన్ని చూసి అమెరికా, పాశ్చాత్య సామ్రాజ్యవాదులు ఆందోళనకు గురి అవుతున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అప్పులు ఇచ్చి పుచ్చుకునే క్రమంలో ప్రపంచంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న అనేక దేశాలకు పెట్టుబడి, అప్పులు, సహాయాన్ని అందించే వనరులలో చైనా ఒకటిగా ఉన్నది. ఉదాహరణకు జమైకా సాంప్రదాయక మిత్ర దేశాలైన అమెరికా, బ్రిటన్‌లు ద్రవ్య సంక్షోభాలలో కొట్టుమిట్టాడుతుండగా, చైనా ఆ దేశాన్ని 'రక్షించేందుకు' 138 మిలియన్ డాలర్లతో ముందుకు వచ్చింది. రష్యా, కజిక్‌స్తాన్‌లకు పెద్ద మొత్తాల్లో చైనా అప్పులు ఇచ్చింది. ప్రపంచ ద్రవ్య సంక్షోభపు ప్రభావాన్ని అధిగమించేందుకు ఆగ్నేయాసియాకు తోడ్పడడం కోసం 2010లో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడి సహకార నిధిని, 15 బిలియన్ డాలర్ల అప్పును ఆసియాన్ (ఆగ్నేసియా దేశాల) కూటమి కోసం చైనా ప్రకటించింది. అమెరికా, జపాన్లతో బలమైన సంబంధాలు కలిగి ఉన్న థాయిలాండ్, మలేషియా, ఫిలిప్పైన్స్ వంటి దేశాలు ప్రస్తుతం చైనా వైపు చూస్తున్నాయి. ఈ విధంగా సామ్రాజ్యవాదం అత్యధిక జాతులపైనా, దేశాలపైనా అమలు చేసే దోపిడీ పీడనలకు బలమైన పునాది పెట్టుబడి ఎగుమతేననీ, అంతేకాక, కొన్ని సంపన్న దేశాల పరాన్నభుక్కు పెట్టుబడిదారీ విధానానికి దృఢమైన పునాది కూడా పెట్టుబడి ఎగుమతేననీ మనకు తేటతెల్లమవుతున్నది.

**నయా వలసవాద తరహా దోపిడీకై ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలకు చైనా భారీగా పెట్టుబడి ఎగుమతి చేస్తున్నది :**

చైనా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల ప్రాకృతిక వనరులను ఎలా విస్తృతంగా దోచుకుంటున్నది, ఆ దేశాలలో ఈ దోపిడీ సాధారణ ధోరణి ఎలా ఉన్నదీ తెలుసుకోవడానికి కొన్ని దేశాల ఉదాహరణలను చూద్దాం.

ప్రపంచంలో అత్యంత పేద, వెనుకబడ్డ దేశాల్లో లావోస్ ఒకటి. ఇది చైనాలోని యునాన్ ప్రాంతానికి దక్షిణాన ఉన్నది. అమెరికా ఇండో–చైనా దేశాల దురాక్రమణ యుద్ధ సమయంలో లావోస్ నాశనం అయ్యింది. లావోస్ ఇప్పుడు చైనా పెట్టుబడి, దోపిడీల వల్ల నూతన రకపు వినాశనాన్ని ఎదుర్కొంటున్నది. లావోస్ దేశ కలప, ఖనిజ సంపదలను పథకం ప్రకారం చైనా దోచుకుంటున్నది. పెద్దెత్తున వివిధ జాతుల ప్రజలు తమ భూములను విడిచిపెట్టి లావోస్ రాజధాని వియెన్‌టియాన్ వంటి కొన్ని నగరాలలో పట్టణ మురికివాడల్లో నివసించాల్సి వస్తున్నది. రబ్బరు తోటలలో ఒక పెద్ద భాగం చైనా యాజమాన్యం కింద ఉన్నాయి. లావోస్ నుంచి దుంగలు, రబ్బరు, ఆహార పంటలు, ఖనిజాలు మొదలైన సరుకులు తీసుకుపోవడం కోసం చైనా యూనాన్‌లో కున్‌మింగ్ నుంచి వియన్‌టియాన్ వరకూ 7.2 బిలియన్ డాలర్ల ఖర్చుతో రైలు మార్గాన్ని నిర్మిస్తున్నది. ఇందులో దాదాపు 50 వేలమంది కార్మికులు పని చేస్తున్నారు. ఆగ్నేయాసియాలో తన కార్యక్రమాలను నిర్వహించుకోవడం కోసం చైనాకు ఈ మార్గం ముఖ్యమైనది. ఈ మార్గాన్ని వియన్‌టియాన్ నుంచి ముఖ్యమైన వ్యాపార కేంద్రమైన బాంకాక్‌కు కలుపుతున్నది. ఆ తర్వాత దీనిని మ్యాన్మార్‌లోని రంగూన్‌కు విస్తరింపజేస్తున్నారు. లావోస్‌లో చైనా అనేక ప్రత్యేక ఆర్థిక మండళ్లు నిర్వహిస్తున్నది. అనేక ప్రాజెక్టులు నిర్మిస్తున్నది. క్రమంగా లావోస్ చైనాకు ఒక రాష్ట్రంగా లేక సామంత రాజ్యంగా మారిపోతున్నది.

**దక్షిణ ఆసియా–చైనా ప్రభావం :**

చైనా పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, శ్రీలంక, నేపాల్‌లలోకి విస్తరించడం వెనుక దాని సామ్రాజ్యవాద ప్రయోజనాల్ని, దాని ప్రభావాన్ని అర్థం చేసుకోవడం కీలకమైంది.

**పాకిస్తాన్ :** చైనాకు ప్రస్తుతం పాకిస్తాన్ దృఢమైన, విశ్వసనీయమైన మిత్ర దేశం. చైనా దశాబ్దాలుగా పాకిస్తాన్‌కు న్యూక్లియర్ టెక్నాలజీ బదిలీతో సహా విస్తృత సైనిక, ఆర్థిక సహాయాన్ని, అంతర్జాతీయ వ్యవహారాలలో దౌత్యపరమైన మద్దతు అందిస్తున్నది. పాకిస్తాన్‌లో చైనా కార్యకలాపాల లక్ష్యం ఏమంటే గల్ఫ్, ఆఫ్రికాల వరకూ వాణిజ్య, ఇంధన వనరుల మార్గాన్ని సృష్టించడం. పాకిస్తాన్‌కు చైనా అందించే మద్దతు భారత్‌తోనే కాక, అమెరికాతో కూడా దానికి గల వ్యూహాత్మక పోటీ నుంచే రూపుదిద్దుకున్నది. అమెరికా–భారత్ న్యూక్లియర్ ఒప్పందానికి ప్రత్యక్ష ప్రతిస్పందనగా చైనా రెండు నూతన న్యూక్లియర్ రియాక్టర్లను పాకిస్తాన్‌కు సప్లై చేసింది. చైనా పాకిస్తాన్‌కు గణనీయంగా కౌంటర్–ఇన్‌సర్జెన్సీ సహాయాన్ని అందించింది. చైనా పాకిస్తాన్ వ్యాప్తంగా భారీయెత్తున పెట్టుబడులు పెట్టింది. రెండు దేశాల మధ్య వ్యాపారం గత దశాబ్ద కాలంలో వేగంగా పెరిగింది. పాకిస్తాన్‌లో ఆర్థిక వృద్ధి స్తంభించిపోవడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) రాక తగ్గిపోవడం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, తీవ్ర దోపిడీ మూలంగా లోతైన ఆర్థిక సంక్షోభం నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు చైనా పెట్టుబడి మరింత అవశ్యమైనది.

ఈ నేపథ్యంలోనే చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సిపిఈసి)ని 2030 నాటి కల్లా పూర్తి చేసే లక్ష్యంతో 3 లక్షల 30 వేల కోట్ల రూపాయల (50 బిలియన్ డాలర్ల) పెట్టుబడితో చైనా నిర్మాణం చేస్తోంది. ఈ కారిడార్ పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో గ్వాదర్ ఓడరేవును చైనాలోని జింగ్ జియాంగ్ రాష్ట్రంలోని కష్గర్‌ను కలుపుతూ ఇంధన వనరుల మార్గంగా, నావికా స్థావరంగా చైనాకు వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగినదిగా ఉంటుంది. ఇందులో భాగంగా చైనా భారీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులపై పెట్టుబడులు పెడుతోంది. సుమారు మూడు వేల కిలోమీటర్ల పొడవునా రోడ్లు, రైల్వేలు, పైప్‌లైన్లు నిర్మాణమవుతున్నాయి. ఇందులో భాగమే జింగ్ జియాంగ్‌ను పాకిస్తాన్‌తో కలిపే కారాకోరం హైవేను అప్‌గ్రేడ్ చేయడం. దీనికి రైలు మార్గాన్ని జోడించే పథకం ఉన్నది. సిపిఈసి ప్రాజెక్టులో భాగంగా పాక్‌లోని గ్వాదర్ పోర్టును చైనా 40 యేళ్ల పాటు వినియోగించుకునే హక్కును కలిగి ఉంటుంది.

హిందూ మహా సముద్రాన్ని దాటాలంటే చైనా మలాకా జలసంధి[28]పై ఆధారపడుతున్నది. దీంతో చాలా కాలంగా ఇరుగు పొరుగు దేశాలతో చైనాకు వివాదాలు చెలరేగుతున్నాయి. వీటితో అది ఆసియా, పసిఫిక్ దేశాల్లో ఒంటిరైపోతున్నది. ఈ ప్రాంతంపై అమెరికా ఆధిపత్యాన్ని కలిగి ఉంటున్నది. దీనికి పరిష్కారంగా పాకిస్తాన్ మద్దతుతో తన వ్యాపార దిగుమతి, ఎగుమతులను వ్యూహాత్మక ప్రాధాన్యత ఉన్న గ్వాదర్ పోర్టు ద్వారా నిర్వహించే లక్ష్యంతో సిపిఈసి ఉనికిలోకి వచ్చింది. ఈ క్రమంలో చైనా సిపిఈసి ప్రాజెక్టు నిర్మాణానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని పాకిస్తాన్‌కు అందిస్తూ, దానితో దీర్ఘకాలిక సంబంధాన్ని దృఢతరం చేసుకునేందుకు, ఈ రుణాన్ని డాలర్ల రూపంలో దశాబ్దాల తరబడి తీర్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నది. చైనా నుంచి పాకిస్తాన్ తీసుకున్న ఈ అప్పు స్థానిక ప్రజలకేమీ ఉపయోగపడదు కానీ పాక్ ప్రజలందరూ ఈ అప్పు భారాన్ని మోయాల్సి ఉంటుంది. కనీసం ఉద్యోగాలు కూడా పాక్ ప్రజలకు దక్కవు. అయితే పాక్‌లోని పంజాబ్, రావల్పిండిలోని రాజకీయ నాయకులకు పెద్దెత్తున ముడుపులు అందిస్తూ చైనా వారిని అవినీతిలో ముంచెత్తుతోంది. అంతేకాక ఈ ప్రాజెక్టులో పనిచేసే చైనా అధికారులు, నిపుణుల రక్షణ పేరుతో 15 వేల మంది చైనా సైనికులను దింపుతున్నది. దీంతో ఈ ప్రాంతంపై చైనాకు రాజకీయంగా, ఆర్థికంగా, వ్యూహాత్మకంగా పట్టు ఏర్పడనున్నది.

హిందూ మహా సముద్రంలో భారత ఆధిపత్యాన్ని నిలువరించే ప్రయత్నం చైనా చేస్తున్నది. అక్కడ చైనా ఉనికి భారత్ ఆందోళనను పెంచుతున్నది. ఈ రవాణా మార్గాలు కశ్మీర్ ప్రాంతం (పిఓకె)లోని గిల్‌గిట్ బల్టిస్తాన్ గుండా వెళ్లడం, ప్రజా విముక్తి సైన్యాన్ని (పిఎల్‌ఏ) హిందూ మహా సముద్రంలోకి రవాణా చేసే అవకాశం ఉండడంతో భారత్ ఆందోళన చెందుతున్నది. కశ్మీరు విషయంలో 1963 నుంచి అవలంబిస్తున్న తటస్థ వైఖరిని ప్రస్తుతం చైనా విడనాడనున్నది. మరోవైపు భారత్, అమెరికాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక మైత్రి రష్యాకు కూడా

రుచించకపోవడంతో రష్యా యురేసియన్ ఎకనామిక్ ప్రాజెక్టును సిపిఈసితో ఏకం చేస్తున్నది. అది పాక్‌తో సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నది. ఈ నేపథ్యంలో, దీనికి ప్రత్యామ్నాయంగా భారత్ గ్వాదర్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఇరాన్‌లో ఉన్న చాబాహర్ పోర్టు అభివృద్ధికి 500 మిలియన్ల అమెరికన్ డాలర్లను ఖర్చు చేస్తోంది.

ఇది ఇలా ఉండగా సిపిఈసి ప్రాజెక్టుతో అరేబియా సముద్ర తీర ప్రాంతంపై కూడా చైనా ఆధిపత్యం పెరుగుతుంది. పర్షియన్ గల్ఫ్‌పై చైనా పట్టు పెరగడంతో పాటు దానికి హర్మూజ్ జలసంధి[29] కూడా 600 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దక్షిణ చైనా సముద్రానికి, ఉత్తర హిందూ మహా సముద్రానికి మధ్య గల మలాకా జలసంధి గుండా, శ్రీలంక పక్క నుంచి, అరేబియా సముద్రం మీదుగా పర్షియన్ గల్ఫ్‌కు వెళ్లేందుకు చైనా ఉపయోగించే పాత సముద్ర మార్గానికి 12 వేల కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. దీంతో అది చమురును చౌకగా, ఇష్టానుసారంగా మధ్య ఆసియా, ఆఫ్రికా దేశాల నుంచి దిగుమతి చేసుకునే అవకాశాలు పెరుగుతాయి. నిజానికి ఈ ప్రాంతం నుంచే ప్రపంచంలో అత్యధిక శాతం చమురు సరఫరా అవుతున్నది. ఈ ప్రాజెక్టు పూర్తయితే చైనాకు 60 దేశాలతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడతాయి. ఈ క్రమంలో ఇతర దేశాల రాకపోకలను, చమురు సరఫరాలను చైనా నియంత్రించే అవకాశం ఏర్పడుతుంది. దీంతో చైనా నుంచి పోటీ పెరుగుతుండడంతో ప్రత్యర్థి సామ్రాజ్యవాద దేశాల్లో అసహనం పెరుగుతున్నది. సిపిఈసి ప్రాజెక్టు వాటికి మింగుడుపడడం లేదు. అయితే ఇంగ్లండ్ సిపిఈసి ప్రాజెక్టులో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతోంది.

మరోవైపు సిపిఈసి ప్రాజెక్టు వల్ల బలూచిస్తాన్, సింధ్ ప్రాంత ప్రజలు పెద్దెత్తున నిర్వాసితులవుతున్నారు. వారికి నష్టపరిహారం చెల్లించేందుకు పాకిస్తాన్ సుముఖంగా లేదు. చైనా కూడా ఈ నిర్వాసిత సమస్యను పట్టించుకోవడం లేదు. ఈ విధంగా సిపిఈసి ప్రాజెక్టు బలూచ్, సింధూ ప్రజల జీవన్మరణ సమస్య అయ్యింది. ఇది ఇలా ఉండగా, పాకిస్తాన్‌లోకి చైనా సరుకుల వెల్లువతో స్థానిక చిన్న, మధ్య తరహా ఉత్పత్తిదారులు, చేతి వృత్తిదారులంతా తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడుతున్నారు. మొత్తంగా చూస్తే... చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ ప్రాజెక్టు గతంలో అమెరికా మార్షల్ ప్లాన్‌ను తలపిస్తున్నది. అంతిమంగా, అది పాకిస్తాన్ స్వారభౌమాధికారానికి కూడా ప్రమాదకరమైనది.

**ఆఫ్ఘనిస్తాన్ :** ఆఫ్ఘనిస్తాన్‌లో నాటో ఉపసంహరణ జరుగుతుండగా, అక్కడ తన ఆర్థిక, రాజకీయ, భద్రతా కార్యకలాపాలను చైనా వేగవంతం చేసింది. ఇటీవలి సంవత్సరాల్లో ఆఫ్ఘనిస్తాన్‌లో చైనా కొన్ని ప్రధాన ఆర్థిక ప్రాజెక్టులను ప్రారంభించింది. ఇందులో అన్‌యక్ రాగి గనులు, ఆఫ్ఘనిస్తాన్ చమురు-గ్యాసు నిల్వల అభివృద్ధి ఉన్నాయి. 2014 తర్వాత పాశ్చాత్య దేశాల సహాయం-పెట్టుబడి తగ్గగా, ప్రస్తుతం చైనా ఆఫ్ఘనిస్తాన్‌లో అతి పెద్ద విదేశీ పెట్టుబడిదారు అయ్యింది. చైనా ఆఫ్ఘనిస్తాన్‌లో తన రాజకీయ, భద్రతా సంబంధాన్ని మెరుగుపర్చుకుంటున్నది.

2012 జూన్‌లో చైనా, ఆఫ్ఘనిస్తాన్ తమ సంబంధాన్ని వ్యూహాత్మక, సహకార భాగస్వామ్య స్థాయికి అభివృద్ధి చేసుకున్నాయి. చైనా కేవలం ప్రభుత్వంతో సంబంధాలను బలోపేతం చేసుకోవడమే కాక, ఆఫ్ఘన్ తాలిబాన్‌తో కూడా తన సంబంధాలను పెంచుకుంటున్నది. సెక్యూరిటీ భాగస్వామ్యంతో, ఇటీవల ఆమోదించిన ఒప్పందాల ప్రకారం, భద్రతా ఇంటలిజెన్స్‌ను ఇచ్చిపుచ్చుకోవడం, కౌంటర్-ఇన్‌సర్జెన్సీలో సహకారం, ఆఫ్ఘన్ భద్రతా బలగాలకు మరింత ట్రైనింగ్ మొదలైనవి ఉన్నాయి. షాంఘై కార్పొరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఓ) ఆఫ్ఘనిస్తాన్ సమస్యలపై 2002 నుంచి క్రియాశీలంగా ఉంది. 2012లో ఆఫ్ఘనిస్తాన్‌ను ఒక అబ్జర్వర్‌గా అది చేర్చుకుంది. చైనా, రష్యాలు రెండూ ఆఫ్ఘనిస్తాన్‌లో ఎస్‌సిఓ పాత్ర ఎక్కువగా ఉండాలని భావిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, చైనా వ్యూహాత్మకమైన ఆఫ్ఘనిస్తాన్‌ను తన ఆధిపత్యంలోకి తెచ్చుకునేందుకు రాజకీయంగా, ఆర్థికంగా, సైనికంగా తన పావులను కదుపుతోంది.

**శ్రీలంక :** చైనా, శ్రీలంకల మధ్య మంచి సంబంధాలే ఉన్నప్పటికీ, 2005లో అధ్యక్షుడు రాజపక్షే అధికారంలోకి వచ్చినప్పటి నుంచే సంబంధాలు గణనీయంగా బలపడ్డాయి. నేడు చైనా శ్రీలంకకు అతి పెద్ద ఫైనాన్సియర్, డిఫెన్స్ సప్లయిర్. శ్రీలంక హిందూ మహా సముద్రంలో ఉండడం వల్ల అది చైనాకు ముఖ్యమైనది. ఎందుకంటే, చైనా దిగుమతి చేసుకునే 90 శాతం ఇంధన వనరులు శ్రీలంక పక్కనున్న సముద్ర మార్గాల గుండానే వెళుతుంటాయి. ఈ కారణం రీత్యా చైనా శ్రీలంకతో బలమైన రాజకీయ భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నది. శ్రీలంక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి, ఓడరేవు సౌకర్యాలతో సహా చైనా ఫైనాన్స్ అందిస్తున్నది. చైనా దక్షిణాసియాలో భారత్ ఆధిపత్యాన్ని దెబ్బతీసేందుకు కూడా ఈ సంబంధాన్ని కొనసాగిస్తున్నది.

చైనా పేరుకు నాన్-ఇంటర్‌ఫియరెన్స్ విధానాన్ని[30] వల్లిస్తూ ఆచరణలో తన ప్రపంచాధిపత్య వ్యూహంలో భాగంగా వెనుకబపడిన దేశాల్లోని అభివృద్ధి నిరోధక, ప్రతీఘాతుక పాలకవర్గాల విధానాలకు దన్నుగా నిలుస్తోంది. అందులో భాగంగానే కొలంబోకి చెందిన అన్ని ప్రతీఘాతుక పాలసీలను చైనా సమర్థించింది. శ్రీలంక రాజపక్షే ప్రతీఘాతుక ప్రభుత్వం తమిళ జాతి విముక్తి పోరాటం (ఎల్‌టిటిఇ)తో సాగించిన యుద్ధానికి చైనా అన్ని రకాల మద్దత్తును ఇచ్చింది. ఎల్‌టిటిఇ పోరాటాన్ని రక్తసిక్తం చేసింది. ఈ తెల్ల బీభత్సంలో వేలాది మంది తమిళ జాతి ప్రజలను, పసిపిల్లలను, పోరాటకారులను నిర్దాక్షిణ్యంగా చంపేశారు. శ్రీలంకలో యుద్ధ నేరాలపై విచారణ జరిపే ఐక్యరాజ్య సమితి పథకాలకు పదే పదే చైనా అభ్యంతరాలు తెలిపింది. ఆ యుద్ధం కోసం ఆయుధాలను అందించడంలో చైనా ముఖ్యమైన పాత్రను పోషించింది. యుద్ధం ముగిసినప్పటికీ శ్రీలంక సాయుధ బలగాలకు ట్రైనింగ్, నిధులు సమకూర్చడం చైనా కొనసాగిస్తున్నది. సంయుక్త చర్యలకు పథకాలు కొనసాగుతున్నాయి.

2009 నుంచి శ్రీలంకతో చైనా ప్రధాన కార్యకలాపాలు అతి పెద్ద ఫైనాన్సియర్‌గా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల కోసం భారీ అప్పులు అందించడంగా ఉన్నాయి. యుద్ధంలో శ్రీలంక

ఆర్థికంగా ఏకాకి కావడం అనే సమస్యను అది నేర్పుతో అధిగమించేలా చైనా తోడ్పడింది. చైనా నిధులు అందించబడే అత్యధిక ప్రాజెక్టులు దక్షిణ, మధ్య శ్రీలంకలో ఉన్నాయి. భూమి సంబంధిత విషయాలపై ప్రజలు పోరాడుతున్నారు. అమెరికా శ్రీలంకను వదులుకునేందుకే సిద్ధపడింది. యుద్ధ నేరాలకు బాధ్యతపడకుండా, మానవహక్కుల పట్ల గౌరవం లేకుండా, తమిళుల కోసం ఒక రాజకీయ పరిష్కారం లేకుండా శ్రీలంకలో అగాధం అలాగే ఉండిపోవడానికి ప్రధాన కారణం ఆ దేశంతో చైనాకు గల సామ్రాజ్యవాద ప్రయోజనాలే.

**నేపాల్ :** చైనా, భారత్ మధ్య నేపాల్ ఉండడం వల్ల అది ఆ రెండు దేశాలకూ వ్యూహాత్మకంగా ముఖ్యమైనది. నేపాల్ చైనాతో మంచి సంబంధాలు కొనసాగిస్తూనే అది ఎల్లప్పుడూ భారత్‌కు సన్నిహిత మిత్ర దేశంగా ఉంది. 2008లో రాచరికం రద్దు అయినప్పటి నుంచి చైనాతో సంబంధాలు పెరిగాయి. నేపాల్‌లో చైనా ప్రధాన ప్రయోజనాలు–టిబెట్ శరణార్థుల రాజకీయ కార్యకలాపాలను నేపాల్ ప్రభుత్వం అణచివేసేలా చూడడం, సరిహద్దు పొడవునా చైనా భద్రతా (పిఎల్ఏ) బలగాలతో సహకరించేలా చూడడం, దక్షిణాసియాలో తన ప్రభావాన్ని పెంచుకోవడం, నేపాల్ గుండా నూతన వ్యాపార మార్గాలను తెరవడం. విస్తరిస్తున్న చైనా, పరిరక్షించుకుంటున్న భారత్‌ల మధ్య నేపాల్ దేశ పరిస్థితి ఇలా ఉంది :

2008 నుంచి చైనా నాటకీయంగా నేపాల్‌లో తన రాజకీయ, ఆర్థిక భద్రతా కార్యకలాపాలను తీవ్రతరం చేసింది. 2012లో చైనా ప్రధాన మంత్రి దశాబ్ద కాలంలో మొదటిసారిగా నేపాల్‌ను సందర్శించాడు. పెద్ద మొత్తంలో చైనా సహాయాన్ని పెంచుతున్నట్లు ప్రకటించాడు. చైనా ఖాట్మాండులో తన దౌత్య సైనిక ప్రతినిధి వర్గాలను విస్తరించి ప్రజల రాకపోకల్ని, నేపాల్ వ్యాప్తంగా చైనా అధ్యయన కేంద్రాలను నిర్మించడాన్ని ప్రోత్సహిస్తున్నది. ఈ విధంగా నేపాల్‌లో పెరుగుతున్న చైనా ప్రభావం భారత్‌కు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. నేపాల్‌లో 2011లో ఏర్పడిన పెట్రోల్ కొరత, పెరుగుతున్న చైనా కార్యకలాపాలకు జవాబుగా భారత్ సృష్టించినదే. ప్రతిఘటనా చర్యల ద్వారా దాన్ని పరిమితం చేయాలని భారత్ భావిస్తున్నది. నేపాల్ సైన్యం సాంప్రదాయకంగా భారత సైన్యంతో సన్నిహిత మైత్రిని కలిగి ఉన్నప్పటికీ, అది చైనా ప్రజా విముక్తి సైన్యం (పిఎల్ఏ)తో సంబంధాలను విస్తరిస్తోంది. రెండు సైన్యాలూ సంయుక్త రిహార్సల్స్ నిర్వహిస్తున్నాయి. చైనా, ప్రతిఘాతుక నేపాల్ సైన్యానికి అందించే సైనిక సహాయంలో సామగ్రి, ట్రైనింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎక్స్ఛేంజ్‌లు ఉన్నాయి.

నేపాల్‌లో చైనా కార్యకలాపాలు అత్యధికంగా ఆర్థిక రంగంలో ఉన్నాయి. నేపాల్‌కు 'సహాయాన్ని' అందించే ఐదు దేశాలలో చైనా ఒకటి. ప్రజాయుద్ధం ముగిసినప్పటి నుంచి అది నేపాల్‌లో తన వ్యాపారాన్ని, పెట్టుబడులను గణీయంగా పెంచేసింది. నేపాల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం చైనా భారీ అప్పులను అందిస్తున్నది. నేపాల్‌లో చైనా పెట్టుబడులు చైనా–భారత్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరగడానికి దోహదం చేస్తున్నాయి. ఉదాహరణకు, 2008లో

టిబెట్ నుంచి నేపాల్‌కు ఒక రైలు మార్గాన్ని నిర్మించే పథకంపై ఒప్పందం కుదిరింది. ఈ రైలు మార్గం నేపాల్ ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనాన్ని కల్పించే అవకాశం ఉన్నప్పటికీ, దీని పట్ల భారతదేశం తీవ్రంగా ఆందోళన చెందుతున్నది. ఇది భారత్ ఓడరేవులపై, భారత ఇంధన వనరులపై నేపాల్ ఆధారపడడాన్ని తగ్గించడమే కాక, చైనా సరుకులు దక్షిణాసియాలోకి ప్రవేశించడానికి నూతన రాజమార్గాన్ని కల్పిస్తుంది. దీన్ని మించిన భారత్ భయం ఈ రైలు మార్గం తన సరిహద్దుల వరకూ చైనా పిఎల్‌ఏ వేగంగా రావడానికి అవకాశాన్ని కల్పించడం.

**ఆఫ్రికాలో చైనా సామ్రాజ్యవాద ప్రభావం :**

అమెరికా, యూరప్, జపాన్‌లు నిర్లక్ష్యం చేసిన ఆఫ్రికా మహా ఖండాన్ని చైనా టార్గెట్ చేసుకుంది. ఇక్కడ చమురు, ఇనుము, రాగి, బంగారం వంటి ఖనిజాల అపారమైన నిల్వలు ఉన్నాయి. ప్రపంచంలోని యావత్తు ఖనిజ నిల్వలలో 30 శాతం ఆఫ్రికా ఖండంలోనే ఉన్నాయి. ప్రపంచ బాక్సైట్‌లో 42 శాతం, యురేనియంలో 38 శాతం, బంగారంలో 42 శాతం, కోబాల్ట్‌లో 55 శాతం, క్రోమైన్‌లో 44 శాతం, మాంగనీసులో 82 శాతం, వనాడియమ్‌లో 95 శాతం, ప్లాటినంలో 73 శాతం నిల్వలు ఉన్నాయి. ఇక్కడ నుంచి అనేక ముఖ్యమైన ఖనిజాలను దిగుమతి చేసుకోవడంలో చైనా ప్రపంచంలో అగ్ర స్థానంలో ఉన్నది. ఈ విధంగా అది ఇక్కడ నయా వలసవాద తరహా తీవ్ర దోపిడీని కొనసాగిస్తున్నది. ఒకప్పుడు ఆఫ్రికాలో పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలు చేసిన పనిని ఇప్పుడు చైనా సోషల్ సామ్రాజ్యవాదులు చేస్తున్నారు. ఆఫ్రికాలో అనేక ప్రాంతాలలో చైనా ఆర్థిక ఆధిపత్యం వేగంగా పెరుగుతున్నది. చైనా-ఆఫ్రికా మధ్య వాణిజ్యం 2000 సంవత్సరం నుంచి ఆరు రెట్లు పెరిగి 30 బిలియన్ పౌండ్ల[31]కు చేరుకుంది.

ప్రస్తుతం చైనా సుమారు 1/3వ వంతు చమురును ఆఫ్రికా నుంచి ప్రధానంగా అంగోలా, సూడాన్‌ల నుంచి కొనుగోలు చేస్తున్నది. చైనా 800 మిలియన్ పౌండ్ల విలువ చేసే ఒక కొత్త చమురు క్షేత్రాన్ని సూడాన్‌లో తెరుస్తున్నది. సూడాన్‌లో 900 మైళ్ల పొడవైన పైప్ లైన్‌ను చైనా నిర్మాణం చేసింది. దీని కోసం 8 బిలియన్ పౌండ్లను పెట్టుబడిగా పెట్టింది. నైజీరియా సముద్రంలో ఒక నూతన చమురు క్షేత్రం స్థాపించేందుకు 1.2 బిలియన్ పౌండ్లను చైనా ఖర్చు చేస్తోంది. కాంగోలో చైనా చమురు, మైనింగ్ రంగాలలో వ్యూహాత్మక భాగస్వామి అయ్యింది. అదే సమయంలో జాంబియాలో గనులను, లెసోతోలో వస్త్ర కర్మాగారాలను, ఉగాండాలో రైల్వేలను, మధ్య ఆఫ్రికా రిపబ్లిక్‌లో కలప, ప్రతి దేశ రాజధానిలో రీటైల్ వర్తక అభివృద్ధి పథకాలను చైనా సంపాదించుకుంది. చైనా సామ్రాజ్యవాద ప్రయోజనాలు నిలబడాలంటే తప్పనిసరిగా మరిన్ని ముడి పదార్థాల కోసం, ఉత్పాదక సరుకుల కోసం నూతన మార్కెట్లను చూసుకోవాల్సి ఉంటుంది. చైనా చమురు వినియోగం ప్రతి సంవత్సరం కనీసం 10 శాతం పెరిగే అవకాశం ఉంది. ఈ స్థాయి డిమాండ్‌ను బట్టి తన దేశ చమురు నిల్వలు 20 సంవత్సరాల లోపు

అంతరించిపోతాయి. అందుకే విదేశీ చమురు కోసం ఈ అన్వేషణ. ఇప్పటికే ప్రపంచ అతి పెద్ద చమురు నిల్వలు అమెరికా, పాశ్చాత్య దేశాల అధీనంలో ఉన్నాయి. సౌదీ అరేబియా, ఇరాక్‌ల వద్దనే ప్రపంచ చమురు నిల్వలలో 45 శాతం ఉన్నాయి. క్రమంగా వీటికి చైనాతో సంబంధాలు పెరుగుతున్నాయి. సౌదీ అరేబియా, ఇరాన్, ఒమన్‌ల తర్వాత చైనాకు సూడాన్ 4వ చమురు సప్లైదారు.

ఆఫ్రికాలో మూడు చైనా ప్రభుత్వ చమురు కంపెనీలు - సిఎన్‌పిఎల్, చైనా జాతీయ ఆఫ్-షోర్ ఆయిల్ కార్పొరేషన్ (CNOOC) మరియు సినోపెక్‌లు పని చేస్తున్నాయి. చమురు రంగంలో చైనా కార్యకలాపాలు సూడాన్, అంగోలా, నైజీరియా, అల్జీరియా, ఈక్వటోరియల్ గ్యాని, కాంగో, గబన్‌లలో కొనసాగుతున్నాయి.

ఆఫ్రికా-చైనా సంబంధాలలో 2006 సంవత్సరం ఒక మైలు రాయి. చైనా అధ్యక్షుడు హు జిన్‌టావో, ప్రధాన మంత్రి వెన్ జియాబావోలు పది ఆఫ్రికా దేశాలను సందర్శించారు. ఇదే సంవత్సరం నవంబర్‌లో బీజింగ్‌లో జరిగిన చైనా-ఆఫ్రికా సహకార వేదిక (FOCAC) మూడవ సెషన్‌లో మొత్తం 53 ఆఫ్రికా దేశాల్లో 48 పాల్గొన్నాయి. "ఆఫ్రికాలో చైనా విధానం అనే డాక్యుమెంటు"ను చైనా ప్రచురించింది. చైనా లక్ష్యాలను వాటిని సాధించేందుకు మార్గాలను అది అందులో పేర్కొంది. 2000 సంవత్సరంలో 20 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వర్తకం 2006లో 55 బిలియన్ డాలర్లకు పెరిగింది. దీంతో అమెరికా, ఫ్రాన్స్ తర్వాత చైనా మూడవ అతి పెద్ద వాణిజ్య భాగస్వామి అయ్యింది. 2004లో చైనా 31 దేశాలకు 1.38 బిలియన్ డాలర్ల విలువ గల 156 రుణాలను అందించింది. 190 ఉత్పత్తుల దిగుమతులపై పన్నులు నామమాత్రం చేసింది. 2005 చివరి నాటికి, చైనా ఆఫ్రికాలో 720 ప్రాజెక్టులను చేపట్టింది.

ఆఫ్రికా దేశాలలో చైనా మాటల్లో సోషలిజం, చేతల్లో సామ్రాజ్యవాదాన్ని అమలు చేస్తున్నది. సోషలిస్టు విదేశీ విధానం పేరుతో ఐదు సూత్రాలను వల్లిస్తూ, కార్మిక-కర్షక, మధ్య తరగతి ప్రజలను తీవ్ర దోపిడీకి గురి చేస్తున్నది. నిజాయితీ, సమానత్వం, పరస్పర ప్రయోజనం, సంఘీభావం, ఉమ్మడి అభివృద్ధి అనే కల్లబొల్లి మాటలు, "పరస్పరం ఇచ్చి పుచ్చుకోవడం," "వైవిధ్యాన్ని గౌరవించడం," "శాంతి" అనే మాటలు ఆఫ్రికా కోసం చైనా సామ్రాజ్యవాదులు జారీ చేసే ప్రతి స్టేట్‌మెంట్‌లోనూ, డిక్లరేషన్‌లోనూ పొందుపరుస్తున్నారు. స్థానిక దోపిడీ పాలకవర్గాలకు ఈ మాటలు ఆహ్లాదకరంగా ఉంటాయి. ఈ విధంగా సోషలిస్టు ముసుగులో చైనా ఆఫ్రికా కార్మికుల్ని, రైతాంగాన్ని వంచిస్తున్నది. మార్కెట్ నుంచి ఆఫ్రికా వర్తకులను దివాలాతీయిస్తూ తరిమేస్తున్నది. చౌకగా తయారైన సరుకులను చైనా ఆఫ్రికాకు విపరీతంగా ఎగుమతి చేయడంతో ఆఫ్రికాలో పరిశ్రమలు నాశనం అయ్యాయి. చైనా సామ్రాజ్యవాదులు ఆఫ్రికా పర్యావరణాన్ని విధ్వంసం చేశారు. అఖిల ఆఫ్రికా స్వాతంత్ర్యం-ఐక్యత కోసం ప్రజల

నుంచి ముందుకు వస్తున్న డిమాండ్‌ను వికృతం చేస్తున్నారు. ఇక్కడ మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారు. ఆఫ్రికాను అవినీతిమయం చేశారు. తాగునీరు విస్తృతంగా కలుషితం కావడంతో చైనా అక్రమ గని తవ్వకాల పట్ల ఘనా వ్యవసాయ జాతుల ప్రజలలో ఆగ్రహం పెరుగుతున్నది. ఇక్కడ పదే పదే చట్టాలను చైనా ఉల్లంఘిస్తున్నది. ఈ రకంగా ఇక్కడ స్వతంత్ర, స్వావలంబన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి కాకుండా చైనా సామ్రాజ్యవాదులు నయా వలసవాద తరహా దోపిడీని తీవ్రతరం చేస్తున్నారు.

**లాటిన్ అమెరికాలోకి చైనా పెట్టుబడి :**

లాటిన్ అమెరికా అంతటా చైనా ఎఫ్‌డిఐ చాలా వేగంగా పెరుగుతున్నది. పెరూలో ఆర్థిక, పర్యావరణ, సామాజిక ప్రభావం దృష్టి నుంచి చూసినప్పుడు ఘోరమైన ఉల్లంఘనలను చేస్తూ అన్ని రకాల దోపిడీలలో చైనా మాఫియాలు విదేశీ, స్థానిక పెట్టుబడిదారీ కార్పొరేషన్లకు తీసిపోని విధంగా ఉన్నారు. చైనా, లాటిన్ అమెరికాల మధ్య 2012 నాటికి వ్యాపారం 261.2 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. చైనా–ఆఫ్రికా వ్యాపారంతో ఇది సమానం. ఆఫ్రికాలో కంటే లాటిన్ అమెరికా (బ్రెజిల్‌ను కలుపుకొని)లో చైనా పెట్టుబడి మించిపోయింది. 2005లో ప్రపంచ బ్యాంకు, ఇంటర్ అమెరికన్ డెవలప్‌మెంట్ బ్యాంకులు అందించిన దానికంటే చైనా డెవలప్‌మెంట్ బ్యాంకు, ఎక్స్‌పోర్ట్–ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ చైనాలు అందించిన ‘అభివృద్ధి’ రుణాలు ఎక్కువ. అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి కార్యకలాపాలన్నీ చైనా సామ్రాజ్యవాద ఆర్థిక ప్రయోజనాలు, లాభాల కోసమే నడుస్తున్నాయి.

లాటిన్ అమెరికాలో చైనా అనేక శక్తి (energy) వనరుల, ప్రాథమిక సదుపాయాల (infrastructure) ప్రాజెక్టులను నిర్మిస్తున్నది. అర్జెంటీనాలో శాంతాక్రజ్‌లో చైనా జెఝౌబా కార్పొరేషన్ 4.7 బిలియన్ డాలర్లతో రెండు నూతన హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులు నిర్మిస్తున్నది. చైనా కంపెనీ సైనోహైడ్రో ఈక్వడార్‌లో 2.2 బిలియన్ డాలర్ల ఖర్చుతో హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మిస్తున్నది. లాటిన్ అమెరికాలో చాలా వరకూ ముడి సరుకులను, ప్రకృతి వనరులను స్వాధీనం చేసుకోవడంలో భాగంగానే పెరూలో రాగి, బ్రెజిల్‌లో ఇనుప ఖనిజం, అర్జెంటీనాలో సోయా పంటలపై చైనా పెట్టుబడులు పెడుతున్నది. లాటిన్ అమెరికాలో 87 శాతం చైనా ఓఎఫ్‌డిఐ (ఔట్‌గోయింగ్ ఎఫ్‌డిఐ–బయటకు పోయే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి) చైనా ప్రభుత్వరంగ సంస్థలే (ఎస్‌ఓఈ) పెడుతున్నాయి. ఇప్పుడు చైనా ప్రైవేటు కార్పొరేషన్లు కూడా మరింత పెట్టుబడి ఎగుమతి చేస్తున్నాయి.

# 7. అంతర్జాతీయ ఆర్థిక, సైనిక బ్లాకుల నిర్మాణం
# వాటిపై పెరుగుతున్న చైనా సామ్రాజ్యవాదుల పట్టు

## షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఓ)

షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఓ) ఏప్రిల్ 26, 1996లో ఏర్పడింది. ఆరు దేశాలు – రష్యా, చైనా, కజఖ్‌స్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిస్తాన్, తజికిస్తాన్ పూర్తి కాలం సభ్యులుగా ఉన్నాయి. అబ్జర్వర్ దేశాలుగా ఉన్న భారత్, పాకిస్తాన్‌లకు ఈ సంవత్సరం జూన్ 2వ వారంలో జరిగిన ఎస్‌సిఓ సదస్సులో పూర్తి స్థాయి సభ్యత్వం లభించింది. రాజకీయ, ఆర్థిక, సైనిక అంశాలతో ఎస్‌సిఓ వ్యవహరిస్తుంది. చైనా, రష్యాలు పెద్దెత్తున యుద్ధ విన్యాసాలు క్రమం తప్పకుండా 2005 నుంచి చేస్తున్నాయి. వీటి ద్వారా రష్యా, చైనాలు తమ మధ్య సంబంధాలు మరింత లోతుగా పెంపొందాయనే భావాన్ని కల్పిస్తున్నాయి. మునుపటి సోవియట్ రాజ్యాలతో చేసుకున్న రక్షణ ఒప్పందంలో భాగంగా రష్యా నేతృత్వంలో ఏర్పడిన కలెక్టివ్ సెక్యూరిటీ ట్రీటీ ఆర్గనైజేషన్ (CSTO)లో ఎస్‌సిఓ భాగస్వామి కావడంతో అమెరికా నేతృత్వంలోని నాటోకు ప్రత్యామ్నాయంగా ఒక రక్షణ కూటమిగా ఎస్‌సిఓ బలపడుతున్నది.

## బ్రిక్స్

ఇటీవలి కాలంలో సామ్రాజ్యవాద దేశాలైన రష్యా, చైనాలు; ఆర్థిక శక్తిని సంతరించుకుంటున్న ముఖ్య దేశాలు – బ్రెజిల్, భారత్, దక్షిణాఫ్రికాలు కలిసి బ్రిక్స్‌గా ఏర్పడ్డాయి. ఈ దేశాల మధ్య కొన్ని వైరుధ్యాలు, ఘర్షణలు ఉన్నప్పటికీ, వాటికి వేర్వేరు ప్రయోజనాలు ఉన్నప్పటికీ, తమ మధ్య గల ఉమ్మడి ప్రయోజనాల కోసం అవి బ్రిక్స్‌ను స్థాపించాయి. వీటిలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ, అతి వేగంగా ఆర్థిక పెరుగుదల ఉన్న దేశం చైనా. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఇతర అంతర్జాతీయ సంస్థల మీద అమెరికా దాని సన్నిహిత సామ్రాజ్యవాద మిత్రదేశాలూ గుత్తాధిపత్యం వహిస్తున్నాయి. వెంటనే ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల నుంచి బ్రిక్స్ దేశాలకు ఉపసంహరించుకోవాలన్న పథకాలేవీ లేనప్పటికీ, వాటి ఆధిపత్య, అప్రజాస్వామిక ఆంక్షలకు ప్రత్యామ్నాయంగా నూతన అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ సంస్థలు నిర్మించాలని చైనాతో సహా బ్రిక్స్ దేశాలు భావిస్తున్నాయి. అలాగే ప్రపంచ బ్యాంకుకు ప్రత్యామ్నాయంగా ఒక అంతర్జాతీయ డెవలప్‌మెంట్ బ్యాంకును ఏర్పర్చాలని 2013 మార్చ్ దర్బన్ (దక్షిణాఫ్రికా) సమావేశంలో బ్రిక్స్ దేశాల నాయకులు నిర్ణయించి న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డిబి)ను 2015లో ఏర్పరచారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు నిధులను సమకూర్చడంలో ప్రపంచ బ్యాంకుతో పోటీపడుతున్నది. సభ్య దేశాలు (బిక్స్) భవిష్యత్తు ద్రవ్య సంక్షోభాలను తిప్పికొట్టడానికి 100 బిలియన్ డాలర్ల విలువైన 'కంటింజెంట్ రిజర్వ్ ఎరేంజిమెంట్' (ఆకస్మిక అవసరాలకు తోడ్పడే రిజర్వు నిధి)ను కూడా అది నెలకొల్పుతుంది.

ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకుల మీద అమెరికా ఏ రకంగా ఆధిపత్యం నెరుపుతున్నదో చైనా కూడా న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకుపై అటువంటి ఆధిపత్యం నెరపాలని కోరుకుంటున్నది. ఈ బ్యాంకుకు ప్రారంభ పథకం ప్రకారం, బ్రిక్స్ దేశాలు సమానంగా డబ్బు నిల్వలు సమకూర్చాలి. పది బిలియన్ డాలర్లుగా నిర్ణయించారు. కానీ ముందుగానే పెద్దమొత్తంలో డబ్బు పెట్టాలని చైనా భావిస్తున్నది. తర్వాత బ్యాంకుకు అనివార్యంగా అవసరమయ్యే భారీ అదనపు పెట్టుబడిని చైనానే సమకూర్చగలదు. బ్రిక్స్ దేశాలు 'అమెరికా డాలర్ మీదనూ, యూరో మీదనూ ఆధారపడడాన్ని తగ్గించుకోవాలనీ' ఈ బ్యాంకు ఏర్పడిన సమావేశంలోనే ఒప్పందం మీద సంతకాలు చేశాయి. ప్రపంచంలో అసమాన అభివృద్ధి వల్ల చైనా ఆర్థిక శక్తిగా వేగంగా పెరుగుతున్నది. దీంతో పాటే అమెరికా ఆర్థికంగా క్షీణిస్తున్నదన్నది కూడా వాస్తవం. ఆర్థిక పోటీ వేగంగా పెరుగుతున్నది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం తీవ్రతరమవుతున్న ఈ పరిస్థితుల్లో ఆర్థిక పోటీ మరింత బలంగా కొనసాగుతుంది. పెరుగుతున్న ఆర్థిక పోటీకి అనుగుణంగా, భవిష్యత్తులో సైనిక పోటీ తప్పనిసరిగా మరింత పెరుగుతుంది.

**చైనా సైనిక శక్తి**

చైనా ఆర్థిక శక్తిగానే కాక, రాజకీయంగా, సైనికంగా కూడా వృద్ధి చెందుతున్న శక్తి. 2002 నుంచి 2011 మధ్య చైనా 170 శాతం పెంచి తన రక్షణ బడ్జెట్‌ను ఖర్చు పెట్టడం ద్వారా తన సైన్యాన్ని వృద్ధి చేసింది[32]. స్టాక్ హోం ఇంటర్నేషనల్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (SIPRI) ప్రకారం, నేడు చైనా ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద సైనిక బడ్జెట్‌ను కలిగి ఉంది. దాన్ని మించి ఒక్క అమెరికా మాత్రమే సైనిక ఖర్చులు చేస్తున్నది. అలాగే అమెరికా, రష్యా, బ్రిటిన్, ఫ్రాన్స్‌ల తర్వాత ప్రపంచంలోనే 5వ అతి పెద్ద అణుశక్తి కలిగిన దేశంగా చైనా ఉంది. గత దశాబ్ద కాలంలో చైనా సైన్యం వేగంగా ఆధునీకరించబడింది. నేడు అది అఫెన్సివ్ యుద్ధాలు చేయగలిగే భారీ సైనిక సామర్థ్యాలను కలిగి ఉంది. అది ఇటీవల ఉపగ్రహాలను పడగొట్టగలనని రుజువు చేసింది. చైనా భారీ ఆయుధాల ఉత్పత్తిదారులకు పుట్టినిల్లు. SIPRI ప్రకారం, ప్రపంచ ఆయుధాల మార్కెట్‌లో ఉన్న పోటీదార్లందరిలో చైనా ఆయుధాల గుత్త సంస్థలు 5వ స్థానాన్ని ఆక్రమిస్తున్నాయి. అమెరికాతో గానీ, ఇతర సామ్రాజ్యవాద దేశాలతో పోల్చుకుంటే చైనా నిరంతరం సైనిక బలాన్ని పెంపొందించుకుంటున్నది. అమెరికాలో కంటే చైనాలో ఒక డివిజన్ సైనికులకు చెల్లించే వేతనాలు, తిండి, యిండ్లు, శిక్షణకు అయ్యే ఖర్చు చాలా తక్కువ. అలాగే అమెరికాతో పోల్చుకుంటే చైనాలో ఒక ట్యాంకు, జెట్ విమానం, మిస్సైల్ సబ్‌మెరైన్ నిర్మాణ ఖర్చు కూడా చాలా తక్కువ.

డ్రోన్ విమానాల అభివృద్ధినీ, ఉత్పత్తినీ చైనా వేగంగా విస్తరింపజేస్తున్నది. ప్రత్యర్థుల డ్రోన్‌లను చైనా ఆధునిక మిస్సైల్ వ్యవస్థలతో తేలికగా పడగొడ్తున్నారు. 2011 నాటికి చైనా వద్ద 280 ఆపరేషనల్ డ్రోన్లు ఉన్నాయి. వీటిని ఇంటెలిజెన్స్, సర్వైలెన్స్, రికన్నాయిసెన్స్ కార్యక్రమాలకూ,

ఎలక్ట్రానిక్ యుద్ధతంత్రాలలోనూ ఉపయోగిస్తున్నారు. చైనా డ్రోన్ కార్యక్రమం చాలా ఆధునికమైనది.

చైనా ఈ విధంగా పెద్దెత్తున సాయుధం కావడం వెనుక ఉన్న నేపథ్యం ఏమంటే, అది ఒక నూతన సోషల్ సామ్రాజ్యవాద శక్తిగా ఆలస్యంగా రంగంలోకి వచ్చింది. తన పొరుగునున్న ప్రాంతాలు ఇప్పటికే ఇతర సామ్రాజ్యవాద ఆధిపత్య శక్తుల ప్రభావంలో ఉన్నాయి. తన ఉత్తర, పశ్చిమ దిశల్లో రష్యా ఉంది. చైనాకు దక్షిణ, తూర్పు దిశల్లో తనకు అతి ముఖ్యమైన ముప్పుగా అమెరికా, జపాన్లు ఉన్నాయి. వీటితో పాటు ఇతర సామ్రాజ్యవాద దేశాలను ఎదుర్కోవడం ద్వారానే చైనా తన నయా వలసవాద ప్రభావిత పరిధిని వెనుకబడిన దేశాలలో సృష్టించుకోగలుగుతుంది, విస్తరించుకోగలుగుతుంది. ఈ నేపథ్యంలోనే చైనాకూ, తూర్పు చైనా, దక్షిణ చైనా సముద్రాలలో ఉన్న దాని పొరుగు దేశాలైన జపాన్, వియత్నాం, ఫిలిప్పైన్స్‌లకూ మధ్య పెరుగుతున్న ఘర్షణను అర్థం చేసుకోవాలి.

అమెరికా బడ్జెట్ లోటు, అమెరికాలోనూ, ప్రపంచంలోనూ ఆర్థిక సంక్షోభం కొనసాగుతుండడం వల్ల అమెరికా సైనిక వ్యయంలో కోతలు విధిస్తున్నారు. అలాగే పాశ్చాత్య దేశాలలో కూడా ఇలా కోతలు విధించడం జరుగుతున్నది. బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్, పోలండ్, స్పెయిన్ - యూరప్ నుంచి నాటోకు నిధులు ఇస్తూ వస్తున్న ఈ ఏడు దేశాలూ ఇప్పటికే 2009 నుంచి 10 శాతానికి పైగా తగ్గించాయి. సోవియట్ యూనియన్ సోషల్ సామ్రాజ్యవాద అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థ నాశనం కావడానికీ, పతనానికీ దారితీయడమనేది సోవియట్ యూనియన్ అగ్రరాజ్యంలో ఆయుధాల పోటీనే కాక మరణశయ్య మీద ఉన్న మొత్తం ఆర్థిక వ్యవస్థ ఇందుకు కారణం.

**చైనా సామ్రాజ్యవాద సైనిక కార్యకలాపాలు :**

ఇతర దేశాలలో చైనా ఇప్పటికే సైనికంగా అనేక రకాలుగా జోక్యం చేసుకుంటున్నది. ప్రధాన సామ్రాజ్యవాద యుద్ధాలలోకి చైనా ఇంకా దిగకపోయినా, ఇతర దేశాల అంతర్యుద్ధాలలో, ప్రజల తిరుగుబాట్లలో, జాతి విముక్తి పోరాటాలను, విప్లవ పోరాటాలను అణచివేయడంలో దళారీ స్థానిక ప్రభుత్వాలకు అది చురుకైన మద్దత్తు అందిస్తున్నది. చాడ్ దేశంలో చైనా సామ్రాజ్యవాదులకు అనుకూలంగా లేని ప్రభుత్వాన్ని కూలదోసి, అనుకూల ప్రభుత్వాన్ని ఏర్పచింది. చాడ్ రాష్ట్రపతి ఇడ్రిస్ డెబీ చమురు సప్లైల తైవాన్‌కు అనుకూల వైఖరితో ఉండేవాడు. దీంతో చైనా అతనిని కూలదోయడానికి ఆ దేశంలో అతనికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ఎఫ్‌యుసి తిరుగుబాటుకు చైనా దౌత్యపరంగా, సైనికంగా, ఆర్థికంగా మద్దతునందించింది. అతని స్థానంలో తనకు అనుకూలమైన మరో నాయకుడిని తీసుకొచ్చింది. ప్రపంచంలో అనేక సైనిక ఘర్షణలలో చైనా జోక్యం చేసుకుంటున్నది. ఉదాహరణకు, శ్రీలంకలో ఎల్‌టిటిఇపై నిర్వహించిన యుద్ధంలో దాని పాత్ర ఉంది. దక్షిణాసియాలో బలాబలాలను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు

అది వ్యూహాత్మకంగా పాకిస్తాన్‌కు అణ్వాయుధాలను అందించింది. నేపాల్, ఆఫ్ఘనిస్తాన్‌లలో ఆయా సందర్భాలలో ప్రత్యక్షంగా/పరోక్షంగా జోక్యం చేసుకుంది, చేసుకుంటున్నది. ముఖ్యంగా ఆఫ్రికాలో రాజకీయ, దౌత్య మద్దత్తు ద్వారా, సైనిక సలహా, విదేశీ దౌత్య కార్యాలయాలలో సైనిక సలహాదారులు అందించే ఆదేశాలు, అలాగే చైనాలో విదేశీ సిబ్బందికి సైనిక శిక్షణ ద్వారా జోక్యం చేసుకుంటున్నది. చాలా వరకూ తనకు అనుకూలంగా ఉన్న దేశానికి సైనిక సామగ్రి, ఆయుధాలు అమ్ముతున్నది లేదా సరఫరా చేస్తున్నది. ఈ విషయంలో ఇతర సామ్రాజ్యవాదులకూ చైనా సామ్రాజ్యవాదులకూ ఎటువంటి తేడా లేదు. ఇందులో అది ఇప్పటికే చురుకైన సామ్రాజ్యవాద దేశాలలో ఒకటిగా ఉన్నది. చైనా 2012 నాటికి మూడో అతి పెద్ద ఆయుధాల ఎగుమతిదారుగా ఉన్నది.

విదేశాల్లో తన పెట్టుబడులను పరిరక్షించుకునే, వెనుకబడిన దేశాల మీద పెత్తనం చేసే సామర్థ్యాన్ని పెంచుకుంటూ అమెరికా సైన్యాన్ని చైనా సైన్యం చాలా వేగంగా అందుకుంటున్నది. ప్రపంచమంతటా విస్తరించడం కోసం సామ్రాజ్యవాద దోపిడీ శక్తిని నిర్మించడంలో ఇప్పటి వరకూ చైనా విజయం సాధించినప్పటికీ, వియత్నాం, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో అమెరికా ఇరుక్కుపోయిన మాదిరిగా చైనా కూడా తన సామ్రాజ్యవాద స్వభావం రీత్యానే అనివార్యంగా అటువంటి సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలలో దిగబడిపోక తప్పదు.

'ఐక్యరాజ్య సమితి శాంతి పరిరక్షక బాధ్యత'లలో చేరడానికి 1990లో చైనా అంగీకరించింది. లైబీరియాకు (2005), పశ్చిమ సహారా, సియర్రా లియోన్, ఐవరీకోస్ట్, డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలలో కార్యక్రమాలకూ చైనా చిన్న సంఖ్యలో బలగాలను పంపించింది. పాకిస్తాన్ (బలూచిస్తాన్ ప్రాంతం)లోని గ్వాదర్ ఓడరేవు మరియు హిందూ మహా సముద్రంలోని జిబూతీ మిలటరీ లాజిస్టిక్స్ బేస్‌లలో అది ఇప్పటికే మోహరించిన 20 వేల నావికా సైన్యాన్ని ఒక లక్ష సంఖ్యకు పెంచాలని నిర్ణయించింది. సూడాన్, అల్జీరియా, నైజీరియా, ఈజిప్ట్‌లతో సహా కనీసం ఆరు ఆఫ్రికా దేశాలతో చైనాకు సైనిక కూటములు ఉన్నాయి. వాటికి చైనా అమ్మే ఆయుధాలను ఉపయోగించడంలో సైనిక శిక్షణను అందిస్తుంది.

## 8. చైనా సోషల్-సామ్రాజ్యవాదం

2వ ఇంటర్నేషనల్‌కు చెందిన రెనగేడ్లను ఖండిస్తూ లెనిన్ "మాటల్లో సోషలిజం, చేతల్లో అవకాశవాదం వృద్ధి సామ్రాజ్యవాదంగా మారుతుంది" అని అన్నారు. సోవియట్ రివిజనిస్టు రెనగేడ్ ముఠా కూడా రివిజనిజం నుంచి వృద్ధి చెంది సోషల్–సామ్రాజ్యవాదంగా మారింది. ఒక సోషలిస్టు రాజ్యపు రాజకీయ అధికారాన్ని రివిజనిస్టు ముఠా హస్తగతం చేసుకుంటే, అది సోవియట్ యూనియన్ లాగా సోషల్–సామ్రాజ్యవాదంగా మారుతుంది అని కామ్రేడ్ మావో చారిత్రక గుణపాఠంగా చెప్పారు.

చైనా రివిజనిస్టు రెనగేడ్ ముఠా కూడా రివిజనిజం నుంచి "చైనా తరహా సోషలిజం" పేరుతో పెట్టుబడిదారీ విధానంలోకి మళ్లింది. రివిజనిస్టు డెంగ్ మాటల్లో చెప్పాలంటే, "ఆర్థిక సంబంధాలన్నీ పెట్టుబడిదారీగా మారిపోయి, రాజకీయ సంబంధాలు మాత్రం 'సోషలిజం' పేరు తోటి, 'ప్రజల నియంతృత్వం' పేరు తోటీ ఏక–పార్టీ ఆధిపత్యం కింద ఉండాలి." ఈ ముసుగులోనే నేడు చైనా సోషల్–సామ్రాజ్యవాదంగా మారింది. సిపిసి, చైనా ప్రభుత్వం ఇప్పటికీ తమ దేశం 'సోషలిస్టు'గా ఉన్నదని మోసం చేయజూస్తున్నవి. వీళ్లు మాటల్లో, నేడు చైనా వ్యవస్థ 'చైనా లక్షణాలతో సోషలిజం' అని నమ్మబలుకుతున్నారు. "కమ్యూనిస్టు పార్టీ అధీనంలో బూర్జువా ఆర్థిక సంస్కరణలు అనేవి చైనా తరహా సోషలిజం" అని మోసపుచ్చుతున్నారు. ఇంకా వీళ్లు దీన్ని సాగలాగుతూ "2050" నాటికి సోషలిస్టు ఆధునీకరణను సాధించాలి" అంటూ చైనా తరహా సోషలిజాన్ని పునరుద్ఘాటిస్తున్నారు. అలాగే "అన్ని రంగాల్లోనూ చైనా తరహా సోషలిజాన్ని నిర్మించాలనే ఆశయాన్ని 21వ శతాబ్దంలో కూడా ముందుకు తీసుకువెళ్లండి" అని సిపిసి నాయకత్వం ఇప్పటికీ మహాసభల్లో పిలుపు ఇస్తూ ఉన్నది. 'సోషలిస్టు వ్యవస్థ', 'శ్రామికవర్గ నియంతృత్వం', 'కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం', 'మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానం' ఇలా నాలుగు విషయాలను తప్పుడుగా వక్రీకరించి, ప్రజలను ఇప్పటికీ మోసపూరితంగా సిపిసి నాయకత్వం పక్కదారి పట్టిస్తూ ఉంది. చైనాలోనూ ఇతర దేశాలలోనూ రివిజనిస్టులు మాత్రమే వాస్తవ పరిస్థితులను వక్రీకరిస్తున్నారు. వెనుకబడిన దేశాల ప్రజలను సోషలిజం పేరుతో మోసగిస్తూ, తన సోషల్–సామ్రాజ్యవాద ప్రయోజనాలను చైనా నెరవేర్చుకుంటున్నది. చైనాలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను (ఎస్ఓఈలు) చూపించి పెట్టుబడిదారీ విధానాన్ని 'సోషలిజం'గా గందరగోళపెట్టడం రివిజనిస్టులకు మామూలే.

చైనా సోషల్–సామ్రాజ్యవాదం వెనుకబడిన దేశాలకు, ఇతర దేశాలకు యుద్ధ సామగ్రిని, పెట్టుబడిని ఎగుమతి చేయడం ద్వారా, అసమాన వ్యాపారం ద్వారా, వాటి సహజ వనరులను దోచుకుంటోంది. వాటి అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ, సైనిక శిబిరాలను సంపాదించుకునేందుకు అవకాశాల కోసం చూస్తున్నది. అమెరికా సామ్రాజ్యవాదంతో పోటీ పడుతున్నది. ఈ రకంగా చైనా సోషల్–సామ్రాజ్యవాదం సామ్రాజ్యవాదానికి సంబంధించిన వలయంలోనే తిరుగుతూ ఉన్నది. ఇలా ఇది చైనీయ లక్షణాలతో సామ్రాజ్యవాదాన్ని అమలు చేస్తున్నది. 'చైనా లక్షణాలతో సామ్రాజ్యవాదం' అంటే కేవలం సామ్రాజ్యవాదమే, దానిని ప్రమాదకరమైన సామ్రాజ్యవాదంగా చూడాలి.

# 9. "సామ్రాజ్యవాద చరిత్ర సంక్షోభాలు, యుద్ధాలు, విప్లవాలు, ప్రతీఘాతుక విప్లవాల చరిత్రే" అనేది లెనిన్ నినాదం

నేడు అధికోత్పత్తికి సంబంధించిన తీవ్రమైన సంక్షోభం ప్రపంచవ్యాప్త సంక్షోభం అయినందున అది పెట్టుబడిదారీ వ్యవస్థ ఉనికినే సవాలు చేస్తున్నది. తీవ్రంగా దోపిడీకి గురవుతున్న కోట్లాది మంది కార్మికులతో కూడుకున్న పెద్ద ప్రాంతంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చైనా భాగం కావడం పెద్దెత్తున అధికోత్పత్తికి దోహదం చేస్తున్నది. ప్రతీ సామ్రాజ్యవాద శక్తి ఇతర సామ్రాజ్యవాద శక్తులతో పోటీ పడేందుకు తమ ఖర్చులను తగ్గించుకోవాలని మాత్రమే కాక తమ వేతన కార్మికుల, ప్రత్యేకించి వలస, అర్ధవలస దేశాల కార్మికుల జీవన ప్రమాణాలను తగ్గించడానికి దాడి చేయాలని చూస్తుంది. పారిశ్రామిక ఉత్పత్తి, పెట్టుబడి ఎగుమతి, సరుకుల ఎగుమతి, అంతర్జాతీయ ద్రవ్య స్థితిగతులలో సాపేక్షంగా వచ్చిన మార్పులకు అనుగుణంగా నూతన, అసమాన పరిస్థితులు ముందుకు వస్తున్నాయి, తీవ్రతరమవుతున్నాయి. సామ్రాజ్యవాద దేశాల మధ్య అసమాన ఆర్థిక, రాజకీయ అభివృద్ధి తీవ్రం కావడం, అనివార్యంగానే వాటి మధ్య మార్కెట్ల కోసం, ముడి పదార్థాల సప్లయి స్థావరాల కోసం, పెట్టుబడి ఎగుమతులకు మార్గాల కోసం ఘర్షణలు తీవ్రతరం అవుతాయి. సామ్రాజ్యవాదుల మధ్య సాగే ఈ అంతర్గత పోరాటంలో అత్యధిక లాభదాయక ఉత్పత్తి కలిగిన అత్యంత బలమైన సామ్రాజ్యవాద దేశాలు మరింత పెద్దవై బలోపేతమవుతాయి. పోటీపడలేని పెట్టుబడిదారులు/సామ్రాజ్యవాదులు బలహీనపడిపోతారు.

సామ్రాజ్యవాదుల మధ్య సాగే అంతర్గత పోరాటం ఆర్థిక శక్తికి అనుగుణంగా ప్రపంచ పునర్విభజనకు దారితీస్తున్నది. ఇది అంతిమంగా ప్రపంచ యుద్ధానికే దారితీస్తుంది. లెనిన్ దీనిని ఈ విధంగా క్రోడీకరించారు : "పెట్టుబడిదార్లు ప్రపంచాన్ని పంచుకోవడానికి కారణం ప్రత్యేకించి ఏదో హాని చేయాలనే తప్పుడు ఉద్దేశ్యం వాళ్లకు ఉండడం కాదు, లాభాలు పొందడానికి చేరిన సాంద్రీకరణ స్థాయి వాళ్ల చేత ఈ పద్ధతి చేపట్టేలా చేస్తుంది. యిక వాళ్లు పంచుకునేది "పెట్టుబడి వాటాలను బట్టి," "బలాన్ని బట్టి", యెందుకంటే, అమ్మకం సరుకుల ఉత్పత్తి వ్యవస్థలోనూ, పెట్టుబడిదారీ విధానంలోనూ మరొక పంపకపు పద్ధతి యేదీ ఉండజాలదు. కానీ, ఆర్థిక, రాజకీయ అభివృద్ధి స్థాయి మారినప్పుడు బలం మారుతుంది. యేమి జరుగుతున్నదీ అర్థం చేసుకోవడానికి, బలంలోని మార్పులతో యే సమస్యలు పరిష్కరింపబడేదీ తెలుసుకోవడం అవసరం. యీ మార్పులు "శుద్ధ" ఆర్థికమైనవా, లేక ఆర్థికేతర(ఉదాహరణకు, సైనిక)మైనవా అనే సమస్య అప్రధానమైనది; యిది పెట్టుబడిదారీ విధానంలోని ఆధునాతన యుగం గురించిన మౌలిక అభిప్రాయాలను యేమాత్రమూ మార్చజాలదు. పెట్టుబడిదారీ కూటముల (combines) మధ్య జరిగే పోరాటం ఒప్పందాల సారానికి సంబంధించిన సమస్య స్థానంలో, పోరాటం,

ఒప్పందాల పోరాట రూపానికి (యీనాడు శాంతియుతంగా, రేపు సాయుధంగా, మరుదినం మళ్లీ సాయుధంగా వుండేదానికి) సంబంధించిన సమస్యను పెట్టడం కుతర్కానికి (sophist) దిగజారడమౌతుంది." (లెనిన్ ఏరిన రచనలు, సంపుటి–3, 5. పెట్టుబడిదారీ కూటముల మధ్య ప్రపంచ విభజన అనే అంశంలో, పేజీ 223 మొదటి పేరా నుంచి).

పై లెనిన్ బోధన ప్రకారం, రోజు రోజుకూ పెరుగుతున్న తన ఆర్థిక శక్తి పునాదిపై ఆధారపడి చైనా తన ద్రవ్య పెట్టుబడి లాభాల కోసం ప్రపంచ పునర్విభజన కోసం సామ్రాజ్యవాద దేశాలతో, ప్రత్యేకంగా అమెరికాతో పోటీపడడం, వాటి మధ్య ఆర్థిక పోటీ, రాజకీయ, సైనిక రంగాల్లో ఘర్షణకు దారితీయడం అనివార్యం. అయినప్పటికీ వాటి మధ్య కుమ్మక్కు కూడా ఉంటుంది. అయితే కుమ్మక్కు తాత్కాలికమైనది, సాపేక్షికమైనది; పోటీయే శాశ్వతమైనది, పరమమైనది. ఆ పోటీ సైనిక రంగంలో ప్రచ్ఛన్న యుద్ధం, ప్రాంతీయ యుద్ధాల రూపాల్లో కొనసాగడానికి దారితీస్తుంది.

చైనాను చుట్టుముట్టి నిలువరించాలనేది అమెరికా లక్ష్యం. జపాన్, భారత్‌లతో సహా చైనా చుట్టూ ఉన్న తన కూటములను బలోపేతం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తున్నది. తమ స్వంత సైనిక శక్తిని పెద్దెత్తున విస్తరిస్తూ చైనా ఆర్థిక, సైనిక విస్తరణను మరింత బలంగా ఎదుర్కొనేందుకు అది పూనుకుంటున్నది. ఎగసివస్తున్న చైనా సామ్రాజ్యవాద శక్తి తన పరిమిత క్షేత్రం నుంచి విస్తరించడానికి ప్రయత్నిస్తూ ప్రత్యర్థి శక్తులను ఎదుర్కోవాలని చూస్తున్నది.

'బహుధృవ ప్రపంచాన్ని' స్థాపించడం చైనా అధికారికంగా ప్రకటించిన విదేశీ విధానం. మరో మాటలో అమెరికా ఏకధృవ ప్రపంచాన్ని సవాలు చేయడమూ, దానితో ప్రత్యక్ష పోటీకి దిగడం తప్ప ఇది మరొకటి కాదు. దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ (సార్క్)లో, దక్షిణాసియా స్వేచ్ఛా వ్యాపార ప్రాంతంలో చైనాకి 'ప్రత్యేక భాగస్వామ్య హోదా' లభించింది. ఆహారం, ముడి పదార్థాల సరఫరాల కోసం బ్రెజిల్‌తో ద్వైపాక్షిక వ్యాపార ఒప్పందాలను చైనా కుదుర్చుకుంది.

అమెరికా పాలకవర్గం, దాని మిత్ర దేశాలు 9/11 అల్‌ఖాయిదా దాడి సాకుతో ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలకు పాల్పడ్డాయి. అంతర్జాతీయ 'ఉగ్రవాదంపై యుద్ధాన్ని' ప్రధానంగా ఇస్లామిక్ దేశాలకూ ప్రజలకూ వ్యతిరేకంగా కేంద్రీకరించాయి. దీంతో చైనాతో పథకం ప్రకారం పెరుగుతున్న ఘర్షణ, చైనాతో నూతన ప్రచ్ఛన్న యుద్ధ (కోల్డ్ వార్) చర్యలను నిలిపివేయవలసి వచ్చింది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో త్వరగా తేలికగా విజయం సాధిస్తామనీ, ఆ తర్వాత ఇరాన్, సిరియా, ఉత్తర కొరియాల మీద కేంద్రీకరించవచ్చుననీ చివరకు వ్యూహాత్మక ప్రమాదంగా ఉన్న చైనాను దీర్ఘకాలంలో చూసుకోవచ్చునీ అమెరికా, దాని మిత్ర దేశాలు భావించాయి.

దీనికి భిన్నంగా ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో సామ్రాజ్యవాద దురాక్రమణ యుద్ధాలలో అమెరికా కూరుకుపోయింది. దీర్ఘకాలంగా ఆ దేశాలలో ప్రజల ప్రతిఘటన కొనసాగుతున్నది. అందులో అమెరికా వైఫల్యం చెందుతున్నది. దీనితో ఈ యుద్ధాల కోసం నిధులు ఇవ్వడం, బలగాలను సమకూర్చడాలలో 'మిత్రమ బలగాల' ఐక్యత దెబ్బతింటూ వచ్చింది.

ఆఫ్ఘనిస్తాన్, మధ్యప్రాచ్య దేశాలలో అమెరికా దిగబడిపోవడంతో ప్రస్తుత ప్రపంచ సామ్రాజ్యవాద చట్రంలోకి ఆర్థికంగా చొరబడడానికి చైనా సామ్రాజ్యవాదానికి పెద్ద అవకాశం ఏర్పడింది. చైనా విస్తరణను గట్టిగా ఎదుర్కోలేని ఆర్థిక బలహీనత అమెరికాకు ఏర్పడింది. ఉదాహరణకు అమెరికా నాయకత్వంలో దురాక్రమణ యుద్ధం తర్వాతి సంవత్సరాలలో చైనా ఇరాక్ నుంచి పెద్ద చమురు కాంట్రాక్ట్‌లను సంపాదించుకుంది. ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తన స్థానాన్ని చైనా ఆక్రమిస్తుందని, తన ద్రవ్య పరిస్థితి, బడ్జెట్ లోటులూ మరింత తీవ్రతరం అవుతుంటే చైనా అంతర్జాతీయ ద్రవ్య వనరులూ బలమూ పెద్ద అంగలతో పెరుగుతున్నాయని అమెరికా ఆందోళన చెందుతున్నది. ప్రతి సంవత్సరం చైనా సైనిక వ్యయం, బలం విస్తరించడం పెంటగన్‌కు మింగుడుపడడం లేదు. మొత్తంగా చూసినప్పుడు చైనా శక్తి పెరుగుతున్నది, అమెరికా శక్తి క్షీణిస్తున్నది.

అంతర్జాతీయ ఆర్థిక పోటీలో చైనాను అధిగమించేందుకు మార్గాలను అమెరికా పాలకవర్గాలు వెతుకుతున్నాయి. ఇటువంటి వెతుకులాటలో భాగమే 'ట్రాన్స్ పసిఫిక్ పార్టనర్‌షిప్' (టిపిపి). అమెరికా కోసమూ, చైనా మినహా పసిఫిక్ రిమ్‌లో ఉన్న తక్కిన అన్ని దేశాల కోసమూ ఏర్పాటు చేస్తున్న స్వేచ్ఛా వ్యాపార మండలే ఇది. (డోనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందాన్ని ప్రస్తుతం రద్దు చేసినప్పటికీ మరో రూపంలో ఇటువంటి ఒప్పందాల్ని చేసుకోకతప్పదు. ఎందుకంటే, ఈ ఒప్పందం రద్దును జపాన్, దక్షిణ కొరియాలు ఆమోదించకపోగా తమ మధ్య ఈ ఒప్పందం ప్రకారం సహకారం కొనసాగుతుందని పేర్కొన్నాయి) తద్వారా ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద వ్యవస్థలో రెండు పోటీ ఆర్థిక/రాజకీయ/సైనిక కూటముల ఏర్పాటుకు దారి తీస్తున్నాయి. డబ్ల్యుటిఓ వంటి అంతర్జాతీయ వేదికలను ఉపయోగించుకొని వెనుకబడిన దేశాలను దోచుకోవడంలో సామ్రాజ్యవాద దేశాల మధ్య కుమ్మక్కు కొనసాగుతున్నప్పటికీ, డబ్ల్యుటిఓలో చైనాకు వ్యతిరేకంగా అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాల నుంచి అంతర్జాతీయ వ్యాపార యుద్ధం పెరుగుతున్నది. డబ్ల్యుటిఓలో భాగంగా ఉన్న అన్ని ప్రధాన సామ్రాజ్యవాద దేశాలూ దాని నియమాలను ఉల్లంఘిస్తాయి. నిరంతరం సభ్య దేశాలను మోసం చేస్తాయి., పరస్పరం మోసం చేసుకుంటాయి. మార్కెట్ వాటాను గుంజుకోవడానికి విదేశీ మార్కెట్‌లలో తక్కువ ధరలకు తమ సరుకులను అమ్మడం–'డంపింగ్' చేస్తాయి. ఎగుమతి రాయితీలను ఉపయోగించుకుంటాయి. తమ కార్పొరేషన్లకు కాంట్రాక్టులు ఇస్తే సైనిక సహాయానికి హామీ ఇస్తాయి. లంచగొండితనం వంటి అక్రమ చర్యలకు పాల్పడతాయి.

అమెరికా మాదిరిగానే చైనా కూడా తన ప్రత్యర్థులను తప్పించి తన స్వేచ్ఛా వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసుకుంటున్నది. అందుచేత, అమెరికా, దాని సన్నిహిత మిత్ర దేశాలకు వ్యతిరేకంగా ఆర్థిక/రాజకీయ/సైనిక కూటములు ఏర్పాటు చేసేందుకు చైనా ప్రయత్నిస్తున్నది. దీనికి ఉదాహరణగా చైనా, రష్యాలు కేంద్రంగా ఉన్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ). అవి ఎస్‌సిఓను ఒక రక్షణ బ్లాకుగా, బ్రిక్స్‌ను ఒక ఆర్థిక బ్లాకుగా కొనసాగిస్తున్నాయి.

**సిల్క్ రోడ్ ఫ్రీ ట్రేడ్ జోన్ లేదా ఓబిఓఆర్ ప్రాజెక్టు :**

చైనా, మధ్య ఆసియా దేశాలైన కజికిస్తాన్, ఉజ్‌బికిస్తాన్, టర్కమనిస్తాన్, కిరిగిస్తాన్, తజికిస్తాన్‌లతో ఒక "సిల్క్ రోడ్ ఫ్రీ ట్రేడ్ జోన్"ను ఏర్పాటు చేస్తున్నది. ఇందుకోసం ప్రధానంగా ఒక కోటి 65 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడితో చైనా చొరవతో, రష్యా క్రియాశీల సహకారంతో ఒక బెల్ట్, ఒక రోడ్డు (OBOR) పథకం ముందుకు వచ్చింది. చైనాలోని ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు, బ్రిక్స్‌కు చెందిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు, సిల్క్ రోడ్ ఫండ్ సంస్థలు ముఖ్యంగా ఓబిఓఆర్‌కు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయి. 2016లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ శిఖరాగ్ర సమావేశం ఓబిఓఆర్‌ను పూర్తిగా సమర్థించింది. ఓబిఓఆర్ ఏదో ఒక సాధారణ పథకం కాదు. ఆరు ఆర్థిక కారిడార్ల సమ్మిళత పథకం. ఈ కారిడార్లు చైనా నుండి మొదలవుతాయి. చైనా నుంచి మిగతా ఆసియా ప్రాంతాలకు, ఆఫ్రికా, యూరప్ ఖండాలకు రోడ్డు, రైలు, సముద్ర మార్గాలు అభివృద్ధి చేయడం ఈ పథకం లక్ష్యం. ఈ మార్గాలు పూర్తయితే తూర్పు ఆసియా నుంచి యూరప్ ఆర్థిక మండళ్ల వరకు అనుసంధానం ఏర్పడుతుంది. మొదటి మార్గం, మధ్య ఆసియా, తూర్పు యూరప్ దేశాల వైపు వెళుతుంది. ఇది కర్గిస్తాన్, ఇరాన్, టర్కీ, గ్రీస్‌ల వరకూ వెళుతుంది. 2వ మార్గం, మధ్య ఆసియాలో నుంచి పశ్చిమ ఆసియా, మధ్యదరా సముద్రం వైపు వెళుతుంది. ఈ మార్గంలో కజకిస్తాన్, రష్యాల వరకూ చైనా వెళ్లగలుగుతుంది. 3వ మార్గం, దక్షిణాసియా దేశమైన బంగ్లాదేశ్ వైపు వెళుతుంది. దీనిని బంగ్లాదేశ్, చైనా, ఇండియా, మ్యాన్మార్ (బిసిఐఎం) ఆర్థిక కారిడార్‌గా చెబుతున్నారు. 4వ మార్గం, పాకిస్తాన్‌లో వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన ఓడరేవు గ్యాదర్‌ను పశ్చిమ చైనాతో కలుపుతుంది. ఇదే చైనా-పాకిస్తాన్ ఆర్థిక కారిడార్‌గా ప్రసిద్ధి చెందింది. 5వ మార్గం, చైనా నుంచి ఒక జలమార్గం థాయ్‌లాండ్, మలేషియాల మీదుగా సింగపూర్ నుంచి హిందూ మహా సముద్రం వైపు వెళుతుంది. 6వ మార్గం, మంగోలియా ఆర్థిక కారిడార్. ఈ ఆరు భూ-జల మార్గాల ద్వారా మధ్య ఆసియా స్వేచ్ఛా వ్యాపార మండలి (Central Asian Free Trade Area)లో నేపాల్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఇరాన్ వంటి ఆసియా దేశాలను భాగం చేయడంతో పాటు ఆఫ్రికా, యూరప్ ఖండాలలోని మొత్తం 65 దేశాలను కలిపే లక్ష్యంతో ఈ పథకాన్ని చేపట్టాయి. ఈ సంవత్సరం మే 14న బీజింగ్‌లో ఈ పథకంపై చైనా నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్‌లో నాలుగు ఖండాలు - ఆసియా,

ఆఫ్రికా, యూరప్, దక్షిణ అమెరికాల నుంచి 29 మంది దేశాధినేతలు హాజరయ్యారు. అమెరికా, జపాన్‌లతో సహా అనేక దేశాలు తమ ప్రతినిధి బృందాలను పంపాయి. సారాంశంలో ఈ పథకం జలమార్గాలపై అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా రష్యా మద్దతుతో, భాగస్వామ్య దేశాల సహకారంతో చైనా రూపొందించిన వ్యూహాత్మక పథకం.

అంతర్జాతీయంగా చైనా ఆర్థిక పలుకుబడి పెరిగింది. అమెరికా ద్రవ్య, వ్యాపార లోటు పూడ్చుకోవడానికి చైనా నిధులు ఇవ్వడంతో, చైనాకు అనేక విషయాలలో అనుకూలతలు ఏర్పడ్డాయి. అమెరికా, చైనా దేశాల మధ్య ఆర్థిక ఘర్షణ తలెత్తినప్పుడు చైనాదే పైచేయిగా ఉంటున్నది. చైనా మీద దాడి చేయడానికైనా, ఆంక్షలు విధించడానికైనా అమెరికాకు అనేక పరిమితులు ఉన్నాయి. అమెరికా, చైనాలు అనేక విషయాల్లో కుమ్మక్కు అవుతున్నప్పటికీ లాభాల కోసం మార్కెట్లను హస్తగతం చేసుకునే విషయంలో వాటి మధ్య తీవ్రమైన పోటీ కొనసాగుతున్నది.

అలాగే రష్యా, చైనాలకు ఉమ్మడి ప్రయోజనాలు ఉన్నాయి. అమెరికా ఆధిపత్యంలోని వర్తమాన అంతర్జాతీయ వ్యవస్థను తిరస్కరించడం, వర్తమాన అమెరికా ఆధిపత్య పరిస్థితికి ముగింపు పలకాలనే ఆకాంక్ష, ఇందుకు తన బలాన్ని ఉపయోగించేందుకు సైతం సన్నాహాలు చేసుకోవడంలో ఇవి కనపడతాయి. రష్యా, చైనాలు పాశ్చాత్య దేశాలతో, పొరుగున ఉన్న దేశాలతో సంబంధాలు దెబ్బతింటాయనే భయం లేకుండా బలాన్ని ఉపయోగిస్తూ తమ దేశ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నాయి. ఉదాహరణకు, క్రిమియాను కలుపుకోవాలని ఏకపక్షంగా రష్యా నిర్ణయించుకుంది. రష్యా దన్నుతో ఏకపక్షంగా సేకరించిన స్థానిక ప్రజాభిప్రాయంపై ఆధారపడి ఉక్రెయిన్ నుంచి క్రిమియా విడిపోయి 2014 మార్చిలో రష్యా సమాఖ్యలో కలిసింది. ఈ రష్యా నిర్ణయాన్ని పాశ్చాత్య దేశాలు తీవ్రంగా ఖండిస్తూ దానిపై ఆంక్షలు విధించాయి. 2013 నవంబర్‌లో దక్షిణ చైనా సముద్రంలో చైనా తన ఎయిర్ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్ (ADIZ)ను స్థాపిస్తున్నట్లు ఏకపక్షంగా ప్రకటించింది. ఆ జోన్‌లో ఎగిరే ముందు తనకు నోటిఫికేషన్‌ను అందించాల్సి ఉంటుందని అంతర్జాతీయ సమాజాన్ని హెచ్చరించింది. రెండు చైనా యుద్ధ విమానాలు జపాన్ ADIZ ఓవర్‌లాప్ అయ్యే ప్రాంతంలో జపాన్‌కు చెందిన రెండు స్కౌట్ బలగాల నుంచి తృటిలో తప్పించుకున్నాయి. 2014 మేలో వియత్నాంలో వివాదం ఉన్న భూభాగంగా ఉన్న పారసెల్ దీవుల చుట్టూ ఉన్న జలాల్లో చైనా జాతీయ ఆఫ్-షోర్ ఆయిల్ కార్పొరేషన్ (CNOOC) పెద్ద చమురు రిగ్‌ను స్థాపించి, చమురు కోసం ఎవరికీ తెలియకుండా డ్రిల్లింగ్ ప్రారంభించింది. ఆ జలాల్లోకి తన నావికా బలగాలను పంపింది. అక్కడ అది వియత్నాంకు చెందిన చేపల పడవలు, పబ్లిక్ నావలతో పదే పదే ఘర్షణలకు దిగుతున్నది.

రష్యా, చైనాలు యురేసియాలో రెండు బలమైన శక్తులు. అవి ఐక్యరాజ్య సమితి భద్రతా

మండలిలో కూడా శాశ్వత సభ్య దేశాలు. పైన వివరించిన విధంగా అంతర్జాతీయ రాజకీయాలను అమెరికా, పాశ్చాత్య దేశాలు నియంత్రించడాన్ని రష్యా, చైనాలు పదే పదే వ్యతిరేకిస్తున్నాయి. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసినప్పటి నుంచీ వివిధ సమయాల్లో తమ వీటో అధికారాన్ని రష్యా, చైనాలు ఉపయోగించాయి. ఉదాహరణకు 1999లో కొసోవోలో యుద్ధం బద్దలైనప్పుడు సైనిక శక్తిని ఉపయోగించడాన్ని ఐక్య రాజ్య సమితి భద్రతా మండలిలో ఈ రెండు దేశాలు వ్యతిరేకించాయి. ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా ఆంక్షలను విధించడాన్ని వ్యతిరేకించడానికి, సిరియాలో అంతర్గత యుద్ధంలో జోక్యాలను వ్యతిరేకించడానికి భద్రతా మండలిలో అవి సంయుక్త వైఖరిని చేపట్టాయి.

చైనా దక్షిణ చైనా సముద్రం, తూర్పు చైనా సముద్రాలలో చేపట్టిన చర్యలు తానుగా ఆ భూభాగంపై హక్కులు ఉన్నాయని చెప్పుకునే దానిపై ఆధారపడినవి. ఇలా రష్యా, చైనాలు జారీ చేసిన ప్రకటనలు (డిక్లరేషన్లు), డాక్యుమెంట్లు ప్రస్తుత అమెరికా ఏకైక అగ్రరాజ్య ఆధిపత్యాన్ని అవి వ్యతిరేకిస్తున్నాయని సూచిస్తున్నాయి. 2014 మేలో రష్యా, బెలారస్, కజకిస్తాన్‌లు యురేసియా యూనియన్‌ను స్థాపిస్తూ ఒక ఆర్థిక బ్లాక్ ఏర్పాటు వైపుగా ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. సైనిక విషయాల్లో రష్యా కలెక్టివ్ సెక్యూరిటీ ట్రీటీ ఆర్గనైజేషన్ (CSTO)కు ప్రాముఖ్యత ఇస్తోంది. ఇందులో రష్యా, ఆర్మేనియా, బెలారస్, కజికిస్తాన్, కిర్గిస్తాన్, తజికిస్తాన్‌లు ఉన్నాయి. ఉక్రెయిన్, యూరోపియన్ యూనియన్‌లోని ఇతర రీజియన్లకు సంబంధించి రష్యా విధానాలు భవిష్యత్తులో ఈ ప్రాంతాలకు తన నియంత్రణ కిందికి తెచ్చుకోవడానికి అనుగుణంగా ఉన్నాయి.

చైనాలో ప్రధానమంత్రిగా హు జిన్‌టావో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చైనా తాను ఒక బలమైన సముద్ర శక్తిగా పరివర్తన చెందినట్లుగా చెప్పుకుంటున్నది. రాష్ట్రపతిగా గ్జి జిన్‌పింగ్ (Xi Jinping) అధికారంలోకి వచ్చినప్పటి నుంచి “చైనీయుల కల”, “చైనా ప్రజల మహా పునరుద్ధానం” అని కీర్తిస్తున్నాడు. 2013 జూన్‌లో రాష్ట్రపతి గ్జి అమెరికా రాష్ట్రపతి బరాక్ ఒబామాతో నిర్వహించిన శిఖరాగ్ర సమావేశంలో నూతన ప్రపంచ అధికార సంబంధాలను ప్రతిపాదించినప్పుడు, అమెరికా చైనాలకు పసిఫిక్ ప్రాంతం తగినంత జాగాను కల్పించగలదని అన్నాడు. ఈ ప్రకటన ద్వారా, పసిఫిక్ ప్రాంతాన్ని అమెరికా, చైనాల మధ్య విభజించి–పాలించాలనే చైనా పథకాన్ని గ్జి ప్రకటించాడు. ఈ పథకం కింద అమెరికా కంటే చైనా నాన్‌సీయి దీవులు, తైవాన్–ఫిలిప్పైన్స్ మధ్య ఉన్న బాషి జలసంధి, మొత్తం దక్షిణ చైనా సముద్రంతో కూడిన మొదటి దీవుల సముదాయం పరిధిలో తన ఆధిపత్యాన్ని స్థాపించుకున్న తర్వాత, ఒగసవరా దీవుల నుంచి గువాన్ వరకూ విస్తరించి ఉన్న 2వ దీవుల సముదాయం పరిధి లోపల (పెరల్ నక్లెస్‌గా ప్రసిద్ధి చెందిన) హిందూ మహా సముద్రం నుంచి మధ్య ప్రాచ్యం (పశ్చిమాసియా) వరకూ విస్తరించి ఉన్న సముద్ర జలాల్లో స్థావరాలతో కూడిన ఒక

మూల నెట్‌వర్క్‌ను నిర్మించుకొని అనుకూలతలను ఏర్పర్చుకోవాలని చైనా ఉవ్విళ్లూరుతోంది. అందువల్ల, తూర్పు చైనా సముద్రం, దక్షిణ చైనా సముద్రంలో ప్రస్తుత చర్యల్ని ఏదో సాధారణంగా భౌగోళిక వివాదాలను తేల్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా కాక, ఈ పథకంలో ఒక మెట్టుగానే చైనా సామ్రాజ్యవాదం కొనసాగిస్తున్నదని చూడాలి. చైనా సూటిగా మాట్లాడుతూ, అమెరికన్లకు మరింతగా చైనీయుల మిగులు పెట్టుబడి కావాలంటే, అమెరికా తైవాన్‌ను తమకు అప్పగించాలి, టిబెట్‌పై చైనాకున్న హక్కుల గురించి చికాకుపర్చడం ఆపాలి అంటున్నది. ఇదీ నూతన సామ్రాజ్యవాద శక్తిగా ఆవిర్భవించిన చైనా–దిగజారిపోతున్న అమెరికా అగ్ర రాజ్య శక్తి మధ్య నిజమైన సంబంధం. అంతర్జాతీయ రంగంలో కొన్ని ముఖ్యమైన పరిణామాలు, ధోరణులు ముందుకు వచ్చాయి. అవి :

1. 1970ల నుండి స్టాగ్‌ఫ్లేషన్[33] రూపంలో కొనసాగుతున్న పెట్టుబడిదారీ సాధారణ సంక్షోభంలో భాగంగా, క్రమంగా ఆర్థికంగా బలహీనపడుతూ వస్తున్న అమెరికాలో 2008లో ఏర్పడిన గృహ రుణాల సంక్షోభం వల్ల మరింత బలహీనపడడం; ఇప్పుడు రాజకీయ, సైనిక రంగాల్లో దానికి రష్యా, చైనాల నుండి మరింత పోటీ పెరుగుతుండడం.
2. సామ్రాజ్యవాద దేశాల్లో, పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థికరంగంలో రక్షణ విధానం (ప్రొటెక్షనిజం), రాజకీయ రంగంలో రేసిజం (జాత్యాహంకారం), ఫాసిజం పెరుగుతుండడం.
3. వెనుకబడిన దేశాల వనరులను, మార్కెట్లను కొల్లగొట్టడం కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్య పోటీ పెరుగుతుండడం.
4. ఇప్పటివరకు ఏకైక అగ్రరాజ్యంగా ఉన్న అమెరికా సామ్రాజ్యవాదం తన పరిస్థితిని సంఘటితం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నది. రష్యా సామ్రాజ్యవాదం తన ప్రభావ పరిధులను కోల్పోకుండా నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నది. సామ్రాజ్యవాద దేశంగా ఎదిగిన చైనా ప్రపంచ మార్కెట్ల పునర్విభజన కోసం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తుండడంతో అమెరికా అగ్రరాజ్యంతో దానికి వైరుధ్యాలు పెరుగుతున్నాయి. ప్రపంచ పునర్విభజన కోసం అమెరికా–చైనాల మధ్య పెరుగుతున్న పోటీని అనుసరించి ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక–రాజకీయ సమీకరణలు (రీ అలైన్‌మెంట్) మారుతున్నాయి. యూరప్‌లో ఆధిపత్యం కోసం జర్మనీ, ఫ్రాన్స్‌ల మధ్య పోటీ పెరుగుతున్నాయి. ఈ పరిణామాలు సామ్రాజ్యవాద ప్రధాన దేశాల బలాబలాల స్థితిని ప్రతిబింబిస్తుండడం.

సమీప భవిష్యత్తులో అమెరికా, చైనా/రష్యా బ్లాకుల మధ్య యుద్ధం ఎజెండాలో లేనప్పటికీ, అనేక పరోక్ష యుద్ధాలు మాత్రం ఎజెండాలో ఉన్నాయి. అయితే అమెరికా రష్యా, చైనాలను దూకుడుగా చుట్టుముడుతోంది. నాటో ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లలో యుద్ధాన్ని విస్తరిస్తోంది. అది

ఆర్కిటిక్‌లో రష్యాను అడ్డుకోనున్నది. అమెరికా నాయకత్వంలోని బ్లాక్ ఇస్తున్న హెచ్చరికలతో చైనా పునస్సాయుధమవడాన్ని గమనించవచ్చు. అందుచేత ప్రపంచవ్యాప్తంగా చైనా/రష్యా బ్లాకు అమెరికా సామ్రాజ్యవాదానికి ముఖ్యమైన పోటీదారు అయ్యింది. చైనా సామ్రాజ్యవాదానికి పెరుగుతున్న మార్కెట్ అవసరాల్ని తీర్చడం కోసం, చమురు, కీలకమైన ఖనిజాలపై నియంత్రణ కోసం, సాధారణంగా ప్రపంచాన్ని కొల్లగొట్టడం కోసం ప్రపంచంలో ప్రతీ చోటా చైనా అమెరికాతో పోటీపడుతోంది. ఈ విధంగా ప్రపంచాన్ని పునర్విభజించడం కోసం సాగుతున్న సామ్రాజ్యవాద అంతర్గత పోరాటంలో చైనా/రష్యా బ్లాకు ఇప్పటికే అమెరికా ఆధిపత్యానికి వ్యతిరేకంగా ముఖ్యమైన ముప్పుగా ఆవిర్భవించింది.

## ముగింపు

ప్రపంచంలోని మూడు మౌలిక వైరుధ్యాలు – సామ్రాజ్యవాదానికీ పీడిత జాతులకూ, ప్రజలకూ మధ్య వైరుధ్యం; పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాల్లో బూర్జువా వర్గానికీ, కార్మికవర్గానికీ మధ్య వైరుధ్యం; సామ్రాజ్యవాద దేశాల మధ్యా, గుత్తాధిపత్య పెట్టుబడిదారీ బృందాల మధ్యా వైరుధ్యం పదునెక్కుతున్నాయి. ఈ వైరుధ్యాలలో సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులూ, ప్రజలకూ మధ్య వైరుధ్యం ప్రధాన వైరుధ్యం. ప్రస్తుతం ఈ వైరుధ్యం ఇతర వైరుధ్యాల్ని ప్రభావితం చేస్తుంది. ఇతర వైరుధ్యాలపై నిర్ణయాత్మక ప్రభావం చూపుతుంది.

సామ్రాజ్యవాద దోపిడీ, పీడన, అణచివేతకూ, దురాక్రమణకూ, విద్రోహానికీ, జోక్యానికీ, పెత్తనానికీ, వివక్షకూ గురయ్యే ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాల ప్రజలు జాగృతమవుతున్నారు, ప్రతిఘటిస్తున్నారు. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతున్నది. ఇందులో భాగంగా చైనా సోషల్ సామ్రాజ్యవాదులకూ పీడిత జాతులు, ప్రజలకూ మధ్య వైరుధ్యం, చైనాలో బూర్జువా వర్గానికీ, కార్మికవర్గానికీ మధ్య వైరుధ్యం పెరుగుతూ చైనా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు వివిధ రూపాలలో పోరాడుతున్నారు. జాతులు విముక్తినీ, దేశాలు స్వాతంత్ర్యాన్నీ, ప్రజలు విప్లవాన్నీ కోరుకుంటున్నారు. అందుచేత ఈ పోరాటాలన్నీ సామ్రాజ్యవాదాన్ని తుదముట్టించే వరకూ అప్రతిహతంగా ప్రజా వెల్లువలుగా పురోగమిస్తాయి. ఈ సందర్భంగా మార్క్సిస్టు మహోపాధ్యాయుడు మావో జపాన్ వ్యతిరేక యుద్ధ విజయం సందర్భంగా చెప్పిన మాటలను గుర్తు చేసుకోవడం సముచితంగా ఉంటుంది. "ప్రపంచం తప్పకుండా అభివృద్ధికర మార్గానే చేపడుతుంది గానీ, అభివృద్ధి నిరోధక మార్గాన్ని కాదు. అయితే, ఈ క్రమంలో కొన్ని తాత్కాలికమైన లేదా ముఖ్యమైన మలుపులూ, పరిణామాలు సంభవించే అవకాశాలను దృష్టిలో పెట్టుకొని, మనం సదా అప్రమత్తంగా ఉండాలి; చాలా దేశాలలో ఇంకా, ప్రజలపై కత్తిగట్టి, దేశ విదేశాల్లో ప్రజల ఐక్యతను, అభివృద్ధిని, విముక్తిని తీవ్రంగా ద్వేషించే అభివృద్ధి నిరోధక

శక్తులు బలంగా ఉన్నాయి. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకోనివారు రాజకీయపరమైన పొరపాట్లు చేస్తారు. కానీ చరిత్ర గమనపు సాధారణ ధోరణి ఇప్పటికే స్పష్టంగా నిర్ణయించబడింది. అది మారదు."[34]

సామ్రాజ్యవాదుల దన్నుతో రివిజనిస్టులు చేసిన విద్రోహం ఫలితంగా సోవియట్ యూనియన్, సోషలిస్టు చైనాలతో సహా మొత్తం సోషలిస్టు శిబిరాన్నే కోల్పోయిన ప్రస్తుత స్థితిలో ప్రపంచ కార్మికవర్గానికి ఒక స్థావరం అంటూ లేకుండా పోయింది. అక్టోబర్ విప్లవం ముందు నాటి స్థితే నేడు నెలకొని ఉంది. మొత్తం మీద పరిస్థితిలోని అన్ని లక్షణాలను పరిగణనలోకి తీసుకుంటే కొన్ని నెగెటివ్ అంశాలు ఉన్నందువల్ల పరిస్థితిలో పెను ప్రమాదాలు, సవాళ్లు ఉన్నప్పటికీ, ఇంకా గొప్ప అవకాశాలను బాటను సుగమం చేసే అనుకూలాంశాలు, గత చరిత్రలో ఏ కాలంలో కన్నా ఇప్పుడే ఎక్కువగా ఉన్నాయి. నిస్సందేహంగానే, ప్రపంచ కార్మికవర్గం పెను సవాళ్లను, గడ్డు కాలాలను ఎదుర్కొంటోంది. కానీ మొత్తం మీద పరిస్థితి సరిగ్గా "చిన్న నిప్పురవ్వ దావానలాన్ని రగిలించగలదు," "సాయుధ విప్లవం సాయుధ ప్రతీఘాత విప్లవాన్ని ఎదుర్కొంటోంది" అంటూ కామ్రేడ్ మావో సూచించిన విధంగానే ఉంది.

మరణావస్థలో ఉన్న సామ్రాజ్యవాదం నేడు ప్రపంచవ్యాప్తంగా అనేక వెనుకబడిన దేశాలపై దురాక్రమణ యుద్ధాలను కొనసాగిస్తూ, స్థానిక/ప్రాంతీయ యుద్ధాలను రగిలిస్తూ ప్రపంచ పీడిత ప్రజానీకానికీ పెనుపీడలాగా పరిణమించింది. సామ్రాజ్యవాదుల మధ్య పోటీలో భాగంగా తమ మార్కెట్ ప్రయోజనాల కోసం ప్రపంచాన్ని పునర్విభజించేందుకు పథకం ప్రకారం ఆర్థిక, సైనిక బ్లాకులు ఏర్పాటు చేసుకుంటూ మరో ప్రపంచ స్థాయి యుద్ధానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ముందే చెప్పుకున్నట్లుగా సామ్రాజ్యవాదుల దురాక్రమణ, జోక్యం ద్వారా, విప్లవ ప్రతీఘాతుక యుద్ధాలను ప్రపంచ కార్మికవర్గం, పీడిత జాతులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారు, ప్రతిఘటిస్తున్నారు. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో ప్రపంచ కార్మికవర్గం, మావోయిస్టు పార్టీలు-సంస్థలు పీడిత జాతులను, ప్రజలను సమీకరించి, ఈ యుద్ధాలకు కారణమైన సామ్రాజ్యవాదాన్నీ, అన్ని రకాల ప్రతీఘాతుక శక్తులను అంతమొందించే లక్ష్యంతో పోరాడాలి. సామ్రాజ్యవాదులు బరితెగించి మూడవ ప్రపంచ యుద్ధానికి దిగితే వారికి గోరీ కట్టి కార్మికవర్గ విప్లవాలను విజయవంతం చేసే లక్ష్యంతో ఆ యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చే ఎత్తుగడలను ప్రపంచ కార్మికవర్గం చేపట్టాలి. బూర్జువా జాతీయ దురహంకారాన్ని రెచ్చగొట్టి పీడిత జాతులు, ప్రజలలో చీలికను సృష్టించేందుకు సామ్రాజ్యవాదులు, రివిజనిస్టులు చేసే కుట్రలన్నీ తిప్పికొట్టాలి. ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దేశాలలో కార్మికవర్గం మధ్యతరగతిని కలుపుకొని సోషలిస్టు విప్లవాలను విజయవంతం చేసే కర్తవ్యాన్ని చేపట్టాలి. వెనుకబడిన దేశాల్లో నూతన ప్రజాస్వామిక విప్లవాలు, జాతి విముక్తి పోరాటాలను విజయవంతం చేయాలి. నేటి అద్భుత విప్లవ పరిస్థితిలో

విప్లవాలు బద్దలై యుద్ధాలు నివారించవచ్చును. విప్లవాలే గనుక ఆలస్యమైతే, సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు మరింత తీవ్రతరమై ప్రపంచ యుద్ధం బద్దలు కావచ్చును. అదే జరిగితే, ప్రపంచ కార్మికవర్గం ఆ తీవ్ర సంక్షోభాన్ని, యుద్ధం మూలంగా ప్రజలలో పెల్లుబికే ఆగ్రహాన్నీ ఉపయోగించుకొని సామ్రాజ్యవాదాన్నీ, తమ తమ దేశాల్లోని దాని తొత్తులను దెబ్బతీస్తూ విప్లవాలను విజయవంతం చేయాలి. ఈ రెండింటిలో ఏది జరిగినప్పటికీ విప్లవమే ప్రధానమైన ధోరణిగా ఉంటుంది. ఈ ధోరణిని ప్రపంచంలో ఏ శక్తీ అడ్డుకోలేదు.

- కార్మికవర్గం పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప! ఒక ప్రపంచాన్నే వాళ్లు గెలుచుకోవలసి ఉంది!
- సకల దేశ కార్మికులారా! పీడిత ప్రజలారా ఏకంకండి!
- కమ్యూనిస్టు విప్లవాన్ని చూసి పాలకవర్గాల్ని గజగజ వణకనివ్వండి!
- సామ్రాజ్యవాదం, అన్ని దేశాల ప్రతీఘాతకులు నశించాలి!
- చైనా సోషల్-సామ్రాజ్యవాదం నశించాలి!
- రకరకాల రివిజనిజం నశించాలి!
- వివిధ దేశాల కార్మికవర్గ విప్లవ పార్టీల, సంస్థల ఐక్యత వర్ధిల్లాలి!
- సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవ, ప్రజాస్వామిక సంస్థల, శక్తుల ఐక్యత వర్ధిల్లాలి!
- ప్రపంచ కార్మికుల, పీడిత జాతుల, పీడిత ప్రజల ఐక్యత వర్ధిల్లాలి!
- ప్రపంచ కార్మికవర్గ విప్లవం వర్ధిల్లాలి!
- కార్మికవర్గ అంతర్జాతీయత వర్ధిల్లాలి!
- మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!

## నోట్స్

1. 'ఉత్పత్తి శక్తుల' రివిజనిస్టు సిద్ధాంతం : ఉత్పత్తి శక్తులలో రెండు అంశాలున్నాయి. అవి మానవులు, ఉత్పత్తి సాధనాలు. వీటిలో మానవులు ప్రధానమైనవారు, నిర్ణయాత్మకమైనవారు. కానీ రివిజనిస్టులు ఉత్పత్తి సాధానాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తారు. ఉత్పత్తి పరికరాలను అభివృద్ధి చేయడానికి బూర్జువా నిపుణులపై ఆధారపడాలనీ, వాటినీ, ఆధునిక పరిజ్ఞానాన్నీ విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలనీ, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాలను అభివృద్ధి చేయడం ద్వారానే ఉత్పత్తి అభివృద్ధి చెంది ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని 'ఉత్పత్తి శక్తుల సిద్ధాంతం' వకాల్తాదారులయిన రివిజనిస్టులు వాదిస్తారు. ఒక్కమాటలో 'ఉత్పత్తి శక్తుల' సిద్ధాంతానికి అర్థం వర్గ పోరాటానికి వ్యతిరేకంగా ఆధునికీకరణకు, లాభానికి ప్రాధాన్యత నిచ్చి, భౌతిక ప్రోత్సాహకాల ద్వారా ఉత్పాదక శక్తిని పెంచడానికి ప్రాధాన్యం ఇవ్వటమే.

ఇది కార్మికవర్గ విప్లవానికి, కార్మికవర్గ నియంతృత్వానికి వ్యతిరేకంగా రివిజనిస్టులు ముందుకు తెచ్చిన సిద్ధాంతం. రెండవ ఇంటరేషనల్ రివిజనిస్టు నాయకులయిన బెర్న్‌స్టీన్, కాట్స్కీలు, బోల్షివిక్ పార్టీలో ట్రాట్స్కీ, బుఖారిన్ వంటి విప్లవ ద్రోహులు, చెన్ టు-షి, లీ షావ్-చీ, లిన్ పియావో, డెంగ్ సియావో పింగ్ వంటి మితవాద, అతివాద 'అవకాశవాద' రివిజనిస్టు పంథా నాయకులు ఆయా సమయాల్లో ఈ సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చారు. - 9వ పేజీ.

2. ప్రాగ్మాటిజం : 1870లలో అమెరికాలో ప్రారంభమైన ప్రాగ్మాటిజం (ఫలిత ప్రాధాన్యతా వాదం) పెట్టుబడిదారీ ప్రపంచంలో ప్రత్యేకించి అమెరికాలో ప్రాచుర్యంలో ఉన్న ధోరణి. జ్ఞానం యొక్క విలువకు కొలమానం దాని క్రియాత్మక ప్రయోజనమే (practical activity) తప్ప, భౌతిక వాస్తవికతకు అది అనుగుణంగా ఉండడం కాదు. వ్యక్తి స్వీయ ప్రయోజనాల కనుగుణమైనదే సత్యం. క్రియాత్మకంగా సఫలతను సాధించిపెట్టే భావన ఏదైనా నిజమైన సత్యం అవుతుంది. వస్తుగత వాస్తవికత అంటే 'అనుభవం' తప్ప వేరు కాదు. అంటే సాఫల్యాన్ని సాధించిపెట్టే ఎలాంటి ప్రతీఘాతుక విధానమైనా సిద్ధాంతమైనా సమర్థనీయమైనదే అవుతుంది. అది బూర్జువావర్గ ప్రయోజనాలను ఖచ్చితంగా ప్రతిబింబించే ధోరణి. - 11వ పేజీ.

3. మిలియన్ అంటే పది లక్షలు. అమెరికన్ కరెన్సీ పేరు డాలర్. నేటి అంతర్జాతీయ ద్రవ్య విలువ ప్రకారం సుమారు 66-67 రూపాయలు. - 13వ పేజీ.

4. బిలియన్ అంటే 100 కోట్లు. - 15వ పేజీ.

5. లాభాల భాగస్వామ్య ఒప్పందాలు : చైనాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణ తర్వాత చేపట్టిన సంస్కరణల ఫలితంగా ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి అనే మునుపటి సోషలిస్టు విధానం కూడా బుట్టదాఖలైంది. కింది నుంచి పై వరకూ వివిధ స్థాయి ప్రభుత్వ అంగాలు నేతృత్వం వహించే ఉత్పత్తి రంగాలను క్రమంగా ప్రైవేటు యాజమాన్యం కిందికి తీసుకొని వచ్చారు. ఈ క్రమంలో కింది స్థాయి (స్థానిక) ప్రభుత్వ అంగాల నేతృత్వం కింద అమలు చేసే స్థానిక ప్రణాళికా అభివృద్ధి విధానం రద్దయ్యింది. దీంతో ఆయా ఉత్పత్తి/సేవా రంగాలను కాంట్రాక్టుల ప్రాతిపదికన వ్యాపారం చేసుకునే విధానం అమలులోకి వచ్చింది. స్థానిక ప్రభుత్వ అంగాల చేతుల్లో నుండి ఉత్పత్తి/సేవా రంగ ప్రణాళికలను పర్యవేక్షించే బాధ్యతలను తీసివేసినారు. అవి కేవలం ఆయా కాంట్రాక్టు వ్యాపారాలలో వచ్చే లాభాలను ప్రభుత్వానికి చెల్లించాల్సిన వాటాల గురించి ఆయా కాంట్రాక్టర్లతో/పెట్టుబడిదార్లతో చర్చలు నిర్వహించి ఒక ఒప్పందం చేసుకోవడానికి పరిమితమయ్యాయి. ఈ స్థానిక ప్రభుత్వ అంగాలు పెట్టుబడిదార్లతో చేసుకునే ఈ ఒప్పందాలనే లాభాల భాగస్వామ్య ఒప్పందాలు అనేవారు. అంటే ప్రైవేటు కంపెనీలు తమ లాభంలో ప్రభుత్వానికి చెల్లించే వాటా గురించి చేసుకునే ఒప్పందం అన్నమాట. - 15వ పేజీ.

6. చైనా దేశ కరెన్సీ యువాన్. 2012 మార్చిలో ఒక అమెరికన్ డాలర్‌కు 6.3 చైనా యువాన్లుగా ఉండేది. – 17వ పేజీ.

7. తియనాన్‌మెన్ స్క్వేర్ నిరసన ప్రదర్శనలు : 1989 వసంత కాలంలో ప్రజాస్వామ్య అనుకూల విద్యార్థులు చైనా వ్యాప్తంగా పెద్దెత్తున ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజాస్వామిక సంస్కరణలు తీసుకొని రావాలని డిమాండ్ చేశారు. 1989 ఏప్రిల్‌లో సిపిసి మాజీ ప్రధాన కార్యదర్శి హు యావోబంగ్ మరణంతో బీజింగ్‌లోని తియనాన్‌మెన్ స్క్వేర్ వద్ద ఈ ప్రదర్శనలు పతాక స్థాయికి చేరుకున్నాయి. ప్రభుత్వ నిషేదాజ్ఞలను సైతం ధిక్కరిస్తూ సాగిన ఈ ఉద్యమంలో ప్రదర్శనకారులు సిపిసి అధినేత, రివిజనిస్టు డెంగ్‌ను, అతని సహచరులను గద్దె దిగాలని డిమాండ్ చేశారు. మే 20న ప్రభుత్వం మార్షల్ లా విధించింది. అమెరికా సామ్రాజ్యవాదులు ఈ సోకాల్డ్ 'ప్రజాస్వామిక ఉద్యమాన్ని' వీలైన అన్ని విధాలా ప్రోత్సహించారు. ఈ ప్రదర్శనలను రివిజనిస్టు డెంగ్ ప్రభుత్వం సైన్యాన్ని దించి అత్యంత పాశవికంగా అణచివేసింది. 1989 జూన్ 3, 4 తేదీల్లో సైన్యం చేసిన దాడుల్లో వందలాది మంది ప్రదర్శనకారులు నేలకొరిగారు. వేలాది మంది గాయపడ్డారు, అరెస్టు చేయబడినారు. పెద్దెత్తున ఉరిశిక్షలు విధించారు. – 18వ పేజీ.

8. పాశ్చాత్య శైలి ప్రైవేటు గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానం : పశ్చిమ యూరప్‌లో, అమెరికాలో పెట్టుబడిదారీ విధానం, గుత్తపెట్టుబడిదారీ విధానం మొట్టమొదట అవతరించింది. పెద్దెత్తున ఉనికిలో ఉన్నది. పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాలలో గుత్త పెట్టుబడిదారీ విధానం ప్రైవేటు పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలోని తీవ్రపోటీ క్రమం నుండి క్రమక్రమంగా రూపొందింది. ఇదే పాశ్చాత్య శైలి ప్రైవేటు గుత్తాధిపత్య పెట్టుబడిదారీ విధానం. ఈ ప్రైవేటు గుత్త పెట్టుబడిదారీ విధానం కొంతమేరకు అభివృద్ధి చెందిన తర్వాత మాత్రమే, ఆ ప్రైవేటు గుత్త పెట్టుబడికి ఊడిగం చేయడం కోసం రాజ్యాధికారం గుత్త పెట్టుబడితో కలిసిపోయినప్పుడు ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ విధానం తలెత్తింది. 18వ పేజీ.

9. ఇన్‌పుట్లు అంటే ఏదేని ఒక నిర్దిష్ట క్రమానికి (అది ఉత్పత్తి కావచ్చు, సేవ కావచ్చు, ఆపరేషన్ కావచ్చు) బయట నుంచి జోడించబడే తోడ్పాటు (ఉదాహరణకు, ఉత్పత్తిలో ఉత్పత్తికి తోడ్పడే ముడి పదార్థాలు, నీరు, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలు, శ్రమశక్తి వంటివి). 20వ పేజీ.

10. కాంట్రాక్టు లేబర్ వ్యవస్థ అంటే పర్మనెంట్ వర్కర్ల సంఖ్యని క్రమంగా తగ్గిస్తూ, టెంపరరీ వర్కర్లనీ, సీజనల్ వర్కర్లనీ ఎక్కువ సంఖ్యలో నియమించే 'లేబర్ కాంట్రాక్టు విధానం.' 22వ పేజీ.

11. అమెరికా నూతన ఆర్థిక వ్యవస్థ–డాట్‌కాం బూమ్–పతనం : 1990ల చివర్లో అమెరికాలో అభివృద్ధి అయిన ఇంటర్‌నెట్‌పై ఆధారపడి సాంప్రదాయక పద్ధతులకు భిన్నంగా ఈ–కామర్స్

(ఎలక్ట్రానిక్ వ్యాపార లావాదేవీలు)ను అమెరికా సామ్రాజ్యవాదులు పెద్దెత్తున అభివృద్ధి చేశారు. 1999–2002 మధ్య ఈ–వ్యాపారం గణనీయంగా అభివృద్ధి అయ్యింది. ఒక అమెరికా బ్యూరో లెక్కల ప్రకారం 1999లో 15 బిలియన్ డాలర్ల నుంచి 2002లో 44 బిలియన్ డాలర్ల వరకూ అది పెరిగింది. క్రమంగా దీని ఊపు తగ్గి 2000–2001లో ఈ–వ్యాపారం పెద్దెత్తున దివాలాతీసింది. 1990ల చివరిలో పుట్టి పెరిగిన డాట్‌కాం బూమ్ గాలి బుడగ 21వ శతాబ్దం ఆరంభం నాటికి పగిలిపోయింది. 1999–2001 మధ్య 520 ఈ–వ్యాపార సంస్థలు తమ వ్యాపారాన్ని నిలిపివేయడమో లేదా దివాలాతీయడమో జరిగింది. ఫార్చ్యూన్ పత్రిక ప్రకారం ఒక లక్ష మంది ఉద్యోగులు వీధుల పాలయ్యారు (లేఆఫ్‌కు గురయ్యారు). 27వ పేజీ, 37వ పేజీ.

12. లెనిన్, సామ్రాజ్యవాదం–పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ. 30వ పేజీ.

13. ఎం.ఎన్.సి., టి.ఎన్.సి.లు : ఎం.ఎన్.సి. (బహుళజాతి కార్పొరేషన్లు)లు సామ్రాజ్యవాద దేశాలకు సంబంధించిన భారీ గుత్త పెట్టుబడిదారీ సంస్థలు. వీటి యూనిట్లు చాలా వరకూ వెనుకబడిన దేశాలలో ఉంటాయి. వెనుకబడిన దేశాలలో కార్మికులకు ఉండే తక్కువ వేతన స్థాయిని ఉపయోగించుకుని అటువంటి దేశాలకు పెట్టుబడిని ఎగుమతి చేయడం ద్వారా ఎంఎన్‌సిలు దోచుకుంటున్నాయి. టి.ఎన్.సి.లు ఏదో ఒక దేశానికి చెందినవిగా ఉంటాయి. కొన్ని సందర్భాలలో ఎం.ఎన్.సి.లను టి.ఎన్.సి.లని కూడా పిలుస్తారు. ఈ రెండింటి కార్యకలాపాలు ప్రపంచవ్యాప్తంగా ఉంటాయి. 1960ల నుండి ఇవి అడ్డూ ఆపూ లేకుండా పెరిగిపోయాయి. ఇవి ఎంతో సంపన్నమైనవిగా ఉంటాయి. 31వ పేజీ.

14. ఫోర్బ్స్ గ్లోబల్ బిలియనీర్ల పట్టిక : ప్రపంచంలోని బిలియనీర్ల జాబితాను తెలియజేసే పట్టిక. అమెరికాలోని ఫోర్బ్స్ పత్రిక దీన్ని ప్రచురిస్తుంది. 31వ పేజీ.

15. ఫోర్బ్స్ గ్లోబల్ 2000 : ప్రపంచంలోని అతి పెద్ద, అత్యంత శక్తివంతమైన కంపెనీల సూచిక. అమెరికాలోని ఫోర్బ్స్ పత్రిక దీన్ని ప్రచురిస్తుంది. 31వ పేజీ.

16. ఫార్చ్యూన్ గ్లోబల్ 500 : ప్రపంచంలో అమెరికా కేంద్రంగా ఉన్న 500 అతి పెద్ద కార్పొరేషన్ల సూచిక. అమెరికాలోని ఫోర్బ్స్ పత్రిక దీన్ని ప్రచురిస్తుంది. 31వ పేజీ.

17. స్టాటిస్టికల్ కమ్యూనిక్ ఆఫ్ ది పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ఆన్ ది 2012 నేషనల్ ఎకనామిక్ అండ్ సోషల్ డెవలప్‌మెంట్, నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆఫ్ చైనా, ఫిబ్రవరి 22, 2013. 32వ పేజీ.

18. కెన్ డేవిస్, ఇన్‌వార్డ్ ఎఫ్‌డిఐ ఇన్ చైనా అండ్ ఇట్స్ పాలసీ కాంటెక్స్ట్, 2012, కొలంబియా ఎఫ్‌డిఐ ప్రొఫైల్స్, అక్టోబర్ 24, 2012. 32వ పేజీ.

19. ప్రపంచంలోని కుబేరుల చేతుల్లో ఉన్న సంపదను గురించి కాప్ జెమిని 2012 ప్రపంచ సంపద రిపోర్టు తెలియజేస్తుంది. 33వ పేజీ.

20. ఆలిగోపోలీ : కొద్ది మంది ద్రవ్య పెట్టుబడిదారుల ఆర్థిక ఆధిపత్యాన్నే ఆలిగోపోలీ అంటారు. 35వ పేజీ.

21. వాల్ స్ట్రీట్ అనేది అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ప్రముఖ స్టాక్ ఎక్స్‌చేంజ్. 36వ పేజీ.

22. ఆలిగార్కీ : దేశ రాజకీయాధికారాన్ని మాత్రమే కాక, ఉపరితల నిర్మాణంలోని వివిధ రంగాలపైన కూడా అదపును కలిగినదే ద్రవ్య ప్రభు కూటమి (ఆలిగార్కీ) అంటారు. 36వ పేజీ.

23. రియల్ ఎస్టేట్ గాలి బుడగ : 2008 అక్టోబర్ 15న ఒక్క రోజే స్టాక్ మార్కెట్ ఒక ట్రిలియన్ వంద బిలియన్ డాలర్లను కోల్పోయింది. సెప్టెంబర్ నెలలో 7 ట్రిలియన్ డాలర్లు కోల్పోయింది. మొత్తంగా ప్రపంచ మార్కెట్ సంక్షోభ ఫలితంగా అక్టోబర్ మధ్య నాటికి 27 ట్రిలియన్ డాలర్లు నష్టపోయింది. 2.5 ట్రిలియన్ డాలర్ల పెన్షన్ నిధులతోపాటు 700 బిలియన్ డాలర్లు బ్యాంకులు కోల్పోయాయి. రుణ విధానం విషపూరితమై, పరపతి క్షీణించి తీవ్ర పరిణామాలు సంభవించాయి. ఈ పరిణామాలకు గృహ రుణాల సంక్షోభం ఉత్ప్రేరకం అయ్యింది. సబ్‌ప్రైమ్ అనే కొత్త పోకడ ద్రవ్యపెట్టుబడి సృష్టించిన విషనాగు.

    సబ్–ప్రైమ్ – సబ్–ప్రైమ్ గురించి తెలుసుకోవాలంటే అమెరికాలో అప్పులు ఇచ్చే విధానాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. అమెరికాలో అప్పులు తీసుకునేవారిని రెండు రకాలుగా వర్గీకరిస్తారు. 1) ప్రైమ్ అప్పులు తీసుకునేవారు. అప్పు చెల్లించేందుకు తగిన ఆస్తులను కలిగి ఉన్నవారికే ప్రైమ్ అప్పులు ఇస్తారు. 2) సబ్–ప్రైమ్ అప్పులు తీసుకునేవారు. అర్హతలేని, యోగ్యత లేని వారికి ఇటువంటి రుణాలు ఇస్తారు. ఈ రుణాలకు వారు గ్యారంటీ చూపకపోయినా పరవాలేదు. ఇంటిని తనఖాను పెడితే వచ్చే డబ్బును డబ్బు రూపంలో కాకుండా ఒక సెక్యూరిటీ బాండ్ రూపం ఇవ్వడం నేడు ద్రవ్య మార్కెట్‌లో సాధారణంగా అమలు జరుగుతున్న పద్ధతి. అమెరికాలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇటువంటి సెక్యూరిటీ బాండ్లను రుణాలు పొందే విధానం అభివృద్ధి అయ్యింది. నిజానికి ఇలాంటి సెక్యూరిటీ బాండ్లకు ఎటువంటి గ్యారంటీ ఉండదు. వాటిపై ఆధారపడి రుణాలు ఇవ్వడం అంటే గాలి దీపం పెట్టడం తప్ప మరోటి కాదు. ఈ విధంగా అమెరికా బ్యాంకులు ఎటువంటి హామీ లేకుండా కోట్లాది డాలర్లు అప్పులు ఇవ్వడం, తిరిగి అవి వాపస్ పొందలేకపోవడం (అప్పు తీసుకున్నవారు చెల్లించకపోవడం)తో 2007 చివర్లో అమెరికాలో సబై–ప్రైమ్ సంక్షోభం బద్దలైంది. 37వ పేజీ.

24. ట్రిలియన్ అంటే వేయి బిలియన్లు లేదా లక్ష కోట్లు. 38వ పేజీ.

25. కంగ్లామరేట్లు : కంగ్లామరేట్ అంటే ఒక గుత్త పెట్టుబడిదారీ సంస్థ. అది తన రంగంలోనే వివిధ ఇతర పారిశ్రామిక, సేవా రంగాల్లో అంటే బ్యాంకింగ్, రవాణా, ఇన్సూరెన్స్, కన్సల్టెన్సీ తదితర సేవా రంగాల్లో పెట్టుబడులు పెడుతుంది. ఈ విధంగా వివిధ రంగాల పరిశ్రమలపై

ఆర్థిక ఆజమాయిషీ కలిగి ఉండడం కంగ్లామరేట్ల లక్షణం. 42వ పేజీ.

26. పోర్ట్‌ఫోలియో పెట్టుబడి అంటే ట్రెజరీ బాండ్లు, సెక్యూరిటీలు, స్టాక్ మార్కెట్ షేర్లు, అభివృద్ధి కార్యక్రమాలలో పెట్టే పెట్టుబడుల షేర్లు వగైరాలలో పెట్టే పెట్టుబడి. 42వ పేజీ.

27. ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు చైనా సామ్రాజ్యవాదులు అమెరికాకు పోటీగా ఆసియాలో తన ఆధిపత్యాన్ని విస్తరించడం కోసం స్థాపించారు. ఇందులో వివిధ దేశాల పెట్టుబడులు ఉన్నప్పటికీ ప్రధానంగా చైనా తన స్వంత చొరవతోనే దీన్ని ఏర్పాటు చేసింది. 43వ పేజీ.

28. మలాకా జలసంధి ఆగ్నేయాసియాలో మలేషియా, ఇండోనేషియాలను వేరు చేసే జలసంధి. ఇది ఉత్తర హిందూ మహా సముద్రాన్ని, దక్షిణ దక్షిణ చైనా సముద్రాన్ని కలుపుతుంది. దీని పొడవు 800 కి.మీ. వెడల్పు 60–480 కి.మీ. వరకూ ఉంటుంది. దీని దక్షిణాన అనేక దీవులు ఉన్నాయి. ఈ జలసంధి ప్రపంచంలో అతి ముఖ్యమైన నౌకా మార్గాలలో ఒకటి. 45వ పేజీ.

29. హర్ముజ్ జలసంధి ఇరాన్‌కు అరేబియన్ ద్వీపకల్పానికి మధ్య ఉన్న ఒక సన్నని జలమార్గమే హర్ముజ్ జలసంధి. ఇది పర్షియన్ గల్ఫ్‌ను, అరేబియన్ సముద్రాన్ని కలుపుతుంది. దీని పొడవు 270 కి.మీ. వెడల్పు 50–80 కి.మీ. వరకు ఉంటుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా చమురును నౌకామార్గాల ద్వారా రవాణా చేసే గొప్ప వ్యూహాత్మక ఆర్థిక ప్రాముఖ్యతను కలిగి ఉన్నది. ఇందులో తుంబ్ అల్ కుబ్రా (పెద్ద తుంబ్), తుంబ్ ఎస్సుఘ్రా (చిన్న తుంబ్), అబు ముసా అనే మూడు దీవులున్నాయి. వీటిని 1971లో ఇరాన్ స్వాధీనం చేసుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఈ దీవులు నావంటున్నది. 46వ పేజీ.

30. నాన్–ఇంటర్‌ఫియరెన్స్ విధానం అంటే ఇతర దేశాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా, వాటి సార్వభౌధికారానికి భంగం కలిగించకుండా ఉండే విధానం. 47వ పేజీ.

31. పౌండ్ లేదా పౌండ్ స్టెర్లింగ్ బ్రిటన్ దేశ కరెన్సీ. నేడు ఒక పౌండుకు 77 రూపాయలు. 49వ పేజీ.

32. మైఖేల్ ప్రొబ్‌స్టింగ్, 'సామ్రాజ్యవాద శక్తిగా చైనా ఆవిర్భావం' నుంచి. 53వ పేజీ.

33. స్టాగ్‌ఫ్లేషన్ (స్టాగ్నేషన్+ఇన్‌ఫ్లేషన్) : అంటే ఆర్థిక పెరుగుదల స్తంభించిపోవడంతో పాటు నోట్ల ముమ్మరం పెరుగుతూ ఉండడం. ఇంకా సరళంగా చెప్పాలంటే సరుకుల డిమాండ్ పడిపోతూ ఉండడంతో పాటు వాటి ధరలు విపరీతంగా పెరుగుతూండడం.

    సరుకుల డిమాండ్ పడిపోవడంతో, పరిశ్రమలు అధికోత్పత్తికి లోనై మూసివేయబడుతుంటాయి. నిరుద్యోగం విలయతాండవం చేస్తుంది. మరో పక్క నిత్యావసర వస్తువుల ధరలు మిన్నంటుతుంటాయి. ప్రజల కొనుగోలు శక్తి మరింత పడిపోవడం, మరిన్ని పరిశ్రమలు మూతపడడం, నిరుద్యోగుల సంఖ్య ఇంకా పెరగడం, ఐనా ధరలు

పెరుగుతూనే ఉండడం - ఇలా సంక్షోభం తీవ్రతరమవుతూ ఉంటుంది. ఇటువంటి సంక్షోభం నుండి ఆర్థిక వ్యవస్థ బయటపడడం అసాధ్యం. విప్లవమే లేదా యుద్ధమే శరణ్యం.

గమనించదగ్గ విషయం ఏమంటే ఈ స్టాగ్‌ఫ్లేషన్ అనేది రెండవ ప్రపంచ యుద్ధం ముందటి కాలంలో ఉనికిలోనే లేదు ఎప్పుడు అధికోత్పత్తి సంక్షోభం సంభవించినా, ధరలు విపరీతంగా పడిపోవడం అనేది సంక్షోభపు దశలోనూ, ఆర్థిక మాంద్యపు దశ (రెసెషన్ లేదా అంతకంటే లోతైనా డిప్రెషన్) లోనూ ఉనికిలో ఉంది. అటు పిమ్మట రికవరీ మరియు బూమ్ దశల్లో ధరలు పెరగనారంభించేవి. ఆ విధంగా సైకిల్ (క్రమం) పూర్తయ్యేది. ఇది 1914 వరకూ కొనసాగింది. ఐతే ఆ తరువాత రెండవ ప్రపంచ యుద్ధం వరకు పాత సైకిల్ కొనసాగక పోయినప్పటికీ, సంక్షోభంలో ధరలు పడిపోవడమంటూ ఉండేది. 1929-32 ఆర్థిక మాంద్యపు కాలంలో ధరలు విపరీతంగా పడిపోయాయి. కానీ రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో ముఖ్యంగా 1973 సంక్షోభం నుండి డిమాండ్ ఎంత తరిగిపోయినా, అధికోత్పత్తి వలన పరిశ్రమలు మూసివేయబడుతున్నా ధరలయితే ఏ మాత్రం తగ్గడం లేదు. పెట్టుబడిదారుల మధ్య పోటీ వలన ధరలు తగ్గుతాయని చెప్పే అన్ని రకాల బూర్జువా ఆర్థిక సిద్ధాంతవేత్తలు స్టాగ్‌ఫ్లేషన్ ఎందుకు వస్తున్నదో చెప్పలేకపోయేవారు లేదా తెలిసినా చెప్ప సాహసించడం లేదు. 63వ పేజీ.

34. మావో రచనలు, 3వ సంపుటి, పే. 255, క్రాంతి ప్రచురణలు. 65వ పేజీ.